fb/prajasakti, www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 61 | విజయవాడ, శనివారం 3 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



గొట్టిపాడు రండి
వివక్ష
చూడండి
రేపు చలో
గుంటూరు 3

ఈశాన్య రాష్ట్రాలలో
నేడే ఓట్ల లెక్కింపు
భారీ భద్రత ఏర్పాట్లు

షిల్లాంగ్ : ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ శనివారం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాలలో భద్రత కోసం బలగాలను నియమించినట్లు తెలిపారు. మూడు రాష్ట్రాలలో ఓట్ల లెక్కింపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమౌతుందని ఎన్నికల కమిషన్ తెలిపింది. త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 18న జరగ్గా, నాగాలాండ్, మేఘాలయలో ఫిబ్రవరి 27న జరిగాయి. మూడు రాష్ట్రాల అసెంబ్లీలో 60 స్థానాల చొప్పున మిగతా 9లో



3.10 కోట్లు

- దేశంలో నిరుద్యోగుల సంఖ్య
- అధికారిక రికార్డుల ప్రకారమే
- రికార్డుస్థాయికి చేరిక
- సిఎంఐఇ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగుల సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య దేశ వ్యాప్తంగా రికార్డు స్థాయికి చేరింది. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌తో పాటు, ఇతర అధికారిక సంస్థలు ఏజెన్సీల వద్ద నమూదు చేసుకున్న వారే 3.10 కోట్ల మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని సిఎంఐఇ తెలిపింది. అధికారిక ఏజెన్సీల వద్ద నమోదు చేసుకోని వారి వివరాలను కూడా చేరిస్తే ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. 2014 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఏటా లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తామని నరేంద్రమోడీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలాయన్న విషయం స్పష్టమౌతోంది. తాజా అధ్యయనం ప్రకారం గత నెల 25తో ముగిసిన వారాంతానికి 7.1 శాతానికి నిరుద్యోగ రేటు చేరుకుంది. గత 15-16 నెలల కాలంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిరుద్యోగ సమస్య గరిష్ట స్థాయికి చేరుకున్నదని ఈ అధ్యయన నివేదికలో పేర్కొన్నారు. అంతకుముందు లభించిన అరకొర ఉద్యోగాలు కూడా దొరక్కపోవడంతో గత ఏడాది జులై నుండి నిరుద్యోగుల సంఖ్య దేశ వ్యాప్తంగా గణనీయంగా పెరుగుతోంది. సమీప భవిష్యత్‌లో సైతం ఉద్యోగావకాశాలు ఆశించిన మేర కన్పించకపోవటంతో మిగతా 9లో

జాతీయ స్థాయిలో
ఆందోళన

- పార్లమెంటులో ఉధృతంగా నిరసన
- టిడిపి పార్లమెంటరీ సమావేశంలో చంద్రబాబు
- వేరే రాష్ట్రాలకు హోదా కొనసాగిస్తే మనకూ ఇవ్వాల్సిందే
- రాయలసీమ డిక్లరేషన్‌పై మండిపాటు

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై అన్నిపార్టీలకూ లేఖలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై జాతీయ స్థాయిలో ఆందోళన చేపడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తెలిపారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన టిడిపి పార్లమెంటరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీలకు, ఆ పార్టీల ఎంపీలకు లేఖలు రాయనున్నట్లు తెలిపారు. హోదా వద్దని టిడిపి ఎప్పుడూ అనలేదని ఎంపిలతో చంద్రబాబు అన్నారు. హోదా ఒక్కటే చాలదని, దాంతో పాటే విభజన చట్టంలోని మిగతా 2లో

'హోదా'పై ఉక్కుపాదం

శిబిరం తొలగింపు - దీక్షల భగ్నానికి యత్నం

15 మంది వామపక్ష నాయకుల అరెస్ట్

పోలీస్ స్టేషన్లో దీక్ష కొనసాగింపు 2



రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్యమిస్తే అరెస్టులా? : సిపిఎం | ఆ రాష్ట్రాలకు హోదా పొడిగిస్తే ఎపికి ఇవ్వాలని కోరుతా : హరిబాబు | హోదా కోసం పోరాడితే నిర్బంధిస్తారా ? : రఘువీరారెడ్డి 2

నెత్తురోడిన దండకారణ్యం

తెలంగాణ..ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టులు, కానిస్టేబుల్ మృతి



హెలీకాప్టర్ ద్వారా భద్రాచలానికి మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి), హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శుక్రవారం తెల్లవారుజామున తుపాకీ తూటాలతో దండకారణ్యం నెత్తురోడింది. సంయుక్త ఆపరేషన్ నిర్వహించిన ఇరు రాష్ట్రాల పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు, గ్రేహౌండ్స్ కమాండో ఒకరు మృతి చెందారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు గ్రేహౌండ్స్ కమాండోలు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. చనిపోయిన మావోయిస్టుల్లో ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

ఛత్తీస్‌ఘడ్-తెలంగాణ సరిహద్దుల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం తడపల గుట్ట - పూజారికాంకేడు అటవీ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు సమావేశం అవుతున్నారనే సమాచారంతో ఇరు రాష్ట్రాలకు చెందిన గ్రేహౌండ్ బలగాలు సంయుక్తంగా గురువారం మిగతా 9లో

పంపకాలపై పీటముడి

ఏపీకి 9, తెలంగాణకు 24 టిఎంసీలు

అభ్యంతరం వ్యక్తం చేసిన ఏపీ అధికారులు

ఎవరి వాదనలు వారివే

అసంపూర్తిగా ముగిసిన బోర్డు సమావేశం

సోమవారం మరోసారి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా నది నీటి కేటాయింపుల్లో పీటముడి పడింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వినియోగంపై ఇరు రాష్ట్రాలూ ఎవరి వాదనల్ని వారు వినిపించారు. నీటి వినియోగం విషయంలో ఎవరి లెక్కలు వారు చూపించడంతో బోర్డు సమావేశం అసంపూర్తిగా ముగిసింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద నీటి విడుదల విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య చోటుచేసుకున్న వివాదం నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ అయ్యింది. సభ్య కార్యదర్శి పరమేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 33 టిఎంసీల నీటి లభ్యత ఆధారంగా తెలంగాణకు 24 టిఎంసీలు, ఏపీకి 9 టిఎంసీలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ కేటాయింపులపై ఏపీ అధికారులు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నీటి వినియోగంలో తెలంగాణ అధికారులు తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఆరోపించారు. గత కేటాయింపుల ప్రకారం ఏపీకి ఇంకా 36 టిఎంసీలు వాడుకునే హక్కు ఉందని తేల్చి చెప్పింది. ఏప్రిల్ మొదటి వారం వరకు సాగు, తాగునీటి అవసరాల కోసం 26 టీఎంసీలు కేటాయించాలని పట్టుబట్టారు. ఇదే సమయంలో ఏపీ అధికారుల వాదనల్ని తెలంగాణ అధికారులు తోసిపుచ్చారు. జనవరిలో చేపట్టిన నీటి కేటాయింపుల (ఏపీకి 60, తెలంగాణకు 50 టీఎంసీలు) కంటే అదనంగా ఏపీ వాడుకుందని తెలంగాణ అధికారులు వాదించారు. ఇప్పటికే 62.32 టీఎంసీల నీరు వినియోగించుకోగా తెలంగాణ 33.50 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకున్నామని చెప్పారు. గత కేటాయింపుల ప్రకారం ఇంకా 16.42 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు ఉందని తెలంగాణ అధికారులు వాదించారు. దీంతో బోర్డు సభ్య కార్యదర్శి కల్పించుకుంటూ సాగునీటి అవసరాల కోసం ఏపీకి 9, తెలంగాణకు 24 టిఎంసీలు వినియోగించు కోవాలని సూచించారు. మార్చి మిగతా 9లో

బడ్జెట్ సమావేశాలపై
వైసిపి గుంభనం..!

- హాజరైతే మేలంటున్న ఆ పార్టీ ఎంఎల్ఏలు
- ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం
- సమావేశాలప్పుడు గుంటూరు జిల్లాలోనే జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మరో 48 గంటల్లో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీకి హాజరవుతుందా? లేదా అన్నది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీ నేతలు కూడా ఈ విషయమై పెదవి విప్పడం లేదు. అంతర్గతంగా మాత్రం ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఫిరాయింపు మంత్రులపై పట్టుపట్టిన వైసిపి, గతంలో జరిగిన శీతాకాల సమావేశాల్ని బహిష్కరించి అసెంబ్లీకి హాజరు కాలేదు. దీనిపై పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశాలకు హాజరుకావడం మేలన్న అభిప్రాయం వైసిపికి చెందిన పలువురు ఎంఎల్ఏలలో వ్యక్తమవుతోంది. అనధికారికంగా మీడియాతో మాట్లాడినప్పుడు ఇదే విషయాన్ని వారు చెబుతున్నారు. అయితే, పాదయాత్రలో ఉన్న తమ అధినేత నుండి ఇప్పటివరకు ఎటువంటి సంకేతం అందకపోవడంతో ఈ విషయంపై బాహాటంగా మాట్లాడటానికి వారు సిద్ధపడటం లేదు. ఒకటి, రెండు రోజుల్లో ఈ విషయమై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం నాడు ఆందోళనకు వైసిపి పిలుపుఇచ్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి శుక్రవారం నాడే పలువురు తరలివెళ్లారు. ఆ పార్టీ ఎంఎల్ఏలకు కూడా ఈ అందోళనలో భాగస్వాములు కానున్నారు. దీంతో తొలి రోజు సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి వైసిపి నుంచి ఎవరూ హాజరయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. ఒక వేళ అసెంబ్లీ సమావేశాలకు హాజరు మిగతా 9లో



ప్రకాశం జిల్లా చీమకుర్తి సమీపంలో పాదయాత్ర చేస్తున్న జగన్‌ను ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక నాయకులు శుక్రవారం కలిసి మద్దతు కోరారు. కార్మికుల సమ్మెకు పూర్తి మద్దతు ఉంటుందని జగన్ హామీ ఇచ్చారు. ఈ నెల 7న నిర్వహించనున్న 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమంలో వైసిపి శ్రేణులు పాల్గొంటాయని జగన్ తెలిపినట్లు ఐక్య వేదిక సెక్రెటరీ జనరల్ ఎం.బాలకాశి పేర్కొన్నారు. 7

మార్చి మొదటి రోజే 39 డిగ్రీలు

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో రోజురోజుకూ ఎండలు విజృంభిస్తున్నాయి. మార్చి రెండో తేదీనే 39 డిగ్రీల మేరకు ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కృష్ణాజిల్లా నందిగామలో శుక్రవారం 39 డిగ్రీలు నమోదైంది. బాపట్ల, ఒంగోలు, గన్నవరంలోనూ 36 డిగ్రీలు, రెంటచింతలలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. విశాఖ ఎయిర్ పోర్టులో 36.4 డిగ్రీలకు చేరుకుందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు పేర్కొ న్నారు. రాయలసీమలోనూ ఎండలు మండుతున్నాయి. కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురంలో 38 నుంచి 40 మధ్యలో మిగతా 9లో

సినిమా థియేటర్ల బంద్

నిరాశగా వెనుదిరిగిన అభిమానులు

ప్రజాశక్తి-యంత్రాంగం

తెలుగు చలనచిత్ర పరిశ్రమకు అత్యంత భారంగా తయారైన డిజిటల్ ప్రొవైడర్ ఛార్జీలకు వ్యతిరేకంగా దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్ల యాజమాన్యాలు ప్రదర్శనలను నిలిపివేశాయి. హోలీ సెలవు కావడంతో థియేటర్ల వద్దకు వచ్చిన సినీ అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా మొత్తం 54 థియేటర్లు, విజయనగరం జిల్లాలో 45 థియేటర్లు మూతపడ్డాయి. విశాఖ గ్రామీణ జిల్లాలోని థియేటర్ల బంద్ విజయవంతమైంది. విశాఖపట్టణంలోని జివిఎంసి పరిధిలోని 44 సినిమా థియేటర్లు, రూరల్ ప్రాంతంలో అన్నీ మూతపడ్డాయి. తూర్పుగోదావరి జిల్లాలో 140 సినిమా థియేటర్లలో ప్రదర్శనలు నిలిచిపోయాయి. ఆయా సినిమా థియేటర్ల యాజమాన్యాలు థియేటర్ల ముందు ప్రేక్షకులకు సమాచారం మిగతా 9లో



విజయవాడలో మూసేసిన శైలజా థియేటర్

రూ.44.15 కోట్లతో మత్స్యశాఖ ప్రాజెక్టులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మత్స్యశాఖను పటిష్టపర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది ప్రాజెక్టుల్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులకు రూ.44.15 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. నాబార్డు, గ్రామీణ మౌలిక వసతుల అభివద్ధి సంస్థ(ఆర్ఐడీఎఫ్) నిధుల నుంచి ఈ మొత్తాన్ని కేటాయించారు. అధునాతన శిక్షణ, పరిశోధన కేంద్రం, చేపల పెంపకానికి, బ్రూడ్ బ్యాంకుల నిర్మాణానికి ఈ నిధుల్ని వినియోగించనున్నారు. అదేవిధంగా కష్ణా జిల్లా పోరంకిలోని ఎన్టీఆర్ అడ్వాన్స్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌కు రూ.38.70 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో చిత్తూరులో మత్స్య పరిశోధన కేంద్రం, విజయనగరం జిల్లా తోటపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, తూర్పుగోదావరి జిల్లా కడియంలో బ్రూడ్ బ్యాంకులు, గుంటూరు జిల్లా దుర్గి, శ్యామరాజుపురం, ఆత్మకూరు కాలనీ, ముత్యాలంపాడులో చేపల చెరువుల నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు ప్రణాళికల్ని రూపొందించారు.

సన్నివేశం



గుంటూరు జిల్లా తెనాలిలో శుక్రవారం చలనచిత్ర, టివి, రంగస్థల అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నందినాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన 'పరాధీన భారతం'లో సన్నివేశం

ఓ మనిషీ మళ్లీ పుట్టు..

సందేశాత్మకంగా నంది నాటకోత్సవ ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

కుటుంబం, సమాజంలోని పలు ఘటనలు, నేటి కాలమాన పరిస్థితులను ఇతి వృత్తాలుగా తీసుకుని ప్రదర్శిస్తున్న నాటికలు ఆసాంతం ఆలోచనాత్మకంగా సాగుతున్నాయి. గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రాష్ట్ర చలనచిత్ర, టివి, రంగస్థల అకాడమీ ఆధ్వర్యంలో నందినాటకోత్సవాలు కొద్దిరోజులుగా నిర్వహిస్తున్నారు. ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం నాటక, నాటిక విభాగాల్లో ఐదు ప్రదర్శనల్లో కళాకారులు రంజింపజేశారు. 'ఓ మనిషీ మళ్లీపుట్టు'లో తల్లిలేని పిల్లను మరో వ్యక్తి ఆప్యాయంగా చూసుకోవడం అనంతర కాలంలో అతనికి అనారోగ్యం వల్ల కిడ్నీ ఇవ్వడానికి ఆమె ముందుకు రావడం, ఎంతో భవిష్యత్ ఉన్న పిల్ల కిడ్నీని తీసుకోవడం ఇష్టంలేని అతను చెప్పకుండానే వెళ్లిపోవడం మనిషికీ, మనిషికీ మధ్య ఉన్న ప్రేమాను బంధాన్ని తడిమింది. ఇచ్చిన మాటను నిలపెట్టుకోవాల్సిన ప్రాధాన్యాన్ని 'ఈసారి వదిలేయ్' ప్రదర్శన చాటింది. ఇక్కడి స్కాలర్‌షిప్‌లతో చదివిన వారు విదేశాలపై మోజుతో ఇతర దేశాల్లో స్థిరపడుతున్న క్రమంలో వారు కనీసం వారి స్వగ్రామాలనైనా దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, లేకుంటే ఆదాయంలో 30 శాతం దేశానికి ఇవ్వాలనే అంశాన్ని 'పరాధీన భారతం' స్పృశించింది. అధ్యాత్మిక పంథాలో 'అహం వహామి', పులిబారిన పడిన గ్రామస్తులు దాన్ని ఎదుర్కొనేందుకు ఐక్యత అనే సత్యాన్ని తెలుసుకోవడమనే సందేశం ఇచ్చింది.

ప్రజ్ఞ

1. విద్యార్థులకు సమాచారం, మార్గదర్శకం కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
2. ఆస్ట్రేలియా నూతన ఉప ప్రధాని?
3. ఈ గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు ఎక్కడ జరిగింది?
4. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ తాజాగా ఏ దేశంపై నిషేధాన్ని తొలగించింది?
5. విజయ్ హాజరే టోఫ్రీ 2018 విజేత?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

జాతీయ స్థాయిలో ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

హామీలన్నీ అమలు చేయాలని, అప్పుడే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలదని అభిప్రాయపడ్డారు. ఈ నెల 5 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్‌లో ఆందోళనను మళ్లీ ఉధృతం చేయాలని ఎంపిలకు చంద్రబాబు సూచించారు. కేంద్రంపై ఒత్తిడి పెంచాలని అన్నారు. వేరే రాష్ట్రాలకు హోదా కొనసాగిస్తే ఏపీకి కూడా అదే పేరుతో ఇవ్వాల్సిందేనన్నారు. విభజన వల్ల ఏపీకి తగిలిన గాయాలు నాలుగేళ్లయినా మానలేదన్నారు. కాంగ్రెస్ అన్యాయం చేసినందునే ఆ పార్టీ పోయిందని, ఇప్పుడు బిజెపి కూడా అన్యాయం చేస్తుందేమోనని ప్రజలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. హోదాకు అడ్డంకులున్నాయని, వేరే రాష్ట్రాలకు కూడా హోదా ఉండదని చెప్పినందునే అప్పట్లో ప్రత్యేక సాయానికి అంగీకరించామని వివరించారు. తలసరి ఆదాయంలో పొరుగు రాష్ట్రాల కన్నా రూ.35 వేలు వెనుకబడి ఉన్నామని, దేశ తలసరి ఆదాయంతో పోల్చడం సరికాదని అన్నారు. హోదా తప్ప విభజన చట్టంలోని 18 అంశాలను వైసిపి వదిలేస్తోందన్నారు. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలదోయడం మొదలు ఇప్పటి వరకూ టిడిపి ఎన్నో సంక్షోభాల్ని ఎదుర్కొందన్నారు. బిజెపి రాయలసీమ డిక్లరేషన్‌పై మండిపడ్డారు. కేంద్రాన్ని నిధులు అడగకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడతారా అని ప్రశ్నించారు. సంప్రదింపుల్లో అశ్రద్ధ చేయలేదని, నిన్న కూడా సంప్రదింపులు జరిపామని తెలిపారు. ప్రజా ప్రయోజనాలపై రాజీపడే ప్రసక్తిలేదని, హోదా ఇచ్చి, మిగిలినవి ఇవ్వకపోతే రాష్ట్రం నష్టపోతుందని అన్నారు. ప్రజల మనోభావాల్ని గౌరవించి, అడిగింది ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆర్థికలోటు భర్తీకి ఫార్ములా ఇచ్చామన్న కేంద్రం వాదనపై సిఎం ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఏం ఫార్ములా ఇచ్చారు? అని ప్రశ్నించారు. ఎంత ఇవ్వాలో మనం అడగటమేంటన్నారు. వైసిపికి విశ్వసనీయత లేదని, నాటకాలు ఆడుతోందనే భావన ప్రజల్లోకి వెళ్లిందన్నారు. టిడిపి చిత్తశుద్ధితో పోరాడుతోందనే సానుభూతి ప్రజల్లో ఉందన్నారు.

పోరాటాన్ని ఉధృతం చేస్తాం: ఎంపిలు

పార్లమెంట్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, దశల వారీగా ప్రణాళికతో పోరాడతామని టిడిపి ఎంపిలు ఉద్ఘాటించారు. శుక్రవారం టిడిపి పార్లమెంటరీ సమావేశం ముగిసిన అనంతరం ఎంపిలు రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్, తోట నరసింహం, మురళీమోహన్ మీడియాతో మాట్లాడారు. ఎపికి రావాల్సిన వాటిపైన సిఎంతో చర్చించామన్నారు. నిరసన తెలిపినా సాయం చేసిన పరిస్థితులు లేవని, పార్లమెంట్‌ను స్తంభింపజేసి కేంద్రాన్ని నిలదీస్తామని తెలిపారు. ప్రత్యేక సాయం ఇవ్వకపోవడంతోనే మళ్లీ హోదా అడగాల్సి వస్తోందన్నారు. ప్రతిసారీ చెప్పిందే చెప్పి ఉన్న ఆశను నీరుగార్చారని, ఇక కేంద్రంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. 19 అంశాల్ని నెరవేరుస్తామన్న హామీని కేంద్రం ఇవ్వాలన్నారు. రాష్ట్ర సమస్యను జాతీయ సమస్యగా తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఆర్థిక లోటును భర్తీ చేసేందుకు కేంద్రం ఇప్పటి వరకూ ఏ ఫార్ములానూ ఇవ్వలేదని, మనల్ని ఫార్ములా అడగడమేంటని వారన్నారు. పార్లమెంట్‌లో సస్పెండ్ చేస్తే అదే ఒక చరిత్రగా మిగిలిపోతుందన్నారు.

వైసిపి ఎంపీలు రాజీనామా చేస్తే..నేనూ చేస్తా - ఎంపి జెసి దివాకర్‌రెడ్డి

జగన్ వాళ్ల ఎంపీలతో రాజీనామా చేయిస్తే తాను కూడా రాజీనామా చేస్తానని టిడిపి ఎంపి జెసి దివాకర్‌రెడ్డి సవాల్ విసిరారు. ' అనంతపురంలో పోటీ చేద్దాం...ఎవరు గెలుస్తారో చూద్దాం ' అని అన్నారు. కేంద్రం భిక్ష వేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందదన్నారు. రైల్వే జోన్‌కు మహా అయితే రూ.10 కోట్లు బిల్డింగులకు అవుతాయని, అది కూడా కేంద్రం ఇవ్వలేకపోతోందని, రాష్ట్రానికి ఇంకేమిస్తుందని అన్నారు. రాజీనామాలతో ఒరిగేదేమీ లేదని, ఎంపీల రాజీనామాతో కేంద్రం దిగిరాదని తెలిపారు. చంద్రబాబు సహనాన్ని కేంద్రం పరీక్షిస్తోందని, చంద్రబాబు సహనం ఎంతో కాలం ఉండదని పేర్కొన్నారు. ఢిల్లీలో అమిత్‌షాతో ఎంపీలు జరిపిన చర్చల వల్ల ఉపయోగం లేదన్నారు. కేంద్రంపై వైసిపి పెడుతున్న అవిశ్వాసం ప్రజలను మభ్యపెట్టడానికేనని, వైసిపి అవిశ్వాసం అసలు అడ్మిట్ కూడా కాదని ఆయన అన్నారు.

ఆ రాష్ట్రాలకు హోదా పొడిగిస్తే ఏపీకీ ఇవ్వాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో మూడు రాష్ట్రాలకు హోదా పొడిగించినట్లు కొందరు చెబుతున్నారని, ఇదే నిజమైతే రాష్ట్రానికి కూడా హోదా ఇవ్వాలని తానే స్వయంగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తానని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు అన్నారు. విజయవాడలోని ఐవి ప్యాలెస్‌లో 'కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే - ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి' పేరుతో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించిందంటే కేంద్రం సహకారం ఉందన్నారు. విభజన అనంతరం రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బిజెపి ముందే గుర్తించిందన్నారు. అందుకే విభజనకు బహిరంగంగానే మద్దతు తెలిపిందన్నారు. 14వ ఆర్థిక సంఘం సిపార్సుల కారణంగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడం సాధ్యం కాలేదన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్ని అమలు చేశామని, మరికొన్నింటి విషయంలో కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. చట్టంలో లేని అంశాల్ని ఎన్నింటినో కేంద్రం అమలు చేసిందన్నారు. రాజధానికి సంబంధించి కేంద్రానికి ఎటువంటి ప్రతిపాదనలు అందకపోయినా సీఆర్డీఏ పరిధిలో భూగర్భ డ్రైనేజీ పేరుతో రాజధానికి రూ.1000 కోట్లు, మరో విడతగా రూ.1,500 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కడపలో ఉక్కు పరిశ్రమ, విశాఖ రైల్వే జోన్‌కు కేంద్రం సానుకూలంగా ఉందని, దుగరాజపట్నం పోర్టు విషయంలో సాంకేతిక సమస్యలున్నందున ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని గుర్తిస్తే పోర్టు నిర్మాణాన్ని కేంద్రం చేపడుతుందన్నారు. ఆరోపణలు, ఘర్షణ వాతావరణంలో అభివృద్ధి సాధ్యం కాదన్నారు.

హోదా అడిగితే నిర్బంధిస్తారా?

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్న వారిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు చేయించడం దారుణమని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుట్రపూరితంగా చంద్రబాబు అరెస్టు చేయించారని విమర్శించారు. ఒకసారి హోదా అని, మరోసారి ప్రత్యేక ప్యాకేజీ అని చంద్రబాబు రోజుకో మాట మారుస్తున్నారన్నారు. 'ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు' అని పేర్కొన్నారు. చంద్రబాబుపై ఉన్న కేసుల కోసమే కేంద్రానికి హోదాను తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఆయనకు సిగ్గుంటే ముందు తన కేంద్రమంత్రులు, ఎంపీలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ, చంద్రబాబు తోడుదొంగలని, కేంద్రం డైరెక్షన్‌లోనే చంద్రబాబు ఇక్కడ నాటకాలాడుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హోదాపై ఆందోళనలు జరుగుతున్నా ఇప్పటకీ చంద్రబాబు వైఖరి ఏమిటో స్పష్టం చేయడం లేదన్నారు. ఎంతమందిని అరెస్టు చేసినా హోదా కోసం పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

రఘువీరారెడ్డి అరెస్టు, విడుదల

అంతకుముందు విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని స్క్యూబ్రిడ్జి జాతీయ రహదారి వద్ద ధర్నా చేస్తున్న రఘువీరారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా కేంద్రం మోసం చేస్తోందని కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి రఘువీరారెడ్డి, సుంకర పద్మశ్రీ, కొలనుకొండ శివాజీ, మీసాల రాజేశ్వరరావు, ధనేకుల మురళి తదితరుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకొంది. తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో నాయకుల్ని అరెస్టు చేసి కంకిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

బడ్జెట్‌లో విద్యాశాఖకు 30 శాతం కేటాయించాలి

కేంద్ర వైఖరికి నిరసనగా13న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడ్జెట్‌లో 2018-19 విద్యాసంవత్సరానికి గాను విద్యాశాఖకు 30 శాతం నిధులు కేటాయించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం విజయవాడలో శుక్రవారం సాబ్జీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పాఠశాలల్ని ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. శాసనసభ సమావేశాల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తూ తీర్మానం చేయాలని కోరారు.11వ పిఆర్‌సి కమిటీ వేయాలని, పిఆర్‌సి ఎరియర్స్ చెల్లించాలని జెఎసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఏపీ పట్ల కేంద్రం వైఖరికి నిరసనగా జెఎసి ఆధ్వర్యంలో 13న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ చేపట్టాలని ఫెడరేషన్ పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు కెఎస్ఎన్ ప్రసాద్, సహాధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, కోశాధికారి కె శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు గిరిధర్, శ్రీదేవి, పద్మావతి, వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

'హోదా'పై ఉక్కుపాదం

- శిబిరం తొలగింపు - దీక్షల భగ్నానికి యత్నం
- 15 మంది వామపక్ష నాయకుల అరెస్ట్
- పోలీస్ స్టేషన్లో దీక్ష కొనసాగింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు చేపట్టిన ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. శ్రీకాకుళంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద మూడు రోజుల పాటు చేపట్టనున్న రిలేదీక్షల శిబిరాన్ని తొలిరోజు శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి ప్రారంభించిన కొద్దిసేపటికే పోలీసులు తొలగించారు. దీక్షా శిబిరాన్ని తొలగించి సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు భవిరి కృష్ణమూర్తి, సనపల నర్సింహులతో పాటు 15 మందిని బలవంతంగా అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట వామపక్ష నాయకులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. వారిని కూడా పోలీసులు బలవంతంగా స్టేషన్లోకి తరలించారు. పోలీస్ స్టేషన్‌లోనే రిలే దీక్షను వామపక్ష నాయకులు కొనసాగించారు. అరెస్టయిన వారిని వైసిపి సిఇసి సభ్యులు అంధవరపు సూరిబాబు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాంద్ర ప్రకాశరావు, లోక్‌సత్తా సీనియర్ నాయకులు కొత్తకోట పోలినాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.మిన్నారావు కలిసి సంఘీభావం తెలిపారు.



వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆందోళన చేస్తే అరెస్ట్‌లా?

తక్షణమే విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని శ్రీకాకుళంలో నిరసన దీక్షలు చేస్తున్న వామపక్ష కార్యకర్తల్ని అరెస్టు చేయడాన్ని సిపిఎం ఖండించింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆందోళన చేస్తుంటే అరెస్ట్‌లు చేస్తారా అని ప్రశ్నించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరెస్ట్‌యిన వారు నిర్బంధానికి వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్లలో సాయంత్రం వరకూ నిరసన దీక్షల్ని కొనసాగించారి తెలిపారు. నందిగామ మండల కేంద్రంలోనూ మధ్యాహ్నం టెంట్‌ను పీకేసి అరెస్టు చేశారన్నారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలని ప్రజాతంత్రవాదుల్ని మధు కోరారు.

ఒక రోజు ముందుగానే ముగిసిన టెట్

- 91.94శాతం హాజరు
- రేపు 'కీ' విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఒక రోజు ముందుగానే ముగిసింది. ఫిబ్రవరి 21 నుంచి శుక్రవారం వరకు ఈ పరీక్ష జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 4,46,833 మంది దరఖాస్తు చేసుకున్న ఈ పరీక్షకు 4,10,828(91.94)శాతం హాజరయ్యారు. 190 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్లు టెట్ కన్వీనర్ ఎ సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-1ను 8 సెషన్స్‌లో, పేపర్-2ను 8 సెషన్స్‌లో, పేపర్-3ను మూడు సెషన్స్‌లో నిర్వహించామని, పేపర్-1,2ను ఒకే సెషన్‌లో నిర్వహించామని వివరించారు. అన్ని సెషన్లూ ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. పేపర్-1కు 1,80,742 మంది దరఖాస్తు చేసుకోగా, 1,71,052(94.64శాతం)మంది, పేపర్-కు 2,04,028 మంది దరఖాస్తు చేసుకోగా 1,81,304(88.86శాతం)మంది, పేపర్-3కు 62,063 మంది దరఖాస్తు చేసుకోగా 58,472(94.21శాతం) మంది హాజరయ్యారని వివరించారు. ఎపిటెట్-2017 ప్రాథమిక 'కీ'ను ఆదివారం cse.ap.gov.in, aptet.apcfss.in వెబ్‌సైట్లలో పొందుపరుస్తామని తెలిపారు. 'కీ'పై అభ్యంతరాలుంటే ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ఆన్‌లైన్‌లో ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా తెలపాలని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో అభ్యంతరాలు స్వీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

ప్రజల ముందుకు వాస్తవాలు

నేడు జెఎఫ్‌సి నివేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభజన హామీల అమలులో ఏర్పడిన గందరగోళాన్ని ఛేదించేందుకు ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సి) తన నివేదికను నేడు ప్రజల ముందుకు తీసుకురానుంది. గత రెండు రోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న వాటిలో వాస్తవాల్ని అన్వేషిస్తున్న కమిటీ సభ్యులు వాస్తవ పరిస్థితుల్ని ప్రజలకు తెలియజేయనున్నారు. శుక్రవారం మరోసారి భేటీ అయిన కమిటీ సభ్యులు, తుది నివేదికపై సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటి వరకు తన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే టార్గెట్ చేసినట్లుగా తెలుస్తోంది. హోదా, విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాన భాగస్వామ్యం ఉందని చెప్పే ప్రయత్నం చేస్తూనే...నిధుల విడుదల అంశాన్ని కేంద్రంపైనే నెట్టేసే ప్రయత్నం చేసినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల్ని బుట్టదాఖలు చేసి, నిధుల విడుదల, కేటాయింపుల్లో భారీగా కోత విధించినట్లు తన నివేదికలో పేర్కొన్నట్లు విశ్వనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రత్యేక హోదా అమలు చేసే విషయంలో కేంద్రానికి ఎంత బాధ్యత ఉందో దాన్ని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వానికీ అంతే బాధ్యత ఉందని కమిటీ సభ్యులు ఇప్పటికే అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శనివారం విడుదల కానున్న జేఎఫ్‌సీ నివేదికలో విభజన హామీల అమలుపై అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక ప్యాకేజీ అమలు విషయాన్ని కూడా తన నివేదికలో ప్రధానంగా ప్రస్తావించినట్లు సమాచారం. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే ఉన్నాయని, ప్రత్యేక ప్యాకేజీ ప్రకారం జరగలేదని నివేదికలో పేర్కొనట్లు తెలుస్తోంది.

అశ్లీలతను అరికట్టేందుకు మీడియా మానిటరింగ్ కమిటీ

- వర్మను అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన
- మహిళలపై హింసా వ్యతిరేక ఐక్యవేదిక వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలపై పెరుగుతున్న అశ్లీలతను అరికట్టేందుకు మేధావులు, ప్రముఖులతో మీడియా మానిటరింగ్ కమిటీ వేయాలని మహిళలపై హింసా వ్యతిరేక ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం గవర్నరుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఐక్యవేదిక నాయకులు డి.రమాదేవి, పి.దుర్గాంబ, ఆర్.నాగమణి, కె.శ్రీదేవి, పి.పద్మ, క్రాంతి తదితరులు మాట్లాడారు. సినిమాలు, సామాజిక మాధ్యమాలు, టివి ఛానళ్లలో స్త్రీలను అసభ్యంగా చూపడం వల్ల వారిపట్ల గౌరవం తగ్గి పోతోందని తెలిపారు. అత్యాచారాలు పెరు గుతున్నా యని, వారిని కించపరచడం, చులకనగా చూసే భావన పెరిగిపోతోందని తెలిపారు. దీన్ని ప్రభు త్వం వెంటనే గుర్తించి మానిటరింగ్ కమిటీ వేయాలని కోరారు. అలాగే హింసను ప్రేరేపించే విధంగా వ్యవ హరిస్తున్న రామ్‌గోపాల్‌వర్మను అరెస్టు చేయాలని కోరారు. విశాఖలో సదస్సు నిర్వహిస్తానని వర్మ చేస్తున్న ప్రకటనపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అతన్ని వెంటనే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ప్రజలే పట్టుకుని పోలీసులకు అప్పగిస్తారని పేర్కొన్నారు. వర్మను అరెస్టు చేయకపోతే ఈనెల 12 నుండి రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహారదీక్షలు చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే 15 నుండి నిరవధిక నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. ప్రకటనలపై సెన్సార్‌షిప్ లేదనే పేరుతో ఛానళ్లలోనూ, సినిమాల్లోనూ అసభ్యకరంగా ప్రకటనలు వేస్తున్నారని దీనిపై నియంత్రణ రావాల్సి ఉందన్నారు. ఒకపక్క అశ్లీలతను, దాన్ని పెంచే వ్యక్తు లనూ వదిలేసి, వారిపై కేసులు నమోదు చేయకుండా మరోవైపు మహిళా సాధికారిత అంటే అర్థం ఉండద న్నారు. ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా స్పష్టమైన ప్రకటన ఇస్తారా? లేదా అనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని వారు కోరారు. అశ్లీలతను వ్యతిరేకించే వారితో రౌండ్‌టేబుల్ సమావేశాల్ని నిర్వహిస్తామన్నారు. అన్ని సంఘాల మద్దతును కూడగడతామన్నారు. ఆందోళనల్లో విద్యార్థినీ, విద్యార్థులందరినీ భాగస్వాము లను చేస్తామన్నారు. 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంఘాలతోనూ ప్రదర్శనలు చేస్తామన్నారు. వర్మలాంటి వ్యక్తులకు జైలు తప్ప వేరే మార్గం లేదని హెచ్చరించారు.

సంక్షిప్తం

రాజధాని నిర్మాణానికి కిలారు విరాళం

అమరావతి బ్యూరో : రాజధాని నిర్మాణానికి జాతీయ యూత్ అవార్డు విజేత కిలారు నాగశ్రావణ్ రూ. 50 వేలు విరాళాన్ని అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం ఎంపి రామ్మోహన్ నాయుడుతో కలిసి అవార్డు ద్వారా పొందిన మొత్తాన్ని అందజేశారు.

రెండో రోజూ విధులు బహిష్కరించిన హైకోర్టు న్యాయవాదులు

హైదరాబాద్ : న్యాయమూర్తుల పోస్టుల్ని భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘాల పిలుపు మేరకు రెండో రోజు శుక్రవారం కూడా న్యాయవాదులు హైకోర్టు విధుల్ని బహిష్కరించారు. అత్యవసర కేసులు మాత్రమే విచారణ జరిగాయి. ఇరు సంఘాల అధ్యక్షులు కనకయ్య,ధనుంజయల ఆధ్వర్యంలో న్యాయ వాదులు ఆందోళనకు దిగారు. హైకోర్టు గేటు వద్ద న్యాయవాదులు సమావేశమై తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. 2015 నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఉన్నారు. పూర్తి స్థాయి లో సీజేను నియమించాలి. సీఆర్‌పీసీలోని సెక్షన్ 41ఎను రద్దు చేయాలి. 2012 నాటి వరకూ ఉన్న పెండింగ్ కేసుల్ని హైకోర్టులు సత్వరమే పరిష్కరించాలనే ఉత్తర్వుల్ని రద్దు చేయాలి' అని న్యాయవాద సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

హోదా సాధన కోసం ప్రత్యేక రైల్లో ఢిల్లీ పయనమైన వైసిపి నాయకులు

అమరావతి బ్యూరో : ప్రత్యేక హోదా సాధన కోసం ఈ నెల 5న ఢిల్లీలో ధర్నా చేయాలని వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వైసిపి కార్యకర్తలు, నాయకులు శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి ఢిల్లీకి బయలుదేరారు. వందలాది మంది కార్యకర్తలతో విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి బయలుదేరిన రైలును ఆ పార్టీ సీనియర్ నేత కె పార్థసారథి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు.

కోవూరులో సైకో వీరంగం

- మహిళలపై దాడులు
- ఒకరిపై అత్యాచారం

ప్రజాశక్తి-కోవూరు



గాయపడిన మహిళ

కోవూరులో సైకో గురువారం అర్ధరాత్రి వీరంగం సృష్టించాడు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడి చేశాడు. దాడి చేసిన ముగ్గురిలో ఒకరిపై అత్యాచారం చేసి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసుల వివరాల మేరకు.. కోవూరు మంగలివీధికి చెందిన ఓ మహిళ ఒక్కటే ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయంలో సైకో ఇంట్లోకి దూరి ఆమెపై అత్యాచారం చేశాడు. ఆమె తలపై కత్తితో విచక్షణారహితంగా గాయపరిచి రోకలిబండతో తలపై మోదాడు. అదే సమయంలో ఆమె ఇంటికి సమీప బంధువు రాగానే గొంతు విన్న సైకో అక్కడి నుంచి పారిపోయాడు. కోవూరు మందబయలు సెంటర్‌కు చెందిన టిఫిన్ అమ్ముతున వృద్ధురాలిపై దాడి చేశాడు. ఆమె తలపై తీవ్రంగా గాయపరిచాడు. లైబ్రరీ సెంటర్ వద్ద మరో మహిళపై కూడా దాడి చేశాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. సైకో దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె ప్రస్తుతం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. వృద్ధురాలు నెల్లూరులోని నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈమేరకు పోలీసులు పలువురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై ఎస్‌పి రామకృష్ణ సంఘటనస్థలానికి చేరుకుని బాధితుల ఇళ్లను పరిశీలించారు. పోలీసు జాగిలాల చేత తనిఖీలు నిర్వహించారు. చుట్టుపక్కల వారిని సైకోకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితుడ్ని అతి త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఆయన వెంట రూరల్ డిఎస్‌పి రాఘవరెడ్డి, సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐలు వెంకట్రావు, అంజిరెడ్డి తదితరులున్నారు.

గొట్టిపాడు రండి.. వివక్ష చూడండి..


పెద్దగొట్టిపాడులో దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు (ఫైల్)

- రేపే చలో గుంటూరు
- పెదగొట్టిపాడు పెత్తందార్లలో రాని మార్పు
- వారి చర్యను అడ్డుకున్న దళిత యువకులు
- 26 రోజులుగా బాధితుల దీక్షలు
- జీవన పరిస్థితులు దయనీయం
- కన్నెత్తీ చూడని అధికార పార్టీ నేతలు, అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో నెలకొన్న సమస్యలు యథాతథంగా కొనసాగుతున్నాయి. జనవరి ఒకటిన దళితులపై జరిగిన దాడి సంఘటనలను ఆసరాగా చేసుకుని గ్రామంలో దళితులను కలుసుకునేందుకు ఇప్పటికీ ఆంక్షలు కొనసాగుతున్నాయి. దళితులపై దాడి అనంతరం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు సమక్షంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదు. కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. ఇళ్ల కేటాయింపు పెండింగ్‌లో ఉంచారు. రూ.3 కోట్లతో దళితవాడలను అభివృద్ధి చేస్తామన్నా ఆ ఊసే లేదు. దళిత వాడల్లో కనీస సౌకర్యాల్లేవు. గ్రామంలో చెరువు ద్వారా ఉన్న నీటిని వీరు వినియోగించుకుంటున్నారు. బావుల్లో నీటిని వినియోగించుకోకుండా కొంత మంది కుట్రలు చేస్తున్నారు. బావిలో పేడ పడేసి గ్రామంలోని నీటిని కాల్వలకు మళ్లిస్తున్నారని దళితవాడకు చెందిన పోరాట కమిటీ నాయకులు జయభాగ్యమ్మ తెలిపారు. దళితవాడలో రెండేళ్ల కిందటే కొందరికి ఇళ్లు మంజూరు చేసినా వివిధ దశలో నిర్మాణాలు ఆగిపోయాయి. నిర్మించిన వాటిని డబ్బులు రాలేదు. గ్రామంలో దాడి జరిగి రెండు నెలలు దాటినా దళితులపై పెత్తందార్ల వైఖరిలో మార్పు రాలేదు. దళిత యువకులు స్వతంత్రంగా, ఆర్థికంగా ఎదుగుదలను పెత్తందార్లు జీర్ణించుకోలేకపోవడం వల్లే జనవరి 1న దళితులపై మూకుమ్మడి దాడి జరిగిందనే వాదన విన్పిస్తోంది. గతంలో మాదిగ చెరువును నీరు-చెట్టు పేరుతో తవ్వుకోవాలని టిడిపి నాయకులు ప్రయత్నించారు. దీనిని దళితులంతా ఐక్యంగా అడ్డుకున్నారు. దళిత వాడకు సమీపంలో మద్యం దుకాణం పెట్టాలని ప్రయత్నించగా దీన్నీ దళితులు అడ్డుకున్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని ఒక పథకం ప్రకారం జనవరి ఒకటిన దాడి చేసినట్లు చెబుతున్నారు. ఈ దాడి తరువాత ఇరుపక్షాల మధ్య రాజీచేశామని అంతా స్నేహంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ గ్రామంలో పరిస్థితులు మాత్రం భిన్నంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులకు వెళ్లే పరిస్థితి లేదు. గ్రామంలో కలిసి మెలిసి జీవించే పరిస్థితులు కల్పించడంలో అధికారులు ఏమాత్రమూ చొరవ తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి.

26 రోజులుగా కొనసాగుతున్న రిలే దీక్షలు

తమ డిమాండ్ల సాధనకు గ్రామంలో దళితులు 26 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఎవ్వరూ వీరితో సంప్రదించిన పాపాన పోలేదు. వీరి డిమాండ్లను పట్టించుకోలేదు. ప్రధాన నిందితులను అరెస్టు చేయాలని, వివక్షతను తొలగించాలని, దళిత వాడకు ప్రత్యేక పంచాయతీ ప్రకటించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. దళిత వాడలో కనీసం ఒక్క సిమెంట్ రోడ్డు కూడా లేదు. మట్టి రోడ్లు కన్పిస్తున్నా గ్రామానికి ఎస్‌సి ఎస్‌టి నిధులు కేటాయించినా ఇక్కడ మాత్రం సౌకర్యాలు మెరుగుపడలేదు.

హామీలను అమలు చేయని పోలీసులు

దళితులపై దాడి ఘటనలో బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన నలుగురు కీలక వ్యక్తుల అరెస్టు అంశంపై రెండు నెలలుగా ఉద్యమం కొనసాగుతోంది. ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలపాటి పాండు, ఉపేంద్ర, భాస్కరరావు, కోటేశ్వరరావును అరెస్టు చేస్తామని జిల్లా అధికారులు జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు రాములు ఎదుట జనవరి 31న హామీ ఇచ్చారు. కానీ నెల రోజుల తరువాత వారికి ఈ సంఘటనలో సంబంధం లేదని క్లీన్ చీట్ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో దళితుల ప్రధాన డిమాండ్ అమలుకు నోచలేదు. పెత్తందార్ల దాడిలో తీవ్రంగా గాయపడిన జొన్నలగడ్డ ప్రకాశం, జొన్నలగడ్డ జాన్, బూసి రిచా భరణం ప్రాణాపాయం నుంచి బయటపడి ఆస్పత్రి నుంచి ఇళ్లకు చేరుకున్నారు. ఆస్పత్రిలో గాయాలతో ఉన్నప్పుడు వీరు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం నలుగురు ప్రధాన నిందితులపై కేసు నమోదు చేయాలనే అంశాన్నీ అధికారులు పట్టించుకోలేదని బాధితులు చెబుతున్నారు.


గొట్టిపాడు సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు (ఫైల్)

4న చలో గుంటూరు

దళితులపై దాడులకు నిరసనగా ఈనెల 4న నిర్వహించే చలో గుంటూరుకు హాజరు కావాలని బాధితులు నిర్ణయించారు. వివిధ సంఘాలు, పార్టీల నేతల సమక్షంలో భవిష్యత్తు కార్యక్రమం ఉంటుందని భావిస్తున్నట్లు గ్రామానికి చెందిన దళితులు పలువురు తెలిపారు.


దళితవాడలో రహదార్ల దుస్థితి


టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న 84 మంది ఎర్రచందనం స్మగ్లర్లు

84 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం) / రేణిగుంట

ఎర్రచందనం స్మగ్లర్ల ఆటకట్టించేందుకు టాస్క్‌ఫోర్స్ తనదైన వ్యూహాలతో ముందుకెళుతోంది. నిఘా సమాచారం వ్యవస్థను పటిష్ట పరుస్తూ ఎర్రచందనం అక్రమ రవాణా పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి ఉపక్రమించింది. అందులో భాగంగా గురువారం రాత్రి తమిళనాడు రాష్ట్రంలోని ఆర్కాడ్ ప్రాంతం నుంచి సుమారు 84 మంది స్మగ్లర్లు ఎర్రచందనం చెట్లను నరకడానికి బయల్దేరారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అశోక్‌కుమార్ పక్కా వ్యూహంతో మూడు బృందాలుగా విడిపోయి రేణిగుంట-కడప మార్గంలో ఆంజనేయ పురం చెక్‌పోస్ట్ వద్ద స్మగ్లర్లు వస్తున్న లారీని ఆపారు. అందులో 84మందితోపాటు ఎర్రచందనం చెట్లను నరకడానికి ఉపయోగించే పరికరాలు, వంటసామగ్రి స్వాధీనం చేసుకుని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల ఎస్పీ రవిశంకర్ మాట్లాడుతూ.. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అత్యంత సాహసోపేతంగా ఆలోచించి 84మంది స్మగ్లర్లను అరెస్టు చేశారన్నారు. వేలూరు జిల్లా నుంచి 42 మంది, తిరువణ్ణామలై జిల్లా నుంచి 42 మంది వచ్చారన్నారు. వీరిని రేణిగుంట తహశీల్దార్ ముందు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పీలు హరినాథ్‌బాబు, లక్ష్మీనారాయణ, ఎసిఎఫ్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం కోసం రైతు దీక్ష

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

జాతీయ రహదారి 216-ఎ విస్తరణ నేపథ్యంలో భూములు కోల్పోయిన తమకు సరైన న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా బాపట్లలో మూడ్రోజులుగా దీక్షలు చేపట్టారు. ప్రకాశం జిల్లా వరకూ చేపట్టే ఈ నిర్మాణం వల్ల జిల్లాలోని పలు మండలాల్లో భూ సేకరణ కింద ప్రభుత్వం తీసుకుంటోంది. ఈ క్రమంలో బాపట్ల మండలం ఆసోదివారిపాలెం, నాగేంద్రపురం, యిమ్మడిశెట్టివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు అనేక మంది తమకు పరిహారం విషయంలో అన్యాయం చేశారని పేర్కొంటూ ఆందోళన బాట పట్టారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని, అస్తవ్యస్తంగా వేసిన భూమి విలువలను సరి చేయాలని కోరారు. దీక్షలకు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. మూడోరోజు దీక్షల్లో ఇమ్మడిశెట్టి నరసింహారావు, లక్ష్మికళ, తిమ్మన శ్రీనివాసులు, గోపాళం తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యనభ్యశించాలి

రాష్ట్ర శాసన సభాపతి కోడెల సూచన

ప్రజాశక్తి-గుంటూరు

బాలికలు ఉన్నత విద్యనభ్యశించటం ద్వారా మంచి ఉపాధి అవకాశాలుంటాయని రాష్ట్ర శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. మొత్తంగా ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారి శాతం తక్కువగా ఉంటే, బాలికల శాతం మరింత తక్కువగా ఉంటుందన్నారు. శుక్రవారం గుంటూరులో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామీణ బాలికలకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో కోడెల ప్రసంగించారు. బాలికా విద్యను ప్రోత్సహించటానికి కోరమాండల్ చేస్తున్న కృషిని అభినందించారు. బాలికలు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. వంద మంది విద్యార్థులకు ఈ సందర్భంగా నగదు పురస్కారం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్, కోరమాండల్ ఉపాధ్యక్షులు జివి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పురస్కారం అందచేస్తున్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు


నాయుని కృష్ణమూర్తి అంత్యక్రియల్లో పాల్గొన్న అభిమానులు

నాయుని కృష్ణమూర్తికి అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి - చౌడేపల్లి

బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీవేత్త నాయుని క్రిష్ణమూర్తి అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. చౌడేపల్లి-పుంగనూరు మార్గమధ్యంలోని విజయవాణినగర్ వద్ద ఆయన అంత్యక్రియలను నిర్వహించారు. రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి ఎన్.అమరనాథ్‌రెడ్డి కుటుంబసమేతంగా నాయని కుటుంబీకులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సాహితీరంగానికి నాయుని క్రిష్ణమూర్తి ఎనలేని సేవ చేశారన్నారు. అటువంటి గొప్పవ్యక్తి దూరమవడం బాధాకరమన్నారు. మంత్రితో పాటు పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వెంకట్రమణరాజు, శ్రీధర్‌రెడ్డి, అతని భార్య అనూషారెడ్డి, గువ్వల రామక్రిష్ణారెడ్డి ఉన్నారు.

కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్య సహాయం

జెవివి, యుటిఎఫ్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - గంపలగూడెం (కృష్ణా)

కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం వినగడప శివారు తండాల్లోని గిరిజనులను శుక్రవారం జనవిజ్ఞానవేదిక (జెవివి), యుటిఎఫ్ నాయకులు పరామర్శించారు. కలుషిత మంచినీళ్లు, నాటు మందులు వాడటంవల్ల ఎక్కువ మంది గిరిజనులు కిడ్నీవ్యాధి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని జెవివి ప్రతినిధి ఎం.రాంప్రదీప్, యుటిఎఫ్ నాయకులు జి.సతీ రాములు, కె.రాధాకృష్ణ, జి.కోటేశ్వరరావులు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో లావూరి తుల్సా అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మరణించాడని, గిరిజన తండాల్లోనే కాకుండా సాధారణ గ్రామాల్లో కూడా కిడ్నీ బాధితులు అధిక సంఖ్యలో రోజురోజుకూ పెరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, బాధితులకు పెన్షన్ మంజూరు చేయాలని, తిరువూరు లేదా నూజివీడు ప్రాంతంలో ఉచిత డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేకం

'ఉపాధి' కూలీల వేతన కష్టాలు


ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్ ఫొటో)

- బకాయి రూ.457 కోట్లు
- అత్యధికం చిత్తూరు జిల్లాలో

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలకు వేతన కష్టాలు కొనసాగుతున్నాయి. గతేడాది డిసెంబర్ నుంచి ప్రభుత్వం రూ.457.46 కోట్ల బకాయి పడింది. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 35,61,448 కుటుంబాలు ఉపాధి పనులకు హాజరయ్యాయి. 57,52,058 కూలీల ద్వారా 16,83,09,951 పని దినాలు నమోదయ్యాయి. ప్రభుత్వం గత డిసెంబర్ నుంచి ఉపాధి వేతనాలు చెల్లించలేదు. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో రూ.56 కోట్లు, అత్యల్పంగా కృష్ణాజిల్లాలో 14.84 కోట్ల బకాయిలున్నాయి. విజయనగరం జిల్లాలో 52,83,305 పని దినాలకు సంబంధించి రూ.45,54,95,082 బకాయిలున్నాయి. దీంతో, వేతనదారులు ఇళ్లు గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు జిల్లాకు రూ.56.34 కోట్లు, అనంతపురానికి రూ.46.57 కోట్లు, తూర్పుగోదావరికి రూ.42.14 కోట్లు చెల్లించాల్సి ఉంది. పని చేసిన 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలనే నిబంధన అమలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2017 నుంచి నెల తరబడి బకాయిలు పెడుతూనే ఉంది. పెద్ద నోట్ల రద్దు తర్వాత బ్యాంకులు విధించిన ఆంక్షలు, నగదు కొరత వెరసి ఉపాధి కూలీల కష్టాలు రెట్టింపయ్యాయి.

పది రోజుల్లో సమస్య పరిష్కారం

వేతన బకాయిలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మరో పది రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

-బొడ్డేపల్లి రాజగోపాల్, పీడీ, డ్వామా

ఉపాధి బకాయిల వివరాలు

జిల్లా పేరు	పని దినాలు	బకాయి (రూపాయల్లో)
అనంతపురం	35,70,998	46,57,24,345
చిత్తూరు	25,79,387	56,43,17,757
తూర్పుగోదావరి	37,50,391	42,14,90,860
గుంటూరు	19,89,975	24,12,67,672
కడప	23,17,291	19,74,23,198
కృష్ణ	17,57,384	14,84,60,099
కర్నూలు	26,70,733	28,34,06,601
ప్రకాశం	45,68,298	18,14,01,368
నెల్లూరు	25,46,154	35,67,09,099
శ్రీకాకుళం	49,82,673	26,12,90,894
విశాఖపట్నం	44,96,864	34,15,32,634
విజయనగరం	52,83,305	45,54,95,082
పశ్చిమగోదావరి	29,13,278	30.66,13,047

సంక్షిప్తం

బార్బర్ క్వార్టర్స్‌లో అగ్నిప్రమాదం

తిరుమల: తిరుమలలోని బార్బర్ క్వాటర్స్ వద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానికుల కథనం ప్రకారం తిరుమలలో బార్బర్ క్వార్టర్స్ వద్ద అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఉన్నటుండి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దాదాపు రెండు ఎకరాల అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతయ్యింది. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లేదంటే అటవీ ప్రాంతం పెద్దఎత్తున కాలి బూడిదయ్యేదని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ మంటలకు కారణమయ్యి ఉంటారని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

వేద పరిరక్షకులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - క్యాంపస్(తిరుపతి)

వేదాలందు కృషి చేసిన వారికి ఏడాదికి 12 మందిని గుర్తించి ఐదు లక్షల రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులను ఇస్తామనికేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్ అన్నారు. అలాగే వేదాలను కాపాడే వారికి సమాజంలో మంచి గుర్తింపు తీసుకొస్తామన్నారు. శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం, మహర్షి సాందీపనీ వేద విద్యాప్రతిష్టాన్, ఉజ్జయిని సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే దక్షిణ భారత వేద సమ్మేళనం వేదిక్ వర్సిటీ పరిపాలనా భవనంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యపాల్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరానికి మంచి భోజనము ఎంత అవసరమో, మనస్సుకి అంతే మంచి శబ్దము అవసరమని పేర్కొన్నారు. ఆ శబ్దమే వేదమని, వేదాల వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మానసిక ప్రశాంతత కోసం విద్యార్థులు పుస్తకాలను పఠిస్తుంటారని, కానీ వేదాలలోని శబ్దాలను వింటే మనస్సుకు ప్రశాంతతగా ఉంటుందన్నారు. రవీంద్ర అంబుదాస్ మాట్లాడుతూ వేదాలను పరిరక్షించవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

వ్యాపారులపై 'డెకాయ్' ఆపరేషన్

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ ప్రవేశపెట్టినప్పటి నుంచి వ్యాపారులపై అధికారుల వేధింపులు ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నాయని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. రెండు మూడు నెలలుగా 'డెకాయ్' ఆపరేషన్ పేరుతో వ్యాపార సంస్థలపై జీఎస్‌టీ అధికారులు తనిఖీలు చేయటంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గుంటూరులోని ఛాంబర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారులే ఏదో ఒక దుకాణానికి వెళ్లి సరుకు కొనుగోలు చేసి బిల్లు తీసుకోకుండా కొంత సమయానికి వెళ్లి బిల్లు ఇవ్వలేదనే నెపంతో అపరాధ రుసుం పేరుతో రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేయటం తగదన్నారు. డెకాయ్ ఆపరేషన్ నిలిపేయాలని రాష్ట్ర సేల్స్‌టాక్స్ కమిషనర్ శ్యామలరావు దృష్టికి తీసుకెళ్లగా...మార్చి 31 వరకూ నిలిపేస్తున్నట్లు శ్యామలరావు పేర్కొన్నారు. అయినా వ్యాపార లావాదేవీల సమయంలో బిల్లులు ఇవ్వాలని, ఎవరైనా బిల్లు వద్దంటే సరుకు విక్రయించొద్దన్న ఆంజనేయులు తాత్కాలికంగా నిలిపేసిన డెకాయ్ అపరేషన్ పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ప్రాణాలు తీస్తున్న నకిలీలు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నకిలీ మందుల మాఫియా విజృంభిస్తుండటం తీవ్ర ఆందోళన కల్గిస్తోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ మాఫియా కోరలు పీకాలంటూ సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం దుర్మార్గం. నొప్పుల నివారణకు వాడాల్సిన లైసెన్సు పొందిన అల్ట్రాసెట్ స్థానంలో అచ్చం అలాంటి ప్యాకులలోనే నకిలీ మందు బిళ్లలు విక్రయిస్తున్న వైనం, వాటిని తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టు అవ్వడం గతేడాది ఆఖరులో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇటు రాష్ట్రంలోనూ, అటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్నాటకల్లోనూ రెండేళ్లుగా ఈ నకిలీ ముఠాలు కలకలం రేపుతున్నా పాలకులు కళ్లు తెరవడం లేదు. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ తయారు చేసే లైసెన్స్‌డ్ మందులకు బదులు అల్ట్రాసెట్ పాంటాసిడ్-40 ఎంజి, పాంటాసిడ్ డిఎస్‌ఆర్, కైమోరాల్‌ఫోర్ట్, స్కిన్‌లైట్‌క్రీమ్, మేలకేర్ అయింట్‌మెంట్ వంటి నకిలీ మందులు పెద్ద ఎత్తున సరఫరా అవుతున్నాయని ఔషద నియంత్రణాధికారుల సోదాల్లో తేలింది. జాన్సన్ అండ్ జాన్సన్ తన మందుల అమ్మకాలు అనూహ్యంగా పడిపోవడంతో అనుమానంతో ఫిర్యాదు చేసే వరకు నకిలీ ముఠా సంగతి అధికారయంత్రాంగానికి తెలియలేదంటే రాష్ట్రంలో ఔషద నియంత్రణ వ్యవస్థ ఎంతటి నిద్రాణ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

లైసెన్సుడ్ మందుల విక్రయాల ద్వారా లాభాలు పరిమితంగా ఉంటాయనీ, నకిలీ మందుల విక్రయాలతో కనీసం 60 శాతానికి పైగా లాభాలు దండుకోవచ్చంటూ నకిలీ మందుల ముఠా ఈ దారుణానికి పాల్పడుతోంది. నకిలీ మందుల రాక్షసి తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాదు. దేశమంతా, ప్రపంచ వ్యాపితంగా కూడా విస్తరించి ఉంది. వర్ధమాన దేశాల్లో 25 శాతం మందులు నకిలీవే అమ్ముతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశీలనలో తేలింది. నకిలీల తయారీ దారులు ఖరీదైన మందులపై కేంద్రీకరిస్తున్నారు. క్యాన్సర్ నివారణ మందులు, హార్మోన్లు, స్టిరాయిడ్లు, యాంటీహిస్టామిన్ ఔషదాలు, మానసిక వ్యాధికి సంబంధించిన మందులకు మార్కెట్‌లో పెద్ద ఎత్తున నకిలీలు దిగి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. దాదాపు 8 రకాల లైసెన్సుడ్ కంపెనీలను పోలిన నకిలీ మందులు ఇప్పటిదాకా వెలుగులోకి వచ్చాయి. వెలుగులోకి రాని ప్రమాదకర మందులు ఇంకా పెద్ద సంఖ్యలోనే ఉండవచ్చని వైద్య రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ల పర్యవేక్షణ కూడా ఉండే మందుల ఏజెన్సీలు, దుకాణాల్లోనే నకిలీ మాఫియా తిష్టవేసే దుస్థితి ఉందంటే ఇక పర్యవేక్షణ లేని ఆస్పత్రుల ఫార్మసీలలో అవకతవకలు ఇంకెంతటి ప్రమాదకర పరిస్థితిలో ఉంటాయో అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. మందుల దుకాణాలపైనా, వాటిని సరఫరా చేసే డీలర్లపైనా పర్యవేక్షణ, తనిఖీల వ్యవస్థను మరింత పటిష్టం చేసి నాణ్యమైన మందులు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రజలకు ఆరోగ్యం పొందే హక్కులో నాణ్యమైన ఔషదాలు పొందే హక్కు కూడా అంతర్భాగం. అందువల్ల పౌరులకు నాణ్యమైన మందులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంది.

కానీ రాష్ట్రంలో సమగ్ర ఔషద నియంత్రణ వ్యవస్థ (సిడిఎంఎస్)ను తీసుకొచ్చామని, నకిలీ మందుల గుర్తింపునకు కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చామని ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందే తప్ప నిర్మాణాత్మకంగా నకిలీ మందుల ముఠా నియంత్రణకు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి 200 దుకాణాలకు ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. కానీ మన రాష్ట్రంలో ప్రస్తుతం 600 దుకాణాలకు ఒక అధికారి ఉన్నారు. దీనివల్ల పూర్తిస్థాయి తనిఖీలకు వీల్లేకుండా పోతోందని అధికారులే వాపోతున్నారు. నకిలీ ముఠాలు రెచ్చిపోతున్న నేపథ్యంలో నకిలీ మందుల పట్ల అవగాహన కల్పిస్తూ ఆ దిశగా ప్రజలను చైతన్యపర్చేందుకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్, ప్రజారోగ్య వేదిక వంటి సంస్థలు స్వచ్ఛందంగా ప్రచారకార్యక్రమాలు చేపట్టడం ఎంతైనా ముదావహం. ప్రజలందరికీ అందుబాటులో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే జన ఔషది మందుల దుకాణాలను ఏర్పాటు చేయడం, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మందు బిళ్లలు, టీకాలు తయారీ వంటి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించాలి. ఇందుకోసం బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలి. కానీ పాలకులు ఆ పని చేయడం లేదు. ప్రయివేటు, బహుళజాతి కంపెనీల ఆధిపత్యానికి కళ్లెం వేయడం, తనిఖీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, అనైతిక వ్యాపార, మార్కెటింగ్ విధానాలను కట్టడి చేయాలనే సూచనలు కూడా ఆచరణ సాధ్యాలే. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ, కల్తీ, నాసిరకం మందుల మాఫియాను అరికట్టేందుకు నడుం బిగించాలి.

ఇదీ విషయం




బ్యాంకుల్లో సొమ్ముంటే
కార్పొరేట్లకు పండుగ...
ఎంత దోచుకుంటేనేం
నేతలు అండగ ఉండగ!

కమలం కాపరుల కంటే
బురిడీ బాబాలే నయం...
గారడీ లేకుండానే
ఖజానాలు మాయం!

- కొల్లూరు వెంకట్

ఇష్టాగోష్ఠి

ట్రంప్ ప్రవర్తన, మోడీ శైలి రెండూ ప్రమాదకరమే!



ఉత్తమ జర్నలిస్టులకు ప్రతి ఏడాది ప్రదానం చేసే ఎన్ఆర్ చందూర్ అవార్డును స్వీకరించేందుకు వాషింగ్టన్ పోస్ట్, వాల్‌స్ట్రీట్ జర్నల్ లాంటి ప్రతిష్టాత్మక పత్రికలకు మేనేజింగ్ ఎడిటర్‌గా పని చేసిన జర్నలిస్టు నరిసెట్టి రాజు ఇటీవల ఢిల్లీకి వచ్చినప్పుడు ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు ఆయనతో జరిపిన ఇష్టాగోష్టి...

మీడియా విషయంలో మోడీ, ట్రంప్ మధ్య ఉన్న పోలికలు

మోడీ, ట్రంప్ ఇద్దరూ జనాదరణ గల నాయకులే. సోషల్ మీడియా తదితర మార్గాల్లో ప్రజలను నేరుగా చేరుకునే కళలో వారు నిష్ణాతులే. కాని ప్రధానమంత్రి మోడీ పాలనలో అనుభవం ఉన్న రాజకీయ నాయకుడు. ఒక జాతీయ పార్టీతో సుదీర్ఘకాలం సంబంధం ఉన్నవాడు. కాని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాపారంలో విఫలుడైన వ్యక్తి. ఆయన కంపెనీలు ఎన్నో ఏళ్లుగా సమస్యల్ని ఎదుర్కొంటున్నాయి. మోడీ రాజకీయాలకు ఒక సైద్ధాంతిక మూలం ఉన్నది. కాని ట్రంప్ రాజకీయాల వెనుక ఎలాంటి నిజమైన మౌలిక విశ్వాసాలు లేవు. ట్రంప్ తనకు ఇష్టంలేని వార్తలను ఫేక్ న్యూస్‌గా అభివర్ణిస్తారు. తనకిష్టం లేని సిఎన్ఎన్ వంటి ఇతర గ్రూప్‌లపై తప్పుడు ఆరోపణలు చేస్తారు. మోడీ ప్రభుత్వం మీడియాపై ఒత్తిడి తేవడంలో ఒక పద్ధతి ప్రకారం వ్యవహరించి వారు తమ గొంతు తగ్గించుకునేలా చేస్తుంది. అందుకు రకరకాల ఒత్తిళ్లను ప్రయోగిస్తుంది. ట్రంప్ ప్రవర్తన, మోడీ శైలి రెండూ ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదకరం. అయితే ట్రంప్‌ను బలంగా విమర్శించడంలో అమెరికన్ మీడియా ఇంకా సమర్థవంతంగా పనిచేస్తోంది. కాని భారత దేశంలో ప్రభుత్వ ఒత్తిళ్ల రీత్యా అప్రకటితంగానే సమస్యల పట్ల మెతకగా వ్యవహరించడం కనపడుతోంది.

పరిశోధనాత్మక జర్నలిజం, కుంభకోణాలకు ప్రాధాన్యత..

పరిశోధనాత్మక జర్నలిజం విషయంలో అమెరికన్ ప్రెస్ ఇంకా బలంగా ఉన్నది. గత ఏడాదిగా అది ఎన్నో పరిశోధనాత్మక, విమర్శనాత్మక కథనాల్ని ప్రచురించింది. వ్యాఖ్యల్ని చేసింది. అమెరికన్ మీడియాకు మరెక్కడా లేని విధంగా పరిశోధనలు చేసేందుకు వీలుగా అమెరికా రాజ్యాంగం తన తొలి సవరణ ద్వారా వీలు కల్పించింది. సమాచార స్వేచ్ఛ చట్టాలు అందుకు మరింత తోడ్పడుతున్నాయి. భారత దేశంలో ప్రభుత్వం, అధికారుల గుప్పిట్లో ఇప్పటికీ ఎంతో సమాచారం నియంత్రణకు గురవుతోంది. జరుగుతున్న అవకతవకల గురించి సాక్ష్యాలు సంపాదించడం భారతదేశంలో సులభం కాదు. అమెరికాలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది.

పత్రికా స్వేచ్ఛపై దాడులు..

భారత దేశంతో పోలిస్తే మాత్రం అమెరికా ప్రెస్ ప్రత్యక్ష, పరోక్ష ఆంక్షలకు గురి కావడం లేదు. ఒబామా తోపాటు ఇతర అధ్యక్షుల పాలనలో వారు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, సున్నితమైన సమాచారాన్ని లీక్ చేస్తున్నారన్న పేరుతో విజిల్ బ్లోవర్స్ వెంటపడి ఉండవచ్చు. కాని అదృష్టవశాత్తు అమెరికన్ పౌర హక్కుల సంఘం, ఇతర మీడియా కంపెనీలు ఇలాంటి చర్యలపై న్యాయస్థానాల్లో పోరాడగలుగుతున్నాయి. అమెరికా న్యాయస్థానాలు పత్రికా స్వేచ్ఛకున్న రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు ముందుకు వస్తున్నాయి. గత ఏడాదిగా ట్రంప్ పాలనలో జర్నలిస్టులు, వార్తాసంస్థలపై మౌఖిక దాడులు పెరుగుతున్నాయి. ఇది ప్రమాదకరమైన పరిణామం. భారత దేశంలో మీడియాకు మెజారిటీ ప్రకటనలు ప్రభుత్వం నుంచే రావడం, న్యూస్ ప్రింట్ దిగుమతులను నియంత్రించడం, మీడియాతో సంబంధం లేని వ్యాపారం చేసే మీడియా సంస్థలను శిక్షించడానికి వెనుకాడకపోవడం వంటివి జరుగుతున్నాయి. కనుక మీడియా యజమానులను లొంగదీసుకునే సామర్థ్యం ఎక్కువ. అమెరికాలో ఇలా జరగదు. మన దేశంలో ఎడిటర్స్ గిల్డ్, ప్రెస్ కౌన్సిల్ లాంటి సంస్థలకు అధికారాలు లేవు. అవి ఉన్నా లేనట్లే.

సమాచార హక్కు నామమాత్రమే...

అమెరికాలో రాజ్యాంగ తొలి సవరణ జర్నలిజానికి అత్యంత శక్తిమంతమైన కవచంలా పని చేస్తుంది. భారతదేశంతో పాటు ప్రపంచంలో ఎక్కడా ఈ పరిస్థితి లేదు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే పత్రికలను తన పని తాను చేసుకోనివ్వాలి. పత్రికా స్వేచ్ఛ గురించి గొప్పలు చెప్పుకుంటారు కాని ఆర్‌టిఐ లాంటి చట్టాలున్నా పత్రికా స్వేచ్ఛకు ఎన్నో అవరోధాలున్నాయి. ప్రభుత్వ సమాచారంలో అధిక భాగం అనేక ఇతర దేశాల్లో లాగా బహిరంగంగా, సులభంగా లభ్యం కాదు. దీని వల్ల ప్రభుత్వానికి, అధికారులకు జర్నలిస్టులపై, జర్నలిజంపై ఎక్కువ అధికారాలు లభిస్తున్నాయి.

'మింట్'లో పని చేసి వెనక్కి వెళ్లడానికి కారణాలు

'మింట్' పత్రికను 2007లో స్థాపించడం, రెండవ అతి పెద్ద వ్యాపార పత్రికగా అది విజయం సాధించడంలో నాకెంతో గొప్ప అనుభవం లభించింది. భారతీయ న్యూస్ రూమ్‌లో ప్రమాణాలు చాలా తక్కువ. మింట్‌లో ప్రవర్తనా నియమావళి, సవరణలు చేసుకునే విధానాలను నెలకొల్పినందుకు నాకు గర్వంగా ఉన్నది. భారతీయ జర్నలిజంలోనే అది విశిష్టమైనది. కాని జర్నలిస్టులలో ఎక్కువ మంది వాస్తవాలను తనిఖీ చేసుకోవాలనే మౌలిక పద్ధతిని పాటించకపోవడం, సందర్భాన్ని ఉటంకించకపోవడం, విమర్శనాత్మకంగా వ్యవహరించ లేకపోవడం భారతదేశంలో ఎక్కువగా కనపడుతోంది. తమను తాము నియంత్రించుకుంటున్నామని మీడియా సంస్థలు చెప్పుకుంటున్నప్పటికీ భారతదేశంలో స్వయం నియంత్రణ దాదాపు లేదు. మరో వైపు విమర్శనాత్మకంగా వ్యవహరిస్తే భారతదేశం పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామని ముద్రవేసే తత్వం ఒకటి కనపడుతోంది.

జర్నలిజంలో రావడానికి ప్రేరణ

హైదరాబాద్‌లో మధ్యతరగతి కుటుంబంలో మా తల్లిదండ్రులు నరిసెట్టి ఇన్నయ్య, వెనిగళ్ల కోమలతో పాటు పెరిగాను. చదువుకోవడం తప్ప జీవితంలో విజయం సాధించడానికి వేరే మార్గం లేని కుటుంబం మాది. నేను, నా చెల్లెలు అస్తమానం పుస్తకాలు, వార్తాపత్రికల మధ్య, ఆకాశవాణి, బిబిసి వార్తలు వింటూ పెరిగాము. మా ఇంటికి వచ్చే వారితో కానీ, బయట కానీ చర్చల్లో పాల్గొంటే మా తల్లిదండ్రులు ప్రోత్సహించేవారే కాని అడ్డు చెప్పేవారు కారు. చైతన్య కళాశాలలో ఇంగ్లీష్ టీచర్ ఆనంది శంకర్ ఇచ్చిన ప్రోత్సాహాన్ని మరిచిపోలేను. 1985లో రూరల్ మేనేజిమెంట్‌లో ఎంబిఏ చేసిన తర్వాత నాలో విశ్వాసం పెరిగింది. టైమ్స్ స్కూల్ ఆఫ్ జర్నలిజంలో ప్రొఫెసర్ థామస్ ఓమ్మెన్ నాకు జర్నలిజంలో మౌలిక పాఠాలు నేర్పి విదేశాల్లో చదువుకొమ్మని ప్రోత్సహించారు. ఎకనమిక్స్ టైమ్స్‌లో టిఎన్ నైనన్ మొదట ఉద్యోగం ఇచ్చారు. వీరందరూ నా విజయానికి కారకులు.

యువ జర్నలిస్టులకు ఏది అవసరం?

ఒక జర్నలిస్టుకు దేనినైనా తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి. చుట్టూ ఉన్న అన్ని అంశాలపై ప్రశ్నలు వేసేందుకు వెనుకాడకూడదు. ప్రశ్నలకు జవాబులు అన్వేషించడం, వాటిని పాఠకులతో పంచుకోవడం నిరంతరం జరగాలి.

(నరిసెట్టి రాజు ప్రస్తుతం అంతర్జాతీయ మీడియా గ్రూప్ 'గిజ్ మోడో' సిఇఓ గా, వికీమీడియా ఫౌండేషన్ ట్రస్టీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.)

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

చర్చ

గాయత్రీ మంత్రంతో చదువొస్తుందా?



ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం ప్రార్థనా సమయంలో గాయత్రీ మంత్రాన్ని జపించాలని హర్యానా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రాష్ట్రంలో 2014లో అధికారంలోకి వచ్చిన మనోహర్‌లాల్ ఖట్టర్ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం విద్యను కాషాయమయం చేసే చర్యల్లో భాగంగా ఫిబ్రవరి 24న ఈ నిర్ణయం చేసింది. పాఠశాల పాఠ్య పుస్తకాల్లో భగవద్గీత శ్లోకాలను చేర్చాలని 2015లో చేసిన నిర్ణయాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించటంతో వెనకడుగు వేశారు. అయినా 2016 నుండి ఏకపక్షంగా అమలు చేయటానికి పూనుకున్నారు. దాని వలన మంచి సానుకూల ఫలితాలు వచ్చినట్లు ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రామ్‌బిలాస్ శర్మ చెప్పుకొచ్చారు. ఏమి ఫలితాలు వచ్చాయో ఆ రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు తెలియాలి. గాయత్రీ మాంత్రాన్ని జపిస్తే మరిన్ని మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

'ఓం భూర్ భువస్వః, తత్సవితుర్వ రేణ్యం! భర్గోదేవస్య ధీమహి, ధియో యోన: ప్రచోదయాత్ !!' గాయత్రీ మంత్రం. ఏక కాలంలో సమస్త ప్రదేశాలలో వుండగలిగిన విశ్వరూపీ, ధీశాలి, పరమేశ్వర! ప్రపంచంలో లభ్యమయ్యే సమస్త జ్ఞానం నువ్వే, మాలో భయాన్ని పోగొట్టేది నువ్వే, సృష్టి కర్తవు నువ్వే, సర్వోత్తముడివి నువ్వే! శిరస్సు వంచి నమస్కరిస్తున్నాము, మా మనస్సు మేధస్సు సత్కర్మల వైపు ఆకర్షింపబడేలా చూస్తూ మమ్ములను సన్మార్గంలో నడిపించు!' అనేది దాని అర్థం. క్రీస్తు పూర్వం ఎనిమిది వేల సంవత్సరాల క్రితం రుగ్వేదంలో గాయత్రీ మంత్రం రాసినట్లు వేదపండితులనే వారు చెబుతున్నారు. అన్ని మంత్రాల కన్నా అత్యంత శక్తివంతమైన మంత్రం అని, పరమశివుడు విశ్వామిత్రునికి ఉపదేశించారని, అందుకే ఆయన అంత శక్తిమంతుడు అయ్యాడని ప్రచారంలో వుంది.

మంత్రాలకు మహిమ, శక్తి వున్నాయని చెప్పేందుకు ఆధారాలు, రుజువులు ఏమి లేవు. 'మంత్రాలకు చింతకాయలు రాలవు' అనేది మాత్రం నిజం. దానిని ఎవరైనా ఎక్కడైనా రుజువు చేయవచ్చు. మంత్రాలు నమ్మకానికి, మూఢ విశ్వాసానికి సంబంధించినవి. వాటిని విద్యార్థులపైన రుద్దటం అన్యాయం, అధికార దుర్వినియోగమే. ఇటీవల విడుదలైన వార్షిక విద్యాస్థాయి నివేదిక (అసెర్) 2017, జాతీయ సాధన సర్వే (న్యాస్)ల్లో హర్యానా పరిస్థితి అసంతృప్తికరంగా వుంది. పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా వున్నట్లు యు-డైస్ నివేదికల ద్వారా తెలుస్తోంది. 'బేటి బచావో బేటి పడావో' నినాదానికి భిన్నంగా బాలికల సంఖ్య తగ్గిపోతున్నట్లు కాగ్ రిపోర్ట్ కడిగేసింది. ఇలాంటి మౌలిక విషయాలను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి ఖట్టర్ తన పార్టీ సైద్ధాంతిక భావజాలం ప్రచారానికి పాకులాడటం సరైంది కాదు. అన్ని మతాల విద్యార్థులు వుండే ప్రభుత్వ పాఠశాలల్లో ఒక మతానికి చెందిన ఆచారాలను పాటించాలనడం నియంతృత్వం, రాజ్యాంగ వ్యతిరేకం.

- నాగటి నారాయణ

జన వాక్యం

చేసిన కాలక్షేపం చాలు



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల బడ్జెట్ కోసం చేస్తున్న కసరత్తు కొద్దిరోజుల్లో తేలనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్కువ కాలం రాజధాని అమరావతి పేరుతోనే కాలక్షేపం చేశారు. రాష్ట్రంలో మెజార్టీ ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడుతున్నారు. సుమారు కోటి మంది నిరక్షరాస్యులు ఉన్నారు. నిరుద్యోగులు 70 లక్షలు దాటి పోయారు. ప్రతి ఏడాది అదనంగా 10 లక్షలు పెరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ మాటేమోగానీ, ప్రయివేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. దీంతో ఇతర రాష్ట్రాలకు, దేశాలకు యువత తరలి పోతున్నారు. సహకార రంగంలో నడచిన మూతపడ్డ చక్కెర కర్మాగారాలను తిరిగి తెరిపిస్తామని టిడిపి హామీ ఇచ్చింది. ఇప్పుడు వాటిని అమ్మి వేసేందుకు సిద్ధమౌతోంది. అంటే ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం పూర్తిగా బాధ్యతను విస్మరించింది. నాలుగేళ్ళుగా రాష్ట్ర ప్రజానీకానికి మేలైన చెప్పుకోదగ్గ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టలేదు. కీలక రంగాలను ప్రోత్సహించ లేదు. కనీసం రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లోనైనా రైతాంగ ప్రయోజనాలతో పాటు, మహిళలు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచే విధంగా నిధులు కేటాయించాలి. ఇంకా వెనుకబడిన కులాల వారి అభివృద్ధికి, చేనేత కార్మికులకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి.

టి వెంకట రమణ,
ఇమెయిల్ ద్వారా.

సందర్భం

పితృస్వామ్యం ఛాయలో శ్రీదేవి మరణం



కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు స్త్రీని అంగడి వస్తువుగా భావించి ఆమె అందాన్ని, ఆమె నటనను వ్యాపారం చేస్తున్నారు. అవసరం తీరాక బొమ్మను చిదిమేసినట్టు చిదిమేస్తున్నారు. శ్రీదేవికి ఒక వ్యక్తిత్వం వుంది. తన జీవితంలో అనేక మెట్లు ఎక్కగలిగిందంటే అనేక వ్యథలు భరించాకే అది సాధ్యమైంది. కానీ ఒత్తిళ్లను ఎదిరించి నిలబడగలిగిన సామర్థ్యాన్ని ప్రతి యువతి నేర్చుకోవాలి. శ్రీదేవి అకాల మరణమే దీనికొక నిదర్శనం.

శ్రీదేవి మరణం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అందుకు కారణమైన వారే, ఆమెను సౌందర్య దేవతగా అలంకరించి ఊరేగించడం హిందుత్వ భావజాలంలో భాగమే. నిజానికి శ్రీదేవిని సినీ ప్రపంచం ఒక బొమ్మగా చూపించేందుకే ప్రయత్నం చేసింది. ఆమెలోని నటనను చూపించింది ఒక్క ఆకలిరాజ్యం సినిమాయే. సినిమా రంగం మొదటి నుండీ కులాధిపత్యం, పితృస్వామ్య ఆధిపత్యంతోనే నడుస్తోంది. తల్లుల కొంగుచాటు నుండి పలుకుబడి నుండి ఎదిగిన నాయికల జీవన శైలిలో వ్యక్తిత్వం కొరవడింది. దీంతో వారి వ్యక్తిత్వం మీదే దెబ్బకొట్టారు. మనం ఒకసారి సినీ నాయికలే ఎందుకు చనిపోతున్నారు? అని లోతుగా పరిశీలిస్తే నఫీసా జోసెఫ్, పర్వీణ్ బాబి, దివ్య భారతి, ప్రత్యూష, శిఖా జోషి, జియా ఖాన్, సిల్క్ స్మిత, సౌందర్య వీరందరి మరణాల వెనుక ఎన్నో విషాద ఘట్టాలు వున్నాయి. వీరి అర్ధాంతర ముగింపు వెనుక మాఫియా, పెట్టుబడిదారీ, లైంగిక, పితృస్వామిక వేధింపులు వున్నాయి. ఇటీవల ప్రసిద్ధి చెందిన తెలుగు దర్శకులొకరు శ్రీదేవిలో వున్న అందాల్ని ఒకటొకటి చూపి ఒక్కొక్క సినిమా తీశానని, అరవయ్యేళ్లవాడి పక్కన చిందులు వేయించానని నిస్సిగ్గుగా చెప్పుకొన్నారు. ఇంకొక దర్శకుడు అయితే శ్రీదేవిని ప్రపంచంలో ఎవ్వరికీ లేనంత అందంగా భగవంతుడు సృష్టించాడని, తాను ఆమె ప్రేమికుణ్ని అని పాదాలకు నమస్కారం కూడా చేశాడు. 'ఆకు చాటున పిందె తడిసె' అనే అశ్లీలమైన వ్యాఖ్యలతో యుక్త వయస్సు రాకుండానే ఆ వయస్సుకు సంబంధించిన అన్ని ఉద్రేకాలను శ్రీదేవిలో చూపడం నేరమని వీళ్ళు ఎవ్వరూ అనుకోలేదు. మన వాళ్ళకు సినిమా పిచ్చి ఎక్కువే. అభిమాన నాయికలకు గుళ్లు, గోపురాలు కట్టేంతవరకు ఈ పిచ్చి వెళ్లింది. కొన్నిసార్లు ఈ నటీమణుల్ని ఆకాశానికి ఎత్తుతారు. తరువాత అథఃపాతాళానికి తొక్కుతారు. కులం, మతం, కుటుంబం అండ వున్న వారి పరిస్థితి వేరే వుంటుంది.



డాక్టర్ కత్తి పద్మారావు

శ్రీదేవికి నటనలో ఈజ్ వుండటం వల్ల తెలుగు, తమిళం, కన్నడ సినిమాల్లో నటించింది. తెలుగు సినిమాలు హిందీలో రీమేక్ జరిగేటప్పుడు ఆమె ముంబాయిలో అడుగు పెట్టింది. దక్షిణాది సినిమా పెట్టుబడి దారులు ఆమెను ఏ కోణంలో చూశారో అదే కోణంలో హిందీ వాళ్ళూ చూశారు. ఆమె అందాన్ని, ఆమె నటనలో వున్న సౌలభ్యతను వాడుకున్నారు. హీరోయిన్లకు అభద్రతా భావం వుంటుందనేది ఎవరూ కాదనలేనిది. తమకు భద్రతనిచ్చే వ్యక్తి పెళ్లి అయిన వారా! కానివారా! అనేది అసలు పట్టించుకున్నట్టు కన్పించదు. ఆ విధంగా ఆలోచించబట్టే అప్పటికే పెళ్లి అయిన బోనీకపూర్‌ను శ్రీదేవి వివాహం చేసుకుంది. ఇదే తరహాలో ఎందరో నటీమణులను గుర్తుచేసుకోవచ్చు. ఇక శ్రీదేవి విషయానికొస్తే, వివాహం తరువాత ఆమె 15 ఏళ్ల కుటుంబ జీవితం గడిపింది. మొదటి భార్య చనిపోయినా అక్కడి పిల్లలు, తన పిల్లలు, బోనీకపూర్ నిర్మాతగా అనేక సినిమాల్లో విఫలం అవ్వడం, ముక్కు, పెదాలు ఇతరులకు అందంగా కనపడాలనే భావన వంటివన్నీ ఆమెలో అనేక ఒత్తిళ్లకు దారితీసే వుంటాయి. అయితే ఆమె జీవితం అర్ధాంతరంగా ముగియడానికి అవే కారణమని చెప్పలేం కూడా.

ఆమె దుబాయ్‌లో మరణించిన మిస్టరీ వెనుక తప్పకుండా ఎంతో కొంత కథనం వుంటుంది. ఆమె మరణం వెనుక ఎవరో ఒకరి ఒత్తిడి వుంటుంది. అయితే ఇవేవీ వ్యక్తం కాకుండా కుటుంబ సభ్యులు ఆమెను దేవతగా అలంకరించి, ఆరాధించినట్లు మాత్రమే కనిపిస్తోంది. ఇంత వరకు ఏ దర్శకుడు, ఏ నటుడు కూడా ఆమె మరణం వెనకున్న కథనం గురించి మాట్లాడలేదు. నటీమణుల పట్ల సినీ మాఫియా ఎంత గోప్యంగా వ్యవహరిస్తుందో దీన్నిబట్టే అర్థమౌతోంది. మొట్టమొదట నాటకాల్లో స్త్రీ వేషాలను పురుషులే ధరించేవారు. స్త్రీలు నాటకాల్లోకి రావడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. ఆమె ఏ రంగంలో ఎదగాలన్నా ఎన్నో అపవాదులు ఎదుర్కొని ముందుకు వెళ్ళాల్సి వుంటుంది. ముఖ్యంగా సినిమా రంగంలో, నాటక రంగంలో, విద్యా రంగంలో అన్ని రంగాల్లోను స్త్రీ ఎదుగుదల మీద పితృస్వామ్య వ్యవస్థ ప్రభావం వుంది. నటీమణుల చుట్టూ ఒక వలయం వుంటుంది. ఆమెకు స్వేచ్ఛ ఇవ్వరు. ఇతరులతో మాట్లాడనివ్వరు. ముందు కుటుంబ బంధాలు తెంచుతారు. తరువాత వలయంలో బంధిస్తారు. ఇక వాళ్ళ ప్రతి అడుగును గమనిస్తూ వుంటారు. అనేక సందర్భాల్లో వాళ్ళను నిర్బంధిస్తారు కూడా. ఇలా వాళ్లను అనేక ఒత్తిళ్ళకు గురి చేస్తారు. ఆ ఒత్తిడికి మూలం తెలియనివ్వరు. చాలా మంది సెలబ్రిటీల భర్తలు ఆమె అందాన్ని చూసి ప్రేమించాం అంటారు. కానీ వారు సంపాదించిన ఆస్తి చూసే ఎక్కువ మంది ప్రేమించి వుండవచ్చు. ప్రతి నటి ఒక మనిషే. ఆమెకు మానవ సంబంధాల పట్ల ఎంతో ఆసక్తి వుంటుంది. తన భావాలను ఇతరులతో పంచుకోవాలనే కోరిక వుంటుంది. భావ వ్యక్తీకరణ, స్వేచ్ఛ కోసం వాళ్ళు ఆరాటపడతారు. కొన్ని సందర్భాల్లో మాట్లాడుకోవడానికి మనిషి దొరకరు. అన్ని వైపుల బిగించివేస్తారు. మనిషికి కావాల్సిన స్వేచ్ఛ, ప్రేమ, ఆత్మీయతలను వారికి దూరం చేస్తారు. వారి చుట్టూ అనేక అలవాట్లు, అలసత్వాలు పెంచుతారు.

అవి లేనిదే బతకలేని పరిస్థితి తీసుకొస్తారు. అందుకే ప్రతి మనిషికి సామాజిక దృక్పథం అవసరం. భారతీయులు సినిమా ప్రియులు. ఆ రంగుల వలయాల వెనకున్న వ్యథల గురించి వీళ్ళకు తెలియదు. నిజానికి నటన వేరు, అందం వేరు. హీరోలు అందహీనులైనా హీరోయిన్లు మాత్రం అందంగా వుండాలి. వాళ్ళ శరీరం చెక్కుచెదరకూడదు. ముక్కు, కళ్లు, శరీర సౌష్టవం మాకు నచ్చేటట్లు వుండాలని కోరుకోవడం. అందుకు తగ్గట్టుగా వాళ్ళు వీళ్ళను మెప్పించడం కోసం తమలో తాము న్యూనతా భావానికి గురై శరీరాన్ని రాతిని చెక్కించుకున్నట్టు చెక్కించుకోవడం. ఎంత బాధాకరమైన విషయం. అయినా ఒకరి కోసం మనం జీవించడం ఏంటి? మన కోసం మనం జీవించాలి. కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు స్త్రీని అంగడి వస్తువుగా భావించి ఆమె అందాన్ని, ఆమె నటనను వ్యాపారం చేస్తున్నారు. అవసరం తీరాక బొమ్మను చిదిమేసినట్టు చిదిమేస్తున్నారు. శ్రీదేవికి ఒక వ్యక్తిత్వం వుంది. తన జీవితంలో అనేక మెట్లు ఎక్కగలిగిందంటే అనేక వ్యథలు భరించాకే అది సాధ్యమైంది. కానీ ఒత్తిళ్లను ఎదిరించి నిలబడగలిన సామర్థ్యాన్ని ప్రతి యువతి నేర్చుకోవాలి. శ్రీదేవి అకాల మరణమే దీనికొక నిదర్శనం. మనం ఎదుగుతున్న కొద్దీ మనకు సామాజిక నేపథ్యం పెరగాలి. వ్యక్తిత్వ నిర్మాణ దక్షత పెరగాలి. ఆటుపోటులను ఎదుర్కోగలిగిన సామర్థ్యం పెరగాలి. మన రక్షణ వలయాన్ని మనం ఆత్మస్థైర్యంతో నిర్మించుకోగలగాలి. అత్యాశలు, అతి కోరికలు మనల్ని అనంతయానంలోకి తీసుకెళ్తాయని తెలుసుకోవాలి. అనంత లోకాలు లేవు. ఉన్నది ఈ లోకమే. ఏది సాధించినా ఈ లోకంలో సాధించాలి. దానికి జీవితమే సోపానం. జీవితం మన చేతుల్లో నుంచి ఇతరుల చేతుల్లోకి పోయిందా తప్పకుండా మనకు ప్రమాదం ఎదురవుతుంది. ఏది ఏమైనా శ్రీదేవి మరణం ప్రతి భారతీయుడిని ఆలోచింప చేసింది. ఈనాడు మనం అందరం కూడా శ్రీదేవి స్మృతిలో పితృస్వామ్య భావజాలం మీద చర్చించక తప్పదు. ఈ ముగింపు లేని అత్యాచారాలకు చరమగీతం పలకాల్సిందే. ఇది స్త్రీ చైతన్య ప్రజ్వలమయం. ఆ వెలుగులో నూతన చైతన్యాన్ని, నూతన ఆవిష్కరణలను, నూతన పరిశోధనలను ముందుకు తీసుకొద్దాం. మరొకరికి ఇటువంటి అర్ధాంతర ముగింపు రాకుండా అందరం కలిసి కార్యాచరణలోకి ముందుకు వెళ్ళవలసి వుంది.

(రచయిత నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెల్ : 9849741695)

మీడియా-విలువలు



న్యూస్ చానల్స్ బాబులూ... నటి శ్రీదేవి అంత్యక్రియలు అయిపోయాయి. మీరంతా ఇళ్లకు పోయి.. తల స్నానాలు చేసి.. ఆ కెమెరాలు.. మైకులు గట్రా చల్లారబెట్టుకోండి. నాలుగు రోజుల నుంచి ఆన్ లోనే ఉండి సచ్చాయ్ కదా..వేడిగా ఉండి వుంటాయి. మేం కాస్త అలా కంటి, చెవి డాక్టర్ దగ్గరకు పోయి చూపించుకుని వస్తాం. ఇంకో ఐదారు నెలల వరకు ఏ సెలబ్రిటీ మరణించకూడదని ప్రార్థిస్తాం.

- ఇట్లు

విలువలు చచ్చిపోయిన మీడియాని చూసి రోజూ తల స్నానం చేస్తున్న ఒక సామాన్యుడు

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

మహిళోదయం 3

గిన్నెలన్నింటిపై అతని పేరేంటి?



'మా అమ్మ సూర్యుడిని నిద్ర లేపుతుంది. చంద్రుణ్ని నిద్ర పుచ్చుతుంది. ఆ రెండు పనుల మధ్యా లోకమంతా నిద్రపోతుంది.. ఒకే ఒక్క మా అమ్మ తప్ప.' అంటాడో కవి. నిజమే.. ఆమె కాలంతో పాటు పరుగులు తీస్తుంది. అలారం అవసరం లేకుండానే- ఏ సమయానికి ఆ పనిని చేసి పెడుతుంది. గడియారంలోని లోలకంలా అటూ ఇటూ తిరుగుతూ పనులన్నీ చక్కబెడుతూనే ఉంటుంది. అయినా ఆమె వాడే గిన్నెలన్నింటిపై అతని పేరే.. బిడ్డగా, చెల్లిగా, భార్యగా, తల్లిగా నిరంతరంగా సేవలు చేస్తూనే ఉంటుంది. మరి ఆమెకు కుటుంబం ఎలాంటి స్థానాన్ని ఇస్తుంది? సమాజం ఎలా గౌరవిస్తుంది? అమ్మాయి, భార్య, అమ్మ, గృహిణి, ఉద్యోగీ, కార్మికురాలు ... ఇలా అన్ని పాత్రల్లోనూ ఆమె ప్రతిభావంతంగా పనిచేస్తుంది. మరి ఆమె కేవలం లోలకమేనా? కీలకం కాదా?

గీతకు చదువంటే చాలా ఇష్టం. ఎప్పుడూ తన స్నేహితులతో అంటుండేది .."బాగా చదువుకొని మన జిల్లాకు కలెక్టర్‌నై సమస్యలన్నింటినీ తీరుస్తా" అని. అందరూ తనని పుస్తకాలపురుగు అనేవారు. పదో తరగతిలోనూ, ఇంటర్ లోనూ తనే క్లాస్ ఫస్ట్. "అమ్మా.. నేను క్లాస్ ఫస్ట్ వచ్చానే" అంటూ సంతోషంగా చెప్పిన గీతకు నిర్ఘాంతపోయే స్పందన వచ్చింది అమ్మ నుంచి. "ఇక ఈ చదువు చాలమ్మా. నీవు పెద్ద చదువులు చదివితే అంతకన్నా బాగా చదివిన వాడిని మేమెక్కడ తేగలం?" అంది గీత తల్లి. నాకు చదువంటే ప్రాణం. చదువుకుంటానంటూ కాళ్లావేళ్లా పడ్డా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. అబ్బాయి నచ్చాడా? లేదా? అనీ అడగలేదు. సతీష్‌కిచ్చి వివాహం చేశారు. కన్నవాళ్లు అర్థంచేసుకోలేదు. కట్టుకున్నోడికైనా బాధ చెప్పుకుందామంటే.. ఆమెకు చెప్పే అవకాశమే అతనివ్వలేదు. అత్తింట్లో ఎప్పుడూ ద్వితీయశ్రేణి పౌరురాలిగానే ఉండిపోయింది. జీవితంమీద ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆమె నాలుగు గోడలకే పరిమితమైంది.

గీతలాంటి ఎందరినో మనం రోజూవారీ జీవితంలో చూస్తూనే ఉంటాం. ఒకవేళ ఆమె బాగా చదువుకున్నా, ఉద్యోగం చేయాలనే ఆశ ఉన్నా అది అత్తింటివారికి సమ్మతమైతేనే...! కుటుంబంలో నిర్ణయాలు తీసుకునే అధికారం ఆమెకు ఉండదు. ఒకవేళ తీసుకున్నా వాటికి విలువ ఇవ్వరు.



బిడ్డా వారి ఇష్టమే!

పెళ్లయిన దగ్గర నుంచి 'ఇంకా నీళ్లు పోసుకోలేదా?' అంటూ ఇరుగుపొరుగు, చుట్టాలు పక్కాల ఆరాలు మొదలవుతాయి. ఆమె గర్భవతి అని తెలిసిన క్షణం నుంచి మరో సమస్య మొదలవుతుంది. పుట్టేది ఆడపిల్లా..? మగపిల్లాడా..? వారసుడిని కనివ్వాలి అంటూ ఆకాంక్షలా వినిపించే ఆంక్ష. కడుపులో బిడ్డ ఎవరనేది చెప్పకూడదని చట్టాలున్నప్పటికీ కొందరు వైద్యులు కడుపులో ఉన్న బిడ్డ ఫలానా అని చెబుతున్నారు. మనసుపెట్టి వింటే కడుపులోని బిడ్డ ఇలా అంటుందేమో!

"అమ్మా..! నీకు బిడ్డగా పుడుతున్నందుకు గర్వంగా ఉంది. కానీ, నీ కడుపులో పెరుగుతుంది పాప అని తెలిసి ఎందుకమ్మా, ఏడుస్తున్నావు? నాన్న రోజూ ఎందుకు నీతో గొడవ పడుతున్నాడు? నిన్ను కొట్టొద్దని చెప్పమ్మా. నిన్ను పొట్టపై కొట్టిన ప్రతిసారీ నాకూ దెబ్బ తగులుతుందమ్మా! నీవెందుకు హాస్పిటల్‌కు వచ్చావు? ఎవరో నా కాళ్లూచేతులను కోసేస్తున్నారమ్మా.. వాళ్లను ఆపమ్మా.. ప్లీజ్ నాకు నొప్పిగా ఉంది. వద్దని చెప్పమ్మా.. నన్ను కత్తులతో గుచ్చొద్దని చెప్పమ్మా... ప్లీజ్ అమ్మా.. నన్ను బతకనివ్వమ్మా..!' .. ఈ ఆర్తనాదాలు అమ్మకు వినిపిస్తాయి. కానీ, ఆపగలిగే శక్తి ఆమె చేతిలో లేకుండా చేస్తుంటే.. మౌనంగా తానూ రోదిస్తుంది.

ఒకవేళ తొలిసారి ఆడపిల్ల పుట్టినా, మరో కాన్పుకైనా వారసుడిని కనాలని ఆశిస్తూ శాసిస్తుంది కుటుంబం. అమ్మల మీద అదొక మానసిక ఒత్తిడి. కొన్ని కుటుంబాల్లో అయితే, మగపిల్లాడి కోసం అదనపు కాన్పులకు సిద్ధం కావటమూ ఆమె చేతిలో ఉండదు. దక్షిణాది రాష్ట్రాల కన్నా ఉత్తరాదిలో ఈ దుస్థితి చాలా ఎక్కువగా ఉంది. అయితే, కొన్ని కుటుంబాలు ఇప్పుడిప్పుడే ఏ బిడ్డయినా ఒకటే అనే భావనను పెంచుకుంటున్నాయి.

పెంపకంలోనూ వ్యత్యాసం

రామయ్యకు రాధ, గోపి ఇద్దరు పిల్లలు. ఆర్థికస్థితి అంతంతమాత్రం. రాధ తెలుగు మీడియం స్కూల్లో చదువుతోంది. గోపి ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుతున్నాడు. ఇద్దరు పిల్లలను ఒకే స్కూల్లో వేయవచ్చు కదా! అని ఎవరైనా అడిగినప్పుడు రామయ్య చెప్పే సమాధానం .. "అమ్మాయి ఎప్పటికైనా పరాయి ఇంటిదే. ఏదో కొంత చదువు చాలు. అబ్బాయి వారసుడు. వాడు బాగా స్థిరపడాలి!" ఇలాంటి ఆలోచనతో చాలామంది ఉంటారు. వారి ఆర్థికస్థితి అందుకు కారణం కావొచ్చు. అయితే, అందుకోసం బలి చేసేదిమాత్రం ఆడపిల్లనే కావడం దారుణం. చాలా కుటుంబాల్లో అమ్మాయైతే స్కూలుకు వెళ్లే వరకూ ఇంటిపని చేయాల్సిందే! పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చినప్పటికీ.. ఇప్పటికీ గ్రామాల్లో అమ్మాయి హైస్కూల్ చదువు చదవడమే గొప్ప. ఇంట్లో చేసిన తినుబండారాల్లో అబ్బాయి తినగా మిగిలితేనే అమ్మాయికి పెట్టే కుటుంబాలు నేటికీ ఉన్నాయి. అన్నకు చెల్లెలిపై ప్రేమ ఉండాల్సిన స్థానంలో అధికారం, చులకన భావం తల్లిదండ్రులే పెంచి పోషిస్తున్నారు.

బండెడు చాకిరీ...

ఉదయాన్నే లేచి అందరికీ తలలో నాలుకలా ఉన్నా ఆమెకు అడుగడుగునా అవమానాలే. కూరల్లో ఉప్పుకారాల మోతాదు తప్పాయన్న దగ్గర నుంచి.. ఇంటిని శుభ్రంగా ఉంచట్లేదని, పిల్లలను సరిగ్గా చూడట్లేదని, అత్తామామలను గౌరవించట్లేదని, ఆడబిడ్డ అడుగులకు మడుగులు ఒత్తట్లేదని.. భర్తను నిర్లక్ష్యం చేస్తోందని, చుట్టాలకు మర్యాద చేయట్లేదని ... ఇలా ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేయటం కొన్ని కుటుంబాల్లో కనిపిస్తుంది. అదేంటో ఆమె వాడే గిన్నెలన్నింటిపైనా అతని పేరే ఉంటుంది. ఆమెకు ఆదివారమూ సెలవు ఉండదు. రోజంతా ఒళ్లు హూనమయ్యేలా పనిచేస్తూనే ఉండాలి. కుటుంబసభ్యుల్లో ఏ ఒక్కరికి బాగా లేకపోయినా, తానే సేవలు చేయాలి. ఆమెకు సుస్తీ చేస్తే చూసే నాథుడే ఉండడు. ఆమె ఆరోగ్యం గురించి పట్టించుకునే కుటుంబాలు చాలా తక్కువగానే ఉంటాయి. ఇక శ్రామికమహిళ పరిస్థితి దారుణం. ఇంట్లోనూ, ఆఫీసులోనూ మాట పడకుండా పనిచేయటం ప్రతిరోజూ కత్తిమీద సామే! ఉద్యోగం చేసినా చివరికి జీతం ఖర్చుపెట్టే స్వేచ్ఛ చాలామంది మహిళలకు ఉండడం లేదు.

వృద్ధాప్యంలో ...

పుట్టినప్పటి నుంచి తనకంటూ స్వేచ్ఛా జీవితం లేనందున చిన్నప్పటి నుంచి ఆమె ఎవరోఒకరి మీద ఆధారపడి జీవిస్తూనే ఉంది. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు... ఇలా తన జీవితకాలం మొత్తం పురుషుడి మీదే ఆధారపడేలా చేశారు. భర్త చనిపోతే బిడ్డలను బతికించుకోవడానికి ఆమె పడే పాట్లు వర్ణనాతీతం. తాను తినీ తినక బిడ్డలకోసం ప్రాణాలొడ్డిన తల్లికి పట్టెడన్నం పెట్టడానికి లెక్కలేసే పిల్లలెందరో. ఇకనైనా ఈ పురుషాధిక్యాన్ని మార్చే ప్రయత్నం మొదలుకావాలి. దీనివల్ల కుటుంబమే కాదు.. సమాజమూ పురోగమిస్తుంది.

– స్వర్ణలత నూకరాజు

అన్ని దుస్తులూ ఒకేలా ఉండవు!

ఖరీదైన బట్టలు కొనగానే సరిపోదు. వాటిని చక్కగ మెయింటైన్ చేయగలగాలి. బట్టలు ఉతకడంలో సరైన జాగ్రత్తలు తీసుకున్నట్లయితే అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. దుస్తులపై ముడతలను ఐరన్‌తో వదిలించుకోవాలి. బట్టలు ఉతకటంలో ఎటువంటి పద్ధతులను ఆచరించాలనేది అందరూ తెలుసుకోవాల్సిన విషయమే కదా! అన్ని రకాల బట్టలను ఒకేవిధంగా ఉతకకూడదు. ఉన్నితో తయారయిన బట్టలను బ్రష్‌తో రుద్దకూడదు. బండకేసి బాదకూడదు. ఉలెన్ దుస్తులను తాడు లేదా వైర్‌మీద వేలాడదీసి ఆరేసి క్లిప్పులు పెట్టడమన్నది సరైన పద్ధతికాదు. అలాచేస్తే, ఊలు దుస్తులు సాగిపోతాయి. నేలను శుభ్రపరిచి వాటిని నేలమీద ఆరేయ్యాలి. ఊలు దుస్తులను పిండకూడదు. అలాగే ఐరన్ వైర్ లేదా ఐరన్ హ్యాంగర్ల మీద వేలాడదీయ్యడం వల్ల ఐరన్ తుప్పు బట్టలకు అట్టుకొని మరకలవుతాయి.

- సిల్క్, పాలియస్టర్ బట్టలను పిండకుండా, నీళ్ళ కారిపోయేలా ఉంచి, ఆ తర్వాత వాటిని ముడతలు లేకుండా దులిపి ఆరెయ్యాలి. బట్టలను ఐరన్ చేసేటప్పుడు, వాటి తరహాను బట్టి తగిన ఉష్ణోగ్రతతో చేయాలి. బటన్స్ మీద, ఎలాస్టిక్ మీద ఐరన్ బాక్స్‌ను ఉంచకూడదు.
- బట్టల మీద ఏర్పడిన మరకలను అశ్రద్ధ చేయకుండా వెంటనే తొలగించాలి. అలా చేయకుంటే అక్కడ నీరు ఎక్కువగా ఉండటం వల్ల మురికి అక్కడే నిల్వ ఉండి, తెలుపు బట్టలు పసుపు రంగులోకి మారుతాయి.
- మురికి బట్టలను ఇస్త్రీ చేయకూడదు. అలా చేసినట్లయితే, ఆ మురికి బట్టల్లోకి ఇంకి, బట్టలు అపరిశుభ్రంగా, రంగు మారి



అసహ్యంగా కనబడుతాయి. దుస్తులను ఐరన్ చేసిన తర్వాత కూడా ఐరన్ ముడుతలు అలాగే ఉండకుండా చూసుకోవాలి.

- బట్టలు ఆరగానే వాటిని తెచ్చి, కుప్పగా పడెయ్యకూడదు. చక్కగా మడతపెట్టి సర్దుకోవాలి. లేకుంటే, బట్టలు ముడతలు పడి, వేసుకోవడానికి అనువుగా ఉండవు. బట్టలు కొనే విషయంలో ధరించేటప్పుడు, ఉతికే సమయంలో సరైన శ్రద్ధ తీసుకుంటే, ఆ దుస్తుల వల్ల మన అందం మరింత పెరుగుతుంది.
- తెలుపు బట్టలు పసుపు రంగులోని మారడానికి కారణం నీటిలో ఐరన్ శాతం ఎక్కువగా ఉండటం. కాబట్టి బట్టల్లో తెలుపు రంగు తగ్గకుండా ఉండేందుకు, బట్టలను మంచి డిటర్జెంట్ సోప్‌తో శుభ్రం చేసిన తర్వాత ఒక బకెట్ నీటిలో కొద్దిగా ఉప్పు వేసి కొద్దిసేపు అలాగే నానబెట్టి తర్వాత ఆరబెట్టాలి.

★



నా భర్త నాకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వరు. ఆ విషయం ఎన్నోసార్లు చెప్పి చూశాను. కానీ ఆయనకు ఆడవాళ్లంటే చులకన భావన. కూతురు పట్లా అలాగే వ్యవహరిస్తున్నాడు. దాంతో మా అమ్మాయికి తన తండ్రిపైనా సదాభిప్రాయం లేదు. పాపకు పెళ్లి నిశ్చయమైంది. కానీ, తన భర్తా ఇలాగే వ్యవహరిస్తాడేమో?! అని భయపడుతోంది. మా అబ్బాయికీ తండ్రి తీరు నచ్చడం లేదు. నా భర్త ఇంట్లో బాధ్యతగా ఉండడుగానీ, పెత్తనం మాత్రం చేస్తుంటాడు. రేపు ఇంటికొచ్చే కోడలితోనూ ఇలాగే ఉంటే పరిస్థితి ఏంటి? నాకు ఇప్పుడు అదే దిగులుగా ఉంది. ఆయన్ని ఏవిధంగా మార్చుకోవాలో అర్థం కావడం లేదు. సలహా ఇవ్వండి.

- ఓ సోదరి

సైకాలజీ

ప్రవర్తన మారాలంటే..

మన సమాజంలో పురుషాధిక్య ధోరణులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. స్త్రీలంటే తక్కువ అనే పాతతరం నాటి భావాల మూసధోరణులు ఇప్పటికీ సమాజంలో కనపడుతున్నాయి. ఇన్నేళ్ల మీ సహచర్యంలో ఆయన ధోరణికి మీరు అలవాటుపడ్డారేగానీ, తను మారాల్సిన అవసరం గురించి మీరు ప్రయత్నించినట్లు లేరు. ఇప్పుడు ఉన్నట్లుండి ఆయనలో మార్పు తీసుకురావడం అంత తేలికైన విషయం కాదు. అవకాశమున్నప్పుడల్లా ఆయన మంచి కోరుకునే వారుగా కుటుంబ సభ్యులంతా సానుకూల ధోరణిలో మారుతున్న ప్రపంచ పోకడల గురించి అర్థమయ్యేలా అతనికి చెప్పాలి. తనను తాను వర్తమాన ప్రపంచానికి అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం గురించి, సర్దుబాటు అనేది అన్ని వైపులా ఎందుకు అవసరమో, ఎందుకు ముఖ్యమో, దానివల్ల లాభాలేంటో (తనకే గాక తన వాళ్లకీ) వివరించే ప్రయత్నం చేయండి. ఆయనలో మార్పు సంగతి అలా ఉంచితే మీరు ముఖ్యంగా ఆలోచించవలసిన మరో ముఖ్యకోణం మీ అమ్మాయి ఆలోచన. భవిష్యత్తు గురించి ఆమెకున్న భయం, ఆయన పెంపక ధోరణి వల్లనో, పెరిగిన వాతావరణం వల్లనో, అభద్రతల వల్లనో అలా సాగుతున్నది కాబట్టి ఆమె తండ్రి ప్రదర్శిస్తున్న ఆధిపత్యధోరణినే అందరూ ప్రదర్శిస్తారని అనుకోవడం ఎంతవరకు సమర్థనీయమో అనే ఆలోచన చేయమనండి. ఉదాహరణకు మీ ఇంట్లోనే తండ్రి ఆలోచనాధోరణికీ.. కొడుకు ఆలోచనా ధోరణికీ (ఆమె తమ్ముడు) తేడా ఉంది కదా?!

ఆయన అనుభవాల నేపథ్యంలో తండ్రి ప్రదర్శిస్తున్న ధోరణి అందరూ ప్రదర్శించి తీరాలని నియమమేమీ లేదు అన్న నిజాన్ని ఆమె స్వయంగా గమనించి, అర్థం చేసుకునేందుకు ప్రోత్సహించండి. తను పెళ్లి చేసుకునే సమయంలోనూ తన భాగస్వామితో ఆలోచనలను పంచుకోవడం, అంతకంటే ముందుగా అతని ప్రవర్తనా ధోరణిని నిర్దిష్టంగా పరిశీలించి, ఒక అవగాహన ఏర్పరచుకోవడానికి మీరు సహాయపడండి. తను ఒక కచ్చితమైన అంచనాకు వచ్చాకే జీవితంలో నిర్ణయం తీసుకోవచ్చన్న ధైర్యం కల్పించవచ్చు. అలాగే తండ్రి ఆధిపత్యధోరణి కేవలం అతని అహంకారానికి, అధికార ధోరణికి మాత్రమే ప్రతిబింబమా? లేక ఏ ఇతర కారణాలేవైనా దాని వెనుక ఉండి ఉండొచ్చా? అభద్రతలాంటి మరేవైనా కారణమా? ఉంటే వాటిని దూరం చేయడానికి కుటుంబసభ్యులుగా మీరందరూ సమిష్టిగా ఎంతవరకు దోహదపడగలుగుతారు అనేదీ ఆలోచించండి. అతను మారడం సాధ్యంకాదు అని మీకు గట్టిగా అనిపిస్తే మిమ్మల్ని మీరు దృఢపరుచుకోవడానికి ఏం చేయాలో ఆలోచించండి.

★



డా. పద్మజ, సైకాలజిస్టు

సహజ పద్ధతులనే పాటిస్తే మంచిది

పొద్దున లేవగానే టూత్‌పేస్ట్ మొదలు.. రాత్రి పడుకునేముందు దోమల నివారణ కోసం ఉపయోగించే ఆలవుట్ వరకు రోజువారీ జీవితంలో వాడే ఉత్పత్తులు అనేకం. ఇక మహిళల విషయానికి వస్తే కాస్మొటిక్స్ జాబితా పెద్దదే. అయితే ఈ ఉత్పత్తులన్నీ పరీక్షలు జరిపినవేనా? అంటే సమాధానం శూన్యమే. రోజువారీ జీవితంలో ఉపయోగిస్తున్న 84 వేల రసాయన ఉత్పత్తుల్లో కేవలం ఒక్కశాతం మాత్రమే పరీక్షలు జరిపినవని గతంలో ఓ సర్వే తేల్చింది. ఈ ఉత్పత్తుల వల్ల పురుషుల కంటే అందం కోసం కాస్మొటిక్స్ అధికంగా ఉపయోగించే మహిళలకే ప్రమాదం ఎక్కువని హెచ్చరించింది. 25శాతం మంది మహిళలు ప్రతిరోజూ సగటున మేకప్, యాంటీ ఏజింగ్ వంటి క్రీమ్స్‌తో కలిపి మొత్తం 15 ఉత్పత్తులను ఉపయోగిస్తున్నారు. వాటిలో 168 రకాల రసాయనాలు ఉంటున్నాయి. వీటివల్ల సాధారణ మహిళలకంటే గర్భిణులకు ప్రమాదం రెట్టింపు. ఇవి పుట్టబోయే బిడ్డకు హాని కలిగిస్తాయని సర్వే వెల్లడించింది. ఇందుకు ఫార్మాల్డీహైడ్ మంచి ఉదాహరణ. బ్యాక్టీరియా, ఫంగస్‌ను నివారించే రసాయనాన్ని అనేక ఉత్పత్తుల్లో వాడుతున్నారు. కాస్మొటిక్స్, సోప్స్, షాంపూస్, లోషన్స్, డియోడరెంట్స్, నెయిల్ పాలిష్, హెయిర్ జెల్స్, కొన్ని కలప ఉత్పత్తుల్లో, బట్టల్లో ఇలా అనేక రకాలుగా ఉపయోగిస్తున్నారు. దీని అధిక వాడకం అబార్షన్‌కి దారి తీస్తుంది. పిల్లలు తక్కువ బరువుతో పుడతారు. నిజానికి ఫార్మాల్డిహైడ్‌ను ఏ ఉత్పత్తిలో అయినా 0.2 శాతం కంటే ఎక్కువ ఉపయోగించకూడదని నిపుణులు చెబుతున్నారు. చట్టాలు కూడా ఉన్నాయి. కానీ వాటిని పట్టించుకునేవారే లేరు. ప్రమాదకరమైన డయాజోలిడినిల్ యూరియాను డియోడరెంట్, షాంపూలు, కండీషనర్స్, లోషన్స్ తయారీలో వినియోగిస్తున్నారు. ఇక లెడ్ అసిటేట్‌ను హెయిర్‌డైస్‌లో ఉపయోగిస్తున్నారు. మిథేలిన్ గ్లైకోల్ లేదా ఫార్మాల్డిహైడ్‌ను హెయిర్ ట్రీట్‌మెంట్స్‌లోనూ వాడుతున్నారు. ప్రాపిల్ పారాబెన్‌ను షాంపూలు, కండీషనర్ల తయారీలో వినియోగిస్తున్నారు. క్వాటెర్నియమ్-15ను షేవింగ్‌క్రీమ్స్, షాంపూస్, స్కిన్ క్రీమ్స్, క్లెన్సర్స్‌లో వాడుతున్నారు. ఇవన్నీ ఉపయోగించి తయారు చేస్తున్న లోషన్లు, క్రీములను చర్మానికి పూయడంవల్ల అందులోని 60శాతాన్ని శరీరం గ్రహిస్తుంది. వీటి వినియోగం వల్ల క్యాన్సర్‌తోపాటు గుండె సంబంధిత వ్యాధులు, శ్వాస సంబంధిత జబ్బులు, నరాలకు సంబంధించిన రోగాలు వచ్చే అవకాశం ఉంది. మార్కెట్లో దొరుకుతున్నాయి కదా అని అన్ని రకాలు మన ఒంటిమీద ప్రయోగం చేయకూడదు. అది మనకే కాదు మన కుటుంబానికి ప్రమాదకరం. పాతకాలానివే అయినా సహజమైన పద్ధతులనే పాటించడం మంచిది.



★

చిట్కా

తులసి ఆకులను ఉండగా చేసి పంటికింద ఉంచుకుంటే పంటినొప్పి తగ్గుతుంది.



జీవన సౌరభం

ఆమెను విస్మరించడం అంటే ప్రపంచాన్ని విస్మరించడమే

మార్కెట్లకు సెలవులు

ముంబయి : హోలీ సందర్భంగా శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లకు సెలవు ప్రకటించారు. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బిఎస్ఇ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఇ)లు పని చేయలేదు. అదే విధంగా బులియన్ సహా ఫారెక్స్, కమొడిటీ మార్కెట్లకు కూడా సెలవు లభించింది. శనివారం, ఆదివారం కూడా సాధారణ సెలవులు కావడంతో వరుసగా మూడు రోజులు ట్రేడింగ్‌కు సెలవు దొరికినట్లయ్యింది. డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి గణంకాలు పెరిగినప్పటికీ గురువారం స్టాక్ మార్కెట్లను ఆదుకోలేకపోయాయి. బిఎస్ఇ 137 పాయింట్లు కోల్పోయి 34046.94కు, నిఫ్టీ 34.50 పాయింట్లు తగ్గి 10458.35 వద్ద ముగిసింది.



బేయర్-ఆర్‌విజె స్నాతకోత్సవం..

బేయర్-ఆర్‌విజె స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ తన 18వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆ సంస్థ తెలిపింది. దీనికి సురేష్ ప్రొడెక్షన్ ఎండి సురేష్ బాబు, విజ్ఞాన జ్యోతి అధ్యక్షుడు డాక్టర్ డిఎన్ రావు, ప్రధాన కార్యదర్శి బి శరత్ గోపాల్, డైరెక్టర్ అర్జున్ రావు, సలహా మండలి అధ్యక్షుడు అచ్యుత రామ ప్రసాద్ తదితరులు హాజరయినట్లు పేర్కొంది.



పోర్డ్ విస్తరణ..

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఫోర్చ్యూన్ ఫోర్డ్ దేశంలోని 267 పట్టణాల్లో 465 సేల్స్, సర్వీసు కేంద్రాలకు విస్తరించినట్లు ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్ అనురాగ్ మల్‌హోత్రా పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో మరో కొత్త స్టోర్‌ను తెరవడం ద్వారా తెలంగాణలో 12 కేంద్రాలకు విస్తరించినట్లయ్యిందన్నారు.

టికెట్ రద్దుకు బీమా : హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో

ముంబయి : జీవితేతర బీమా సంస్థ అయిన హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో కొత్తగా 'టికెట్ కాన్సిలేషన్ ఇన్సూరెన్స్' పాలసీని ప్రకటించింది. ముందుగా బుక్ చేసుకున్న టికెట్‌ను కొనుగోలుదారు రద్దు చేసుకున్న పక్షంలో ఈ నూతన పాలసీ తగు రక్షణ కల్పిస్తుందని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేష్ కుమార్ తెలిపారు. దేశంలో జీవితేతర బీమారంగంలో ఈ తరహాలో ఇదే మొదటిదని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత విభావరి, ట్రైనింగ్ వర్క్‌షాప్స్, క్రీడల మ్యాచ్‌లు, సాహసకృత్యాలు లాంటి కార్పొరేట్, సోషల్ ఈవెంట్స్‌కి ఇది వర్తిస్తుందన్నారు. నిర్దేశిత ఈవెంట్‌కు సంబంధించి కొనుగోలుదారులు ముందుగా బుక్ చేసుకున్న టికెట్లను రద్దు చేసుకున్న పక్షంలో వాటిల్లే ఆర్థికనష్టాల బారినుంచి ఈవెంట్ టికెటింగ్ పార్ట్‌నర్స్‌ను ఈ పాలసీ కాపాడుతుందన్నారు. ఈవెంట్ నిర్వాహకులచే ఈవెంట్ రద్దు అయినప్పుడు, వాయిదా పడినప్పుడు, రీషెడ్యూల్ లేదా రీలొకేట్ అయిన సందర్భాల్లో ఈ నూతన పాలసీ వర్తించదన్నారు.

వడ్డీరేట్లు పెంచిన ఐసిఐసిఐ బ్యాంకు

ముంబయి : ఎస్‌బిఐ బాటలోనే ఐసిఐసిఐ బ్యాంకు కూడా రుణాలపై వడ్డీ రేట్లను 15 బేసిస్ పాయింట్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. నిధుల వ్యయం ఆధారంగా రుణ రేట్లు (ఎంసిఎల్ఆర్)ను పక్షం రోజులకు గాను 7.95 శాతానికి చేర్చింది. ఇంతక్రితం ఈ రేటు 7.8 శాతంగా ఉంది. నెల రోజుల వ్యవధికి ఎంసిఎల్ఆర్‌ను 7.85 శాతం నుంచి 8 శాతానికి పెంచింది. ఆరు నెలల కాలానికి 8.15 శాతం నుంచి 8.25 శాతానికి చేర్చింది. ఏడాది కాల పరిమితికి ఎంసిఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు పెంచి 8.2 శాతం నుంచి 8.30 శాతానికి చేర్చింది. సవరించిన వడ్డీ రేట్లు మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చాయని ఆ బ్యాంకు వెల్లడించింది. దీంతో రిటైల్, గృహ రుణాలు ప్రియం కానున్నాయి. దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు రంగ బ్యాంకు యాక్సిస్ బ్యాంకు కూడా రుణాలపై వడ్డీ రేట్లను ఫిబ్రవరి 17 నుంచే పెంచింది. మూడు నెలల నుంచి మూడు సంవత్సరాల కాలపరిమితి ఎంసిఎల్ఆర్‌లో 10 బేసిస్ పాయింట్లను పెంచింది. దీంతో మూడు మాసాల ఎంసిఎల్ఆర్ 8.15 శాతం, ఆరు మాసాలకు 8.30 శాతం, ఏడాదికి 8.40 శాతానికి చేర్చింది.

పూర్తిగా తెరిచాం

భారత ఆర్థిక వ్యవస్థపై మంత్రి ప్రభు
ఎఫ్‌డిఐలకు ఎర్ర తివాచీ
అన్ని రంగాల్లోకి అనుమతించాం
అన్ని దేశాలతో వ్యాపార సంబంధాలు
ద్వైపాక్షిక ఒప్పందాలకు సిద్ధం
'ఆర్‌సెప్'లో పరిశ్రమల మంత్రి వెల్లడి



సింగపూర్ : భారత ఆర్థిక వ్యవస్థ చాలా వరకూ తెరిచి ఉందని కేంద్ర పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. అన్ని దేశాలతో వ్యాపార సంబంధాలు, ఒప్పందాలు కలిగి ఉన్నామన్నారు. ఎఫ్‌డిఐలకు ఇండియా రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతుందన్నారు. సింగపూర్‌లో జరుగుతున్న రీజినల్ కంప్రెహెన్సీవ్ ఎకనామిక్ కో ఆపరేషన్ (ఆర్‌సెప్)లో మంత్రి మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్యంలో దేశం చాలా ఉత్సుకతతో పని చేస్తుందన్నారు. 10 మంది సభ్య దేశాలు కలిగిన అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియేషన్ దేశాలతో మెగా ఉచిత వాణిజ్య ఒప్పందం కలిగి ఉందని గుర్తు చేశారు.

సరళీకరణలు తెచ్చాం..

భారత ఆర్థిక వ్యవస్థ తెరుచుకుని ఉందని, వాణిజ్య సంబంధాలు, ఒప్పందాలను సాధ్యమైనంత వరకు కొనసాగిస్తుందని మంత్రి అన్నారు. ముఖ్యంగా ఆసియన్ దేశాలతో తత్సంబంధాలు కొనసాగుతాయని "ఇండియాస్ ఎకనామిక్ రీఫామ్స్ అండ్ గ్లోబల్ ఇంటిగ్రేషన్" కార్యక్రమంలో ఆయన అన్నారు. రక్షణ రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు వీలుగా ఆర్థిక వ్యవస్థలో సరళీకరణలు తీసుకొచ్చామని అన్నారు. అదే విధంగా ఆసియన్, పొరుగు దేశాలతో సహకార వ్యాపారం కొనసాగుతుందన్నారు. సాధ్యమైనంత వరకూ ద్వైపాక్షిక, బహుళ ఒప్పందాలే తమ లక్ష్యమని అన్నారు. వీటి వల్ల అనేక దేశాలతో పాటు తమ దేశం కూడా లాభపడనుందన్నారు.

అయితే ఈ ఒప్పందాలు చేసుకోవడం చాలా క్లిష్ట, కష్టతరమని అయినప్పటికీ భారత్ ఈ విషయంలో అత్యంత సానుకూలతతో చొరవ చూపుతుందన్నారు. ఇందుకోసం తాము పరిష్కారాన్ని వెతుకుతున్నామన్నారు.

ఉత్సాహంగా ఉన్నాం..

విదేశీ వాణిజ్యం, ఒప్పందాల్లో దేశీయ ఆసక్తులను కూడా ఇందులోకి పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఎవరితో కలిసి పని చేయాలనే దానిపై దారులు వెతుకుతున్నామన్నారు. గ్లోబల్ ట్రేడింగ్ విధానం లో తాము వివిధ స్థాయిల్లో బహుళ ఒప్పందాల అంశంలో డైనమిక్‌గా ఉత్సాహంగానే వ్యవహరిస్తున్నామన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) గ్లోబల్ ట్రేడ్ వ్యవహారాల్లో విజయవంతంగా ముందుగా సాగుతుందన్నారు.

ఆర్‌సెప్‌లో ఎవరున్నారు..

ప్రపంచంలోనే ఆర్‌సెప్ అనేది అతిపెద్ద రీజినల్ ట్రేడింగ్ జట్టుగా ఉంది. ఇందులో ముఖ్యంగా ఆసియన్ దేశాలు సభ్యులుగా ఉన్నాయి. బ్రూనీ దారుసలేమ్, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పిన్స్, సింగపూర్, థాయిలాండ్, వియత్నాం లాంటి చిన్న దేశాలతో పాటు ఆస్ట్రేలియా, చైనా, ఇండియా, జపాన్, సౌత్ కొరియా, న్యూజీలాండ్ లాంటి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాలు కూడా భాగస్వామ్యమై ఉన్నాయి.

ఆర్‌సెప్‌కు సింగపూర్ ఆతిథ్యం ఇస్తోంది. మార్చి 1 నుంచి 3 వరకు ఆయా దేశాల మంత్రులు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొంటున్నారు. ఇందులో ఆయా దేశాల వ్యాపార అవకాశాలపై చర్చిస్తారు. ఈ సందర్భంగా సింగపూర్ డిప్యూటీ పిఎం తర్మన్ షన్ముగరత్నమ్, ఆర్థిక శాఖ మంత్రి హెంగ్ స్వీ క్వీట్, పరిశ్రమ మంత్రి లిమ్ హగ్ కియంగ్, విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలక్రిష్ణన్‌తో ప్రభు భేటీ అయ్యారు.

ఎపిలో డెస్క్ ఎరా 500 కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

క్లౌడ్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ అయిన డెస్క్ ఎరా ఆంధ్రప్రదేశ్‌లో రూ.500 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపింది. తన క్లౌడ్ కనెక్ట్ ప్రోగ్రామ్ కింద ఈ పెట్టుబడులు చేయడానికి భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామని డెస్క్ ఎరా సిఇఒ శశాంక్ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కంపెనీ రాష్ట్రంలో ఒక క్లౌడ్ సెంటర్‌ను నెలకొల్పనుందన్నారు. దీంతో రానున్న రెండేళ్ళలో 1,000 కిపైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నామన్నారు. ఆ కేంద్రాన్ని వైజాగ్‌లో అందుబాటులోకి తేనున్నామన్నారు. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను కూడా సంస్థ చేపట్టనుందన్నారు.

దక్షిణాదికి బి2ఎక్స్ విస్తరణ

హైదరాబాద్ : స్మార్ట్ మొబైల్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ఉత్పత్తుల కోసం కస్టమర్ కేర్ సేవలందించే బి2ఎక్స్ దక్షిణాధి విస్తరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆ సంస్థ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాంత ముఖ్య నగరాల్లో తమ నెట్‌వర్క్‌ను 50 శాతానికి పైగా పెంచుకోనున్నట్లు బి2ఎక్స్ ఇండియా సిఇఒ దీప్ పంత్ పేర్కొన్నారు. మల్టీ బ్రాండ్, ఒఇఎం కేంద్రీకృత కేర్ సెంటర్ల ద్వారా చేయనున్నామన్నారు. అదే విధంగా ఈ ప్రాంతంలో అత్యాధునిక సర్వీసు ఫ్యాక్టరీని తెరువనున్నామన్నారు. దీంతో మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించే అవకాశం ఉందన్నారు. గత డిసెంబర్‌లో సామ్‌సంగ్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ శ్రేణీ కేర్ సొల్యూషన్స్ అందించాలనేది తమ లక్ష్యమన్నారు.

డిఎస్సీ, ఆర్ఆర్‌బి, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

కంబైన్డ్ హార్వెస్టర్ అనగా?

విజేత



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

1. ప్రపంచీకరణ వల్ల బహుళజాతి సంస్థలు (ఎంఎన్‌సి)గా ఎదిగిన భారతీయ కంపెనీకానిది ఏది?
ఎ. టాటా మోటార్స్ బి. రాన్‌బాక్సీ
సి. సుందరం ఫాస్టెనర్స్ డి. క్వాలిన్ క్లెయిన్

2. అమెరికా జిడిపిలో వ్యవసాయరంగం యొక్క వాటా మొత్తం ఉపాధి వాటాలు వరుసగా?
ఎ. 1%, 0.5% బి. 2%, 1%
సి. 1%, 1% డి. 51%, 1%

3. ప్రపంచీకరణ వేగంగా జరగడానికి కారణం కింది వానిలో..
ఎ. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందడం
బి. రవాణా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందడం
సి. సమాచార, భావప్రసార సాంకేతిక రంగంలో గణనీయమార్పులు రావడం
డి. పైవన్నీ

4. ఉత్పత్తి కారకాలు అనగా ఏ ఏ అంశాలు పరిగణించబడతాయి?
ఎ. భూమి, వ్యవసాయం బి. శ్రమ
సి. మూలధనం డి. అన్నీ

5. ద్రవ్యం అనే పదం ఏ దేవత పేరు నుంచి ఆవిర్భవించింది?
ఎ. జూనో
బి. జూనోమునేటా అనే రోమన్ దేవత
సి. జునైటా డి. ఏవీకావు

6. ద్రవ్య విధులను నిర్వర్తించేదే ద్రవ్యం అని చెప్పినవారు?
ఎ. వాకర్ బి. సెలిగ్‌మన్
సి. కీన్స్ డి. రాబర్ట్‌సన్

7. ఆస్తులు నేరుగా వినిమయ మాధ్యమంగా పనిచేయగల లక్షణాన్ని ఏమంటారు?
ఎ. పరపతి బి. రుణం
సి. ద్రవ్యరాశి డి. ద్రవ్యత్వం

8. ద్రవ్యం యొక్క అంతర్గత విలువకంటే ముఖవిలువ ఎక్కువగా ఉంటే దానిని
ఎ. పరపతి ద్రవ్యం బి. ప్రామాణిక ద్రవ్యం
సి. టోకెన్ ద్రవ్యం డి. ఐచ్ఛిక ద్రవ్యం

9. ఆర్‌బిఐ ప్రకారం కిందివానిలో ప్రస్తుతం ద్రవ్యంగా గుర్తించి విశాల ద్రవ్యంగా పరిగణించేది ఏది?
ఎ. ఎం1 బి. ఎం2
సి. ఎం4 డి. ఎం3

10. ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యంగల ఖాతా?
ఎ. పొదుపు ఖాతా
బి. కరెంట్ ఖాతా
సి. స్థిర డిపాజిట్ ఖాతా
డి. ఏవీకావు

11. 7వ నెంబర్ జాతీయ రహదారి ఈ రాష్ట్రం గుండా ప్రయాణించదు?
ఎ. ఉత్తరప్రదేశ్
బి. తెలంగాణ
సి. పశ్చిమబెంగాల్
డి. తమిళనాడు

12. 7వ నెంబర్ జాతీయ రహదారి యొక్క మరో నూతన నెంబర్
ఎ. 43 బి. 44 సి. 45 డి. 46

13. ఎపియస్ ఆర్‌టిసి ఆర్డినరీ బస్సులకు ఉన్న పేరు?
ఎ. గ్రామీణ వెలుగు బి. తెలుగు వెలుగు
సి. ఆంధ్ర వెలుగు డి. ప్రగతి వెలుగు

14. టిఐఎంఎస్ అనగా..?
ఎ. టికెట్ ఇంటరెస్ట్ మెషీన్ సిస్టం
బి. టైమ్ ఇంటిగ్రేషన్ మెషీన్ సిస్టం
సి. టికెట్ ఇష్యూయింగ్ మెషీన్ సిస్టం
డి. టికెట్ ఇంటలెక్చువల్ మిషీన్ సిస్టం

15. కింది వానిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సర్వీసు కానిది?
ఎ. గరుడ బి. ఇంద్ర
సి. సూర్య డి. తెలుగు వెలుగు

16. ఆంధ్రప్రదేశ్‌లోని రైలు మార్గాలు ఈ జోన్‌కు చెందుతాయి?
ఎ. ఉత్తర రైల్వే బి. తూర్పు రైల్వే
సి. పశ్చిమ రైల్వే డి. దక్షిణ మధ్య రైల్వే

17. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే స్టేషన్లు?
ఎ. 550 బి. 650
సి. 750 డి. 850

18. ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద ఓడరేవు?
ఎ. కాకినాడ బి. కృష్ణపట్నం
సి. విశాఖపట్నం డి. గంగవరం

19. ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లపై తిరిగే వాహనాలలో అత్యధికం ఈ రకానికి చెందినవి?
ఎ. కార్లు బి. లారీలు
సి. ఆటో రిక్షాలు డి. ద్విచక్ర వాహనాలు

20. రవాణా శాఖ రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రతి సంవత్సరం ఎప్పుడు నిర్వహిస్తుంది?
ఎ. జనవరి మొదటివారం
బి. ఫిబ్రవరి మొదటివారం
సి. మార్చి మొదటివారం
డి. ఏప్రియల్ మొదటివారం

21. ఆంధ్రాపేపర్ మిల్లు ఇక్కడ ఉంది?
ఎ. రాజమండ్రి బి. కర్నూలు
సి. విశాఖపట్నం డి. విజయవాడ

22. కాగితం తయారీలోని ఐదు దశలను సరైన క్రమంలో అమర్చండి?
1. కట్టింగ్ 2. గుజ్జును పరుచుట
3. ముక్కలు చేయడం 4. కలప గుజ్జు తయారీ
5. ఒత్తడం
ఎ. 3,2,5,4,1 బి. 3,4,5,2,1
సి. 3,1,2,4,5 డి. 3,4,2,5,1

23. కాగితం తయారీకి కావాల్సిన ముడిపదార్థాలు
1. వెదురు 2. యూకలిప్టస్
3. సుబాబుల్ 4. పాత కాగితం
ఎ. 1,2,3,4 బి. 1,2,3
సి. 2,3,4 డి. 1,2,4



24. కాగితం పరిశ్రమకు కావాల్సిన కనీస విద్యుత్ సామర్థ్యం?
ఎ. 25 మెగావాట్లు బి. 100 మెగావాట్లు
సి. 150 మెగావాట్లు డి. 200 మెగావాట్లు

25. ఈ కింది వానిలో శాశ్వత ఉద్యోగులు పొందే సౌకర్యం?
ఎ. ప్రావిడెంట్ ఫండ్
బి. ఇఎస్ఐ సౌకర్యం
సి. వేతనంతో కూడిన సెలవులు
డి. పైవన్నీ

26. ఈ కింది కార్మికుల్లో అతి తక్కువ సౌకర్యాలు పొందేవారు?
ఎ. శాశ్వత ఉద్యోగి
బి. కాంట్రాక్ట్ కార్మికుడు
సి. దినసరి కూలీ
డి. అవుట్ సోర్సింగ్ కార్మికుడు

27. వస్త్ర ఉత్పత్తిలో అత్యధిక వాటా కలిగినది?
ఎ. చేనేత బి. మిల్లులు
సి. మరమగ్గాలు డి. బనీన్లు

28. 2009లో ఆంధ్రప్రదేశ్‌లో చేనేత యూనిట్ల సంఖ్య?
ఎ.1,55,00 బి. 40,500
సి. 1,24,700 డి. 1,03,000

29. రవాణా, వ్యాపార కార్యకలాపాలు ఈ రంగానికి చెందినవి?
ఎ. వ్యవసాయ బి. పారిశ్రామిక
సి. సేవా డి. ప్రాథమిక

30. ప్రపంచంలో భారతదేశ టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ స్థానం
ఎ. ఒకటి బి. రెండు
సి. మూడు డి. నాలుగు

31. కార్ల ఉత్పత్తిలో అసెంబ్లీ లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది?
ఎ. కార్ల్‌బెంజ్
బి. హెన్రీఫోర్డు
సి. చార్లెస్ గుడ్ ఇయర్
డి. థామస్ అల్వా ఎడిసన్

32. భారతదేశంలో వ్యవసాయ పనులలో 2009 సంవత్సరంలో పశువుల వినియోగ శాతం?
ఎ. 35 బి. 18 సి. 13 డి. 10

33. కంబైన్డ్ హార్వెస్టర్ అనగా?
ఎ. వరినాటు యంత్రం
బి. కలుపుతీత యంత్రం
సి. వరికోత యంత్రం
డి. భూమి దున్ను యంత్రం

34. ఈ కిందివానిలో ఎక్కువ మంది కార్మికులకు ఒకే చోట ఉపాధి కల్పించేది?
ఎ. నూలుమిల్లు బి. మరమగ్గం కేంద్రం
సి. చేనేత కేంద్రం డి. పైవేవీకావు

35. ఈ కింది వానిలో మరమగ్గాల కేంద్రాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం?
ఎ. ఒడిశా బి. పశ్చిమబెంగాల్
సి. తమిళనాడు డి. కేరళ

36. భారతదేశంలో ప్రస్తుతం మరమగ్గాల సంఖ్య (సుమారుగా)
ఎ. 13 లక్షలు బి. 18 లక్షలు
సి. 24 లక్షలు డి. 28 లక్షలు

సమాధానాలు : 1.డి, 2.ఎ, 3.డి, 4.డి, 5.బి, 6.ఎ, 7.డి, 8.సి, 9.డి, 10.బి, 11.సి, 12.బి, 13.బి, 14.సి, 15.సి, 16.డి, 17.బి, 18.సి, 19.డి, 20.ఎ, 21.ఎ, 22.డి, 23.ఎ, 24.ఎ, 25.డి, 26.సి, 27.సి, 28.సి, 29.సి, 30.సి, 31.బి, 32.సి, 33.సి, 34.ఎ, 35.సి, 36.సి,

★

2011 జనాభా లెక్కల ప్రకారం కొన్ని వివరాలు

పిల్లలో లింగ నిష్పత్తి

జనాభాగణణ ప్రకారం 0-6 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని పిల్లలుగా పరిగణిస్తారు.

✧ 2011లో ఆంధ్రప్రదేశ్‌లో పిల్లల సంఖ్య - 52,43,636
✧ వీరిలో బాలురు - 26,97,015
✧ వీరిలో బాలికలు - 25,46,621
✧ 2011లో బాల బాలికలలో లింగ నిష్పత్తి (1000 బాలురకు గల బాలికలు) - 944
✧ 2011లో అత్యధిక పిల్లలో లింగ నిష్పత్తి గల జిల్లా - తూర్పుగోదావరి (970)
✧ 2011లో తక్కువ లింగ నిష్పత్తి గల జిల్లా - వై.ఎస్.ఆర్.కడప (918)

అక్షరాస్యత

✧ 2011లో రాష్ట్రంలో అక్షరాస్యత - 67.35 శాతం
✧ 2011లో రాష్ట్రంలో మొత్తం అక్షరాస్యుల సంఖ్య - 2,98,59,982
✧ 2011లో అత్యధిక అక్షరాస్యత శాతం గల జిల్లా - పశ్చిమ గోదావరి (74.32%)
✧ 2011లో అత్యల్ప అక్షరాస్యత శాతం గల జిల్లా - విజయనగరం (58.89%)
✧ 2011లో అత్యధిక అక్షరాస్యుల సంఖ్య గల జిల్లా - తూర్పు గోదావరి (33,48,077)
✧ 2011లో తక్కువ అక్షరాస్యుల సంఖ్య గల జిల్లా - విజయనగరం (12,38,388)

గ్రామీణ పట్టణ జనాభా

✧ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ జనాభా - 3,49,66,693 (70.53%)
✧ ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ జనాభా - 1,46,10,410 (29.47%)
✧ గ్రామీణ జనాభా శాతం అధికంగా ఉన్న జిల్లా - తూర్పుగోదావరి
✧ గ్రామీణ జనాభా శాతం తక్కువగా ఉన్న జిల్లా - శ్రీకాకుళం
✧ పట్టణ జనాభా శాతం అధికంగా ఉన్న జిల్లా - విశాఖపట్నం (47.45%)
✧ పట్టణ జనాభా శాతం తక్కువగా ఉన్న జిల్లా - శ్రీకాకుళం (16.16%)

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల జనాభా

✧ 2011లో రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల జనాభా - 84,69,278 (17.08%)
✧ అధిక ఎస్సీ జనాభా కలిగిన జిల్లా - గుంటూరు (9,57,407)
✧ తక్కువ ఎస్సీ జనాభా కలిగిన జిల్లా - విజయనగరం (2,47,728)
✧ అధిక ఎస్సీ జనాభా శాతం కలిగిన జిల్లా - ప్రకాశం (23.19%)
✧ తక్కువ ఎస్సీ జనాభా శాతం కిలిగిన జిల్లా - విశాఖపట్నం (7.68%)
✧ అత్యధిక ఎస్సీ అక్షరాస్యత కలిగిన జిల్లా - పశ్చిమగోదావరి (71.43%)
✧ తక్కువ ఎస్సీ అక్షరాస్యత కలిగిన జిల్లా - కర్నూలు (55.26%)
✧ అత్యధిక ఎస్సీ స్త్రీ - పురుష నిష్పత్తిగల జిల్లా - శ్రీకాకుళం (1042)
✧ తక్కువ ఎస్సీ స్త్రీ - పురుష నిష్పత్తిగల జిల్లా - ప్రకాశం (983)

2011లో రాష్ట్రంలో జనాభా లెక్కల ఆధారంగా షెడ్యూల్డ్ తెగల జనాభా వివరాలు

✧ రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల జనాభా - 27,40,133
✧ రాష్ట్ర జనాభాలో షెడ్యూల్డ్ తెగల శాతం - 5.53%
✧ అత్యధిక జనాభా గల జిల్లా - విశాఖపట్నం (6,18,500)
✧ తక్కువ జనాభా కలిగిన జిల్లా - కడప (75,886)
✧ అత్యధిక జనాభా శాతం గల జిల్లా - విశాఖపట్నం (14.42%)
✧ అత్యల్ప జనాభా శాతం గల జిల్లా - కర్నూలు (2.04%)

'చలో గుంటూరు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దళితులపై పెరుగుతున్న దాడులు, మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన చేపట్టిన 'చలో గుంటూరు'ను విజయవంతం చేయాలని పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ కోరింది. శ్రీకాకుళంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిరంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు డి.గణేష్, మిస్క కృష్ణయ్య మాట్లాడారు. గుంటూరు జిల్లా పెదగొట్టిపాడులో దళితులపై దాడి చేసి రెండు నెలలవుతోందని, నిందితులను ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు. దాడి చేసిన పెత్తందారులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

రౌండ్‌టేబుల్

'రైతులకు కనీస మద్దతు ధర - రుణ విముక్తి - ప్రత్యేక హోదా సాధన - రైతుల ఆత్మహత్యల నివారణ' అనే అంశాలపై విజయనగరంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు



రైతు సమస్యలపై బిల్లు పెట్టకపోతే ఉధృత పోరాటం

ఆలిండియా కిసాన్ సంఘ్ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వాలు రైతులకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని ఆలిండియా కిసాన్ సంఘ్ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్, వ్యవసాయ శాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారానికి వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 'రైతులకు కనీస మద్దతు ధర - రుణ విముక్తి - ప్రత్యేక హోదా సాధన - రైతుల ఆత్మహత్యల నివారణ' అనే అంశాలపై విజయనగరంలోని నండూరి ప్రసాదరావు భవన్‌లో శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యయంలో 50 శాతం అదనంగా కలిపి కనీస ధరగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలను దేశవ్యాప్తంగా ఒకేసారి రద్దు చేయడంతో పాటు, కేరళ రాష్ట్రం మాదిరిగా రుణ ఉపశమన చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ రెండు అంశాలపైనా పార్లమెంటులో బిల్లుపెట్టి ఆమోదానికి ప్రయత్నించకపోతే ప్రయివేటు బిల్లు ప్రవేశపెడతామన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు గురతున్నారన్నారు. ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఈ నెలలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో 8వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమానికి ఆలిండియా కిసాన్ సంఘ్ కో-ఆర్డినేషన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గేదెల సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

విద్యుత్ కార్మికుల వినూత్న ఆందోళనలు

- శ్రీకాకుళంలో 16 మంది అరెస్టు
- ప్రభుత్వం తీరు దుర్మార్గం : బాలకాశి



విజయవాడలో మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

శీర్షాసనం, రక్తదానం, చెవిలో పువ్వులు తదితర రూపాల్లో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు వినూత్నంగా ఆందోళనల కార్యక్రమాలను కొనసాగించారు. 11 రోజులుగా రాష్ట్రవ్యాప్త సమ్మె చేపట్టినా పట్టించుకోని తీరుపై కార్మికులు మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడం, రెగ్యులర్ చేయడం తదితర న్యాయమైన డిమాండ్లను ఆమోదించడానికి రాష్ట్రప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంపై కార్మికులు, వారికి మద్దతుగా పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.బాలకాశీ విమర్శించారు. ఐక్యవేదిక ఆధ్వర్యాన ప్రకాశం జిల్లా ఒంగోలు విద్యుత్ భవన్ వద్ద చేపట్టిన కాంట్రాక్ట్ కార్మికుల దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందునే అనివార్యంగా సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. పలుచోట్ల నిరాహార దీక్షలు, ధర్నాలు, ప్రదర్శనలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేత తదితర రూపాల్లో కార్మికుల ఆందోళనలు కొనసాగాయి. శ్రీకాకుళం డైమండ్ పార్కు వద్ద నిరసన చేపట్టేందుకు సిద్ధమవుతున్న సిఐటియు, విద్యుత్ ఐక్యవేదిక నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, ఐక్యవేదిక జిల్లా చైర్మన్ నర్తు గణపతిసహా 16 మందిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తిరుపతి డిస్కం కార్యాలయం ఎదుట శిబిరంలో అర్ధనగ్నంగా శీర్షాసనం వేసి కార్మికులు నిరసన తెలిపారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) కన్వీనర్ ఎస్.చంద్రశేఖర్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు రక్తదానం చేశారు. కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబుకు వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. భీమవరం తాలూకాఫీసు సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలను సిఐటియు నాయకులు బివి వర్మ, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు దండలు వేసి ప్రారంభించారు. స్థానిక యుటిఎఫ్ నాయకులు ఫెడరేషన్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి స్థానిక తాలూకా ఆఫీసు సెంటర్‌లో సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు.

విజయవాడ ధర్నా చౌక్ వద్ద సమ్మెకు మద్దతుగా సిఐటియు పశ్చిమ కృష్ణా కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబులకు ఐక్యవేదిక నాయకులు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరాన్ని ఎఐటియుసి నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతపురంలో సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేశ్ మద్దతు తెలిపారు.

విజయనగరం జిల్లా కేంద్రంలో విద్యుత్ భవన్ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వరాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ నెల 4 నుంచి నిరవధిక దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. బొబ్బిలిలో కార్మికుల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.

సమ్మెకు పూర్తి మద్దతు : జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె విషయంలో ప్రభుత్వం వెంటనే కార్మికుల నేతలతో చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న వారి స్థానంలో కొత్త వారిని నియమించే చర్యల్ని ఆయన ఖండించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి సమీపంలో పాదయాత్ర చేస్తున్న జగన్‌ను ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక నాయకులు శుక్రవారం కలిసి మద్దతు కోరారు. కార్మికుల సమ్మెకు పూర్తి మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 7న నిర్వహించనున్న 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమంలో వైసిపి శ్రేణులు పాల్గొంటాయని జగన్ తెలిపినట్లు ఐక్య వేదిక సెక్రెటరీ జనరల్ ఎం.బాలకాశి పేర్కొన్నారు.



ప్రకాశం జిల్లా చీమకుర్తిలో జగన్‌ను మద్దతు కోరుతున్న ఐక్య వేదిక నాయకులు బాలకాశి తదితరులు

జగన్‌ను కలిసిన వారిలో ఐక్య వేదిక నాయకులు సి.చంద్రశేఖర్, కట్టా నాగరాజు, ప్రకాశం జిల్లా ఐక్య వేదిక నాయకులు ఉన్నారు.



మచిలీపట్నంలో జరిగిన పాదయాత్రలో పాల్గొన్న ఉద్యోగులు

సిపిఎస్ రద్దు కోరుతూ.. అమరావతికి ఉద్యోగుల పాదయాత్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (మచిలీపట్నం)

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలంటూ సిపిఎస్ ఉద్యోగుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం నుండి అమరావతికి పాదయాత్ర ప్రారంభించారు. తొలుత సిపిఎస్ దిష్టిబొమ్మ భూతాన్ని కోనేరుసెంటర్‌లో దహనం చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి ప్రారంభమైన పాదయాత్రకు సిపిఎం, కాంగ్రెస్, వైసిపి, జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎస్ ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షులు గొడుగు ప్రతాప్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు మార్చి 5 నుండి జరిగే అసెంబ్లీలో ప్రకటించి కేంద్రానికి పంపాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పశ్చిమకృష్ణా ఎన్‌జిఒస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, సిపిఎం తూర్పుకృష్ణా కమిటీ సభ్యులు కొడాలి శర్మ, మచిలీపట్నం మాజీ శాసనసభ్యులు, వైసిపి నాయకులు పేర్ని వెంకట్రామయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి చౌటపల్లి రవి మాట్లాడారు.

న్యాయవాదుల రాస్తారోకో

సీమలో కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్

పలువురు అరెస్టు విడుదల

ప్రజాశక్తి- కడప/కర్నూలు/అనంతపురం

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో న్యాయవాదులు రాస్తారోకోలు నిర్వహించారు. అనంతపురంలో సిపిఎం, సిపిఐ, బిజెపి నాయకులు జాతీయ రహదారిని దిగ్బంధించారు. తపోవనం జాతీయ రహదారిపై న్యాయవాదులు, రాజకీయ పార్టీలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ముందస్తుగా మోహరించి పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. కర్నూలులో హైకోర్టు సాధన కోసం రాస్తారోకోలు నిర్వహించారు. కడప జిల్లాలో రాయలసీమ న్యాయవాదుల జెఎసి, కడప బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో న్యాయవాదులు రాజశేఖర్, శ్రీనివాసులరెడ్డి, మహేశ్వరరావు, చంద్రమోహన్, మేరీ జాస్లిన్, అమీర్‌బాషా, నందకుమార్ కూర్చున్నారు. రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ ఇర్కాన్ సర్కిల్ లో న్యాయవాదులు రాస్తారోకో నిర్వహించారు. 30 నిమిషాల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో సీమ న్యాయవాదుల జెఎసి కన్వీనర్ మస్తాన్‌వలి, సభ్యులు రాఘవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరాజు, వెంకటరమణారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

మెడికల్ రిప్స్ ప్రచార యాత్రలో ఎంఎల్‌సి రాముసూర్యారావు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదేనని ఎంఎల్‌సి రాము సూర్యారావు అన్నారు. ఎపి మెడికల్ సేల్స్, రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యాన ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్రవ్యాప్త ప్రచార యాత్రల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో చేపట్టిన యాత్రను ఏలూరు జ్యూట్‌మిల్లు వద్ద శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రచారయాత్ర చేయడం అభినందనీయమన్నారు. చిన్నపిల్లల వైద్యులు పిఆర్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యం ఖరీదు అయిపోతున్నందున పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారుతోందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలని కోరారు. కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవిచంద్ర, కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ప్రజలకు పౌష్టికాహారలోపం లేకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగరమేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు వైద్యరంగాన్ని ప్రయివేటుపరం చేస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జబ్బు చేస్తే ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు వివివిఎన్ ప్రసాద్, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు మోహన్‌మురళి, మహేష్, ప్రకాశ్‌రెడ్డి, ఫణికుమార్, సీతయ్య, ఆంజనేయులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జనసేన నాయకుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పెనమలూరు (కృష్ణా)

ఈ నెల 14న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జరగనున్న జనసేన పార్టీ ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నేతలు కృష్ణాజిల్లా పెనమలూరు నుండి కానూరు వరకూ శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కోశాధికారి రాఘవయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పోతిన వెంకటమహేష్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు సాధించడం కోసం అందరూ కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా కామయ్యతోపులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రియాజ్, సతీష్, అమ్మిశెట్టి వాసు, రామస్వామి. గోపాలయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైమ్

ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ క్వార్టర్స్‌లో ఇటీవల ఐదు ఇళ్లలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠా ఈ చోరీలకు పాల్పడినట్లు తేల్చారు. ఈ ముఠాలో మొత్తం ఐదుగురు నిందితులు ఉండగా నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8 లక్షల విలువైన 240 గ్రాముల బంగారం ఆభరణాలు, అరకిలో వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎస్‌పి కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి సత్యఏసుబాబు కేసు వివరాలు వెల్లడించారు. రిమ్స్ క్వార్టర్స్‌లోకి వెనుక నుండి ప్రవేశించి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగతనం చేసే సమయంలో ఆ పక్క నుండే ఇంటి తలుపులకు బయట గడియలు పెట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగతనం చేసిన అనంతరం వారు చోరీ చేసిన సొత్తుతో అదే లారీలో తిరిగి వారి గ్రామాలకు చేరుకున్నారు వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ)గా ఫిరోజ్ కేసును ఛేదించారు. సెల్‌టవర్ ఆధారంగా తన సిబ్బందితో సిఐ 20 రోజులు శ్రమించి ముఠాను పట్టుకున్నారని తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి



ప్రజాశక్తి- రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం తెప్పలవలసకు చెందిన శతాధిక వృద్ధుడు ఆకెళ్ల వెంకటకృష్ణారావు పంతులు (102) గురువారం రాత్రి మృతి చెందారు. 1916లో జన్మించిన ఈయనకు ఏడుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు సంతానం. మనవళ్లు, మనవరాళ్లతో కలుపుకొని ఆయన కుటుంబంలో సుమారు 150 మంది ఉన్నారు. ఆయన కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లలందరూ ప్రభుత్వోద్యోగులు కావడం విశేషం. చనిపోయేంత వరకూ ఆరోగ్యంగా ఉండి తన పని తానే చేసుకునేవారు. జ్వరం, ఇతర అనారోగ్య కారణాలతో ఏనాడూ మంచం పట్టలేదని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. తమిళనాడు
2. మిచ్చెల్ మెక్‌కార్‌మాక్
3. హైదరాబాద్
4. రష్యా
5. కర్నాటక

హోదా కోసం ఏ త్యాగానికైనా సిద్ధం

- నినదించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు
- 'అనంత'లో ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రత్యేక హోదా, విభజన బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు నిర్వహించాయి. కృష్ణా జిల్లా విజయవాడలోని బెంజిసర్కిల్ వద్ద రోడ్డుపై పిసిసి చీఫ్ రఘువీరారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాదాపు అరగంటపాటు బైటాయించారు. పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ నిలిచిపోయింది. రఘువీరారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. రఘువీరారెడ్డిని కంకిపాడు పోలీస్ స్టేషన్‌కు, కొంతమంది కాంగ్రెస్ నాయకులను పెనమలూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాఘువీరారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు కాంగ్రెస్ పార్టీ ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద, ఏలూరు వసంతమహల్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించాయి. పోడూరు సొసైటీ సెంటర్‌లో వామపక్షాలు, వైసిపి ఆధ్వర్యాన ధర్నా జరిగింది. అనంతపురం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారి దిగ్బంధం చేస్తున్నట్లు నాయకులు ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగానే కాంగ్రెస్ పార్టీ నాయకులను గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. ఎక్కడికక్కడ నియోజకవర్గం, మండల స్థాయిలో నాయకులను అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలో టవర్ క్లాక్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పిసిసి అధికార ప్రతినిధి కెవి.రమణ ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మోరంపూడి జంక్షన్లో జాతీయ రహదారిని సుమారు అరగంటసేపు దిగ్బంధనం చేశారు. 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నినాదాలు చేశాయి. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. డిసిసి అధ్యక్షులు పంతం నానాజీ పాల్గొన్నారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెం వద్ద జాతీయ రహదారిని దిగ్బంధించారు. మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు. గుంటూరు జిల్లా నర్సారావుపేటలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై అరగంటపాటు రాస్తారోకో చేశారు. విజయనగరంలో ఎత్తు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారి దిగ్బంధనం చేపట్టారు. డిసిసి అధ్యక్షులు యడ్ల ఆదిరాజు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు

ఉమ్మడి పోరాటంతోనే ప్రత్యేక హోదా సాధించుకోవాలని, ఇందుకు అన్ని పార్టీలు కలిసి పోరాటం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన విజయనగరం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. విశాఖ జిల్లాలోని రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. వామపక్షాల ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్‌లో శుక్రవారం నిరాహార దీక్ష శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు ప్రారంభించారు.



రాజమహేంద్రవరంలో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు

ఎపికి ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను, రాజ్యాంగ, ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తహశీల్దార్ కార్యాలయం సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ప్రత్యేకహోదా అంశంలో చంద్రబాబు ఊసరవెల్లిలా వ్యవహరిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు విమర్శించారు. ప్రకాశం జిల్లాలోనూ దీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక హోదా సాధన కమిటి ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో దీక్షా కార్యక్రమాన్ని నిర్వహించాయి. కడప జిల్లాలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీలు నిర్వహించారు. కర్నూలు జిల్లావ్యాప్తంగా నిరాహార దీక్షలు మొదలయ్యాయి.

ఎపి భవన్‌లో కుల వివక్ష సిగ్గుచేటు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశరాజధానిలోని ఆంధ్రా భవన్‌లో కులవివక్ష సిగ్గుచేటని కెవిపిఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశ రాజధానిలోనే దళిత ఉద్యోగుల పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో ఉన్న దళిత ప్రజల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, వేధింపులు, అవమానాలు, సాంఘిక బహిష్కరణలు, హత్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమకావడంతో నిందితుల ఆగడాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిలో ప్రధాన నిందితులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు అరెస్టు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారని, పెత్తందారులకు అనుకూలంగా ఉంటున్నారని విమర్శించారు. పాలక వర్గాలు అధిపత్య కులాలు కావడంతో దళిత వర్గాలకు చెందిన వారిపై వివక్ష చూపుతున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ పదవికి దళితుడు కండే శ్రీనివాసులకు వస్తే తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి దుర్మార్గాలను ఖండించాలని కోరారు. దళితుల పట్ల జరుగుతున్న వివక్షతపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

గుర్తింపు కాలం ముగిశాక కార్మికుల సమస్యలు గుర్తొస్తున్నాయా

ఆర్టీసీ ఇయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసిలో గుర్తింపు యూనియన్ గుర్తింపు కాలం ముగిసాక ఆర్టీసి నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయు)కు కార్మికుల సమస్యలు గుర్తొస్తున్నాయా అని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి కె పద్మాకర్, అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కార్మిక శాఖ కమిషనర్‌కు ఛాలెంజ్ లేఖ ఇవ్వగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ఎటువంటి పోరాటాలు చేయకుండా సన్మానాలతో కాలయాపన చేసిన నాయకత్వం ఉద్యమ బాటపడతామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. వేతనాల సవరణ, బస్సుల కుదింపు, కార్మికుల తగ్గింపు, ఆర్టీసి పరిరక్షణ, కార్మికులపై పని ఒత్తిడి వంటి అంశాలపై జెఎసిగా పోరాటం చేద్దామని రెండు సార్లు ఎన్‌ఎంయు నాయకత్వాన్ని కలిసి లేఖ ఇచ్చినప్పటికీ ఇంత వరకూ మౌన పోరాటం చేశారని తెలిపారు.

ఇప్పుడు కార్మికులను మోసం చేసేందు కోసం ఈ నెల 12న సమ్మె నోటీసు ఇస్తున్నామని ప్రకటిస్తున్నామని డ్రామా ఆడుతున్నారని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఆర్టీసి సమస్యలపై పోరాడేందుకు ఇప్పటికైనా జెఎసి ఏర్పాటు చేస్తే మద్దతు ఇచ్చేందుకు ఇయు సిద్ధంగా ఉందని తెలిపారు. 20 డిమాండ్లపై ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న ధర్నాలకు మద్దతు పలకాలని కోరారు.



తూర్పుగోదావరిలో అరుదైన శస్త్రచికిత్స

మహిళ కడుపులోంచి 4 కేజీల కణితి తొలగింపు

ప్రజాశక్తి - పిఠాపురం (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం అరుదైన శస్త్రచికిత్స జరిగింది. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన ఎస్.మణి (41) అనే మహిళ కడుపు నుంచి నాలుగు కేజీల బరువున్న కణితిని పిఠాపురం అన్నపూర్ణ ఆసుపత్రి వైద్యులు ఆపరేషన్ చేసి తొలగించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ పిఎన్ రాజు మాట్లాడుతూ మణి అనే మహిళ కడుపునొప్పి అని రావడంతో స్కానింగ్ చేసి, కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. అవసరమైన పరీక్షలు చేసి, శస్త్రచికిత్స అనంతరం కణితిని బయటకు తీశామని తెలిపారు. హిస్ట్రోజన్ అనే హార్మోన్ వల్ల 50 శాతం మంది మహిళల్లో ఇటువంటి కణితులు పెరుగుతాయని చెప్పారు. సాధారణంగా ఒకటి నుంచి రెండు కేజీల బరువుంటాయని, 4 కేజీల వరకూ పెరగడం అరుదని అన్నారు. దీనివల్ల తరచూ మూత్రం రావడం, కడుపునొప్పి, అధిక రక్తస్రావం, నడుంనొప్పి, రక్తహీనత లక్షణాలు కనిపిస్తాయన్నారు. రక్తస్రావం అధికంగా అవ్వడం వల్ల దీన్ని గుర్తించవచ్చని చెప్పారు. శస్త్రచికిత్స చేయించుకున్న మణి ఆరోగ్యంగా ఉందని, తొలగించిన కణితిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు.

లోయలో పడిన కారు : 8 మంది దుర్మరణం

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో 8మంది మరణించారు. చండీఘడ్-మనాలి జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి గోతిలో పడడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతులందరూ కులూ జిల్లాలోని మణికరన్‌లో సిక్కు ప్రార్ధనా మందిరాన్ని దర్శించుకుని వస్తున్నారు. ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు ఆస్పత్రిలో మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్ రోడ్డు మలుపు తిప్పుతుండగా బ్రేకులు విఫలం కావడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రమాదం నుండి బయటపడిన వ్యక్తి చెప్పాడు.

అంతరాయం

జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై కొండ చరియలు విరిగిపడడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. 300 కిలో మీటర్ల పొడవైన ఈ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అధికారులు విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్నారు.



ఇద్దరు జడ్జిల నియామకంపై కేంద్రం తిరకాసు

న్యూఢిల్లీ : ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియంతో కేంద్ర ప్రభుత్వానికి వివాదం కొనసాగుతూనే ఉన్నది. ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కెఎం జోసెఫ్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా, పంజాబ్-హర్యానా హైకోర్టు జడ్జి సూర్యకాంత్‌ను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేయగా కేంద్రం నిరాకరించింది. సీనియారిటీ సూత్రాన్ని పాటించలేదంటూ కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఏడాది జనవరి 10న ఈ రెండు నియామకాలను కొలీజియం ప్రతిపాదించగా కేంద్రం పక్కన పెట్టింది. కొలీజియంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రాతోపాటు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్‌గొగోయ్, మరో ఇద్దరు న్యాయమూర్తులు సభ్యులుగా ఉన్నారు. 1990వ దశకంలో సుప్రీంకోర్టు ఇచ్చిన రెండు తీర్పులకూ కొలీజియం సిఫారసులు విరుద్ధంగా ఉన్నాయని కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దేశంలోని 24 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం జస్టిస్ జోసెఫ్ 12వ స్థానంలో, హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం 45వ స్థానంలో ఉన్నందున సుప్రీంకోర్టు జడ్జిగా ఎలా సూచిస్తారని కొలీజియాన్ని కేంద్రం ప్రశ్నించింది. అయితే, వారి ఎంపికకు సంబంధించి కొలీజియం పరిగణనలోకి తీసుకున్న ఇతర అంశాలు కూడా ఉన్నాయి. అంతేగాక జస్టిస్ కెఎం జోసెఫ్ పట్ల కేంద్రం అభ్యంతరానికి పరిశీలకులు వేరే కారణాన్ని ఉటంకిస్తున్నారు. 2016లో ఉత్తరాఖండ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించగా జస్టిస్ కెఎం జోసెఫ్ నేతృత్వంలోని ఆ రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. అందుకే జస్టిస్ జోసెఫ్ పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకత అని పరిశీలకులు చెబుతున్నారు.

త్రిపుర మంత్రి ఖగేంద్ర కన్నుమూత



అగర్తలా : ప్రముఖ సిపిఎం నేత, త్రిపుర మంత్రి ఖగేంద్ర జమాతియా (61) శుక్రవారం కన్నుమూశారు. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో ఉదయం 8.10గంటలకు ఆయన మరణించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ ధ్రువీకరించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఖొవాయి జిల్లాలోని కృష్ణపూర్ ఎస్‌టి నియోజకవర్గం నుండి వామపక్ష సంఘటన అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. ఆరుసార్లు ఎంఎల్ఎగా గెలుపొందారు. తెలియామురాలోని త్రిషబరి ఆయన సొంత గ్రామం. కొంతకాలం నుండి ఆయన అస్వస్థులుగా వున్నారు. పోలింగ్ రోజున, ఆ తర్వాత రెండుసార్లు ఆయన్ని జి.బి.పంత్ ఆస్పత్రిలో చేర్చారు. ఆయన పరిస్థితి మరీ దిగజారడంతో గత నెల 19న ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. సిపిఎం త్రిపుర రాష్ట్ర కమిటీ సభ్యులు, మంత్రి అయిన కామ్రేడ్ ఖగేంద్ర మృతికి పార్టీ సంతాపాన్ని తెలియచేసింది. ఆయన మృతికి నివాళి అర్పిస్తూ, సంతాప సూచకంగా పార్టీ పతాకాన్ని అవనతం చేశారు.

ఇంతకుముందు ఎన్నికల ప్రచారం సందర్భంగా చారిలామ్ నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న రమేంద్ర నారాయణ్ దెబ్బార్మా గుండెపోటుతో మరణించారు. అక్కడ ఎన్నికను మార్చి 12వ తేదీకి వాయిదా వేశారు. కర్బూక్ నియోజకవర్గం నుండి త్రిపుర పీపుల్స్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హరీష్ రియాంగ్ గత శనివారం మరణించారు. త్రిపుర ఎన్నికల సందర్భంగా ముగ్గురు అభ్యర్థులు మరణించగా, మరో ఆరుగురు అభ్యర్థులు గాయపడడమో లేదా అనారోగ్యంతో వున్నారు.

ప్రసారభారతిపై ఎలాంటి వివక్ష లేదు

ప్రచార, సమాచార శాఖ

న్యూఢిల్లీ : ప్రసారభారతిపై ఎలాంటి వివక్ష లేదని కేంద్ర ప్రచార, సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే నిధులను ఉపయోగించుకోవడానికి ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక లక్ష్యాలు, కేటాయింపులకు గడువులపై అవగాహన ఒప్పందంపై (ఎంఓయు)పై ప్రసారభారతి సంతకం చేయాల్సి ఉంటుందని, అయితే ఎన్ని సార్లు అడిగినా ఆ ఎంఓయుపై ప్రసారభారతి సంతకం చేయలేదని మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రసారభారతికి, మంత్రిత్వ శాఖకు మధ్య విభేదాలు కొనసాగుతున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో మంత్రిత్వ శాఖ ఈ ప్రకటన వెలవరించింది. ప్రసారభారతితో విభేదాలు నేపథ్యంలో ఆ సంస్థ ఉద్యోగులకు జీతాలకు నిధులు విడుదల చేయడానికి ప్రసార, సమాచార శాఖ మంత్రి స్మృతి ఇరానీ నిరాకరించారని వార్తలు వచ్చాయి. తమ శాఖ ఆదేశాలు పాటించడానికి ప్రసారభారతి నిరాకరించడంతో మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. మంత్రిత్వ శాఖను అపకీర్తి పాలు చేయడానికే ఇలాంటి వార్తలు వచ్చాయని మంత్రిత్వ శాఖ ప్రకటనలో స్పష్టంచేసింది. అయితే ప్రసారభారతి ఉద్యోగులు కథనం వేరే విధంగా ఉంది. తమ సంస్థకు ఆర్థిక శాఖ 2,800 కోట్లు కేటాయించిందని, దినసరి కార్యక్రమాల కోసం నెలకు రూ. 200 కోట్లు విడుదల చేయాల్సి ఉందని, కానీ డిసెంబరును నుంచి ఈ నిధులను విడుదల చేయడం లేదని ప్రసారభారతికి చెందిన సీనియర్ ఉద్యోగి ఒకరు తెలిపారు. ఈ నిధులతోనే ఉద్యోగులు జీతాలు చెల్లించాల్సి వుందని వారు తెలిపారు.

మత్తు పదార్థాల నియంత్రణా కేంద్రంలో అగ్ని ప్రమాదం

25 మంది రోగులు మృతి

బాకు : అజర్‌బైజాన్‌లోని బాకు నగరంలో మత్తు పదార్థాల నియంత్రణకు చికిత్సను ఇచ్చే ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో 25 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో భారత కాలమానం ప్రకారం ఉదయం 7.40 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించిందని తెలిపారు. ఆ సమయంలో భవనంలో సుమారు 55 మంది ఉన్నట్లు తెలిపారు. మూడు అంతస్తుల ఆస్పత్రి భవనంలో విద్యుత్ సమస్యలు ఎప్పటినుండో ఉన్నాయని, అయితే ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోలేదని దీంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. ప్రమాదం సంగతి తెలిసిన వెంటనే అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్స్‌లు,సహాయక సిబ్బంది అక్కడికి చేరుకున్నారని తెలిపారు. పోలీసులు ఆస్పత్రి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మిచిగాన్ యూనివర్శిటీలో కాల్పులు

ఇద్దరు మృతి

మిచిగాన్: అమెరికాలోని సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీ శుక్రవారం కాల్పుల మోతతో దద్దరిల్లింది. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించారు. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చని భావిస్తున్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలోకి చొరబడిన సాయుధుడు కాల్పులు జరిపాడు. క్యాంప్‌బెల్ హాల్‌లోని నాలుగో అంతస్తులో దుండగుడు కాల్పులు జరిపినట్లు సమాచారం. స్థానిక వివాదాలతోనే ఈ కాల్పులు జరిగినట్లు యూనివర్శిటీ అధికారులు తెలిపారు. కాల్పుల శబ్దం వినపడటంతో అక్కడి వారంతా వెంటనే అప్రమత్తమయ్యారు. సాయుధుడు ఇంకా యూనివర్సిటీ ప్రాంగణంలోనే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో యూనివర్సిటీకి దగ్గరలో ఉన్న ఓ పాఠశాలను ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా మూసివేశారు.

9 నుండి మాక్రాన్ భారత్ పర్యటన



న్యూఢిల్లీ : ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ మార్చి 9వ తేదీ నుండి నాలుగు రోజుల భారత్‌లో పర్యటించనున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్రమోడీతో ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ (ఐఎఎస్) కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రధాని మోడీ 2017 జూన్‌లో ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా మాక్రాన్‌తో సమావేశమయ్యారని పేర్కొన్నారు. ఇరువురు అధ్యక్షులు ద్వైపాక్షిక అంశాలపై మార్చి 10న చర్చిస్తారని, ఐఎస్ఎ కాన్ఫరెన్స్‌లో మార్చి 11న పాల్గొంటారని వెల్లడించింది. భారత్ - ఫ్రాన్స్ బాగస్వామ్యం 1998లో ప్రారంభమైందని తెలిపారు. 2016-2017లో భారత్-ఫ్రాన్స్‌ల మధ్య వాణిజ్యం 10.95 బిలియన్ డాలర్లకు చేరిందని, భారత్‌లో తొమ్మిదవ అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుగా ఫ్రాన్స్ నమోదైందని, 2000 నుండి 2017 వరకు 6.09 బిలియన్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రక్షణ, సముద్ర, అంతరిక్ష భద్రత, ఇంధన సంబంధిత రంగాలలో సహకారాన్ని విస్తరించాలని, అలాగే ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, స్థిరమైన అభివృద్ధి, పట్టణీకరణ, విజ్ఞానం, సాంకేతిక రంగాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. భారత్‌లో 1,000 ఫ్రెంచి కంపెనీలు ఉన్నాయని, అలాగే ఫ్రాన్స్‌లో 120 భారతీయ కంపెనీలు బిలియన్ యూరోలు పెట్టుబడులు పెట్టాయని, 7,000మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని విదేశాంగ శాఖ నివేదికలో వెల్లడించింది.

కేరళలో ఐదు లక్షల ఉచిత ఇళ్ల నిర్మాణం

బెంగళూరు : కేరళలో ఇళ్ళులేని నిరుపేదలకు ఉచితంగా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కేరళ ప్రభుత్వం భావిస్తోంది. ఐదులక్షల మందికి పైగా ఉచిత గృహాలను నిర్మించే ప్రాజెక్టుపై చర్చించిన కేరళ మంత్రివర్గం 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో రు.4లక్షల వ్యయంతో ఇంటిని నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) కార్యక్రమం తరహాలోనే దీన్ని చేపట్టాలని భావిస్తోంది.

పిఎంఎవై కింద ఇంటికి రు.3లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇందులో రు.1.5లక్షలు కేంద్రం వాటా కాగా, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం, వినియోగదారుడు రు.50వేల చొప్పున భరించాల్సి వుంటుంది. ఇక్కడ కేరళ ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులో వినియోగదారుడు భరించాల్సిన మొత్తాన్ని తొలగించింది. రాష్ట్ర ప్రభుత్వం రు.2లక్షలు భరించగా, స్థానిక ప్రభుత్వం రు.2లక్షలు అందచేయాల్సి వుంటుంది. ఇక మిగిలినదంతా ఒక్కటే. పిఎంఎవై కింద అర్హులు కాని వారికి రాష్ట్ర ప్రభుత్వం రు.లక్ష ఇస్తుందని, స్థానిక ప్రభుత్వాలు మిగిలిన మొత్తాలను సమీకరించుకోవాల్సి వుంటుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి థామస్ ఇజాక్ ఫోన్‌లో తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి రు.2500కోట్లు కేటాయించారు. ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టు లబ్దిదారులుగా 5,13,000 మందిని గుర్తించినట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. 2018-19లో 1,76,00 ఉచిత గృహాలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 66,570 ఇళ్ళను ఈ మార్చికల్లా పూర్తి చేస్తారు.

ఆకలితో ఉన్న వ్యక్తిని హింసించడం మన సంస్కృతా !

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



మధు కుటుంబాన్ని పరామర్శించిన విజయన్

తిరువనంతపురం : "ఆకలితో ఉన్న వ్యక్తి ఆహారం కోసం వెతుకుతున్నప్పుడు అతనిని హింసించడం మన సంస్కృతా? దీన్ని ప్రశ్నించుకుంటే మన చుట్టూ ఉన్న చీకటి తొలగిపోతుందని" కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'కృతి ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్' ను గురువారం ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని రోజుల క్రితం మానసిక వికలాంగుడైన మధు అనే యువకుని ఆహార పదార్థాలు దొంగిలించా డన్న ఆరోపణతో కొందరు దాడి చేసి కొట్టి చంపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దీనిపై పినరయి విజయన్ పైవిధంగా వ్యాఖ్యానించారు. సాహిత్య ప్రవర్తక కో ఆపరేటివ్ సొసైటి (ఎస్‌పిసిఎస్) ఆధ్వర్యంలో ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన కృతి ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్‌ను తొలిసారిగా ప్రారంభించామని, కేరళ ఆచరించే సాంస్కృతిక సంస్కరణలను వ్యతిరేకించే వారి పట్ల జాగరూకతతో వ్యవహరించాలని విజయన్ అన్నారు. కేరళ ఇతర రాష్ట్రాల కన్నా అక్షరాస్యత, ఆరోగ్యం, సంస్కృతి వంటి అంశాలలో మెరుగ్గా ఉందని, అయితే కొన్ని మూఢ నమ్మకాలు, ఆచారాలతో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోందని పేర్కొన్నారు. సమాజాన్ని అంధకారం లోకి నెట్టే ఇటువంటి చర్యలను నిరసించాలని ఆయన పిలుపునిచ్చారు. స్వేచ్ఛా, స్వతంత్ర, సృజనాత్మక వ్యక్తీకరణను అడ్డుకునే వారి నుండి ఎదురయ్యే అడ్డంకులను అధిగమించడానికి ఇటువంటి పుస్తక ప్రదర్శనలు, సాంస్కృతిక ఉత్సవాలు దోహదపడతాయని అన్నారు. ..

విన్‌సమ్ కేసుపై కాంగ్రెస్ గురి

- భారీ రుణ ఎగవేతదారుడు జితిన్ మెహతా మోసంపై పార్లమెంట్‌లో ప్రశ్నించనున్న కాంగ్రెస్



న్యూఢిల్లీ : బిజెపి ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పెట్టడానికి కాంగ్రెస్ మరో అంశాన్ని లేవనెత్తనుంది. ఇటీవల వరుసగా బ్యాంకు కుంభకోణాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో విన్‌సమ్ గ్రూపు కుంభకోణంపై పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కాంగ్రెస్ భావిస్తుంది. బ్యాంకులకు రూ. 6,712 కోట్ల రుణాన్ని ఎగవేసి దేశం విడిచిపారిపోయిన జితిన్ మెహతా కేసుతో సోమవారం నుంచి జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్నికాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జ్ రణదీప్ సుర్జేవాలా వెల్లడించారు. విన్‌సమ్ గ్రూప్ చైర్మన్ జితిన్ మెహతా రూ. 6,712 కోట్ల బ్యాంకు రుణాన్ని ఎగవేసి దేశం విడిచి పారిపోయిన ఘటనపై 2014లో ముంబయి పోలీసులు, సిబిఐ కేసులు నమోదు చేసాయని రణదీప్ సుర్జేవాలా తెలిపారు. భారతీయ బ్యాంకులు ఇచ్చిన ఎల్ఓసిల ఆధారంగా బంగారాన్ని మెహతా దిగుమతి చేసుకున్నాడని, దుబాయ్‌లోని 13 సంస్థలకు అభరణాలు ఎగుమతి చేశాడని, అయితే రుణాలను మాత్రం ఎగవేశాడని సుర్జేవాలా ఆరోపించారు. ప్రధాని మోడీకి సన్నిహితుడైన ఒక పారిశ్రామిక వేత్త కుటుంబంతో జితిన్ మెహతకు సంబంధాలు ఉన్నాయని తెలిపారు. పారిశ్రామిక వేత్త గౌతమ్ అదాని సోదరుని కుమార్తెను జితిన్ మెహత కుమారుడు వివాహం చేసుకున్నట్లు సుర్జేవాలా తెలిపారు..

2016 జున్2న భారత పౌరస్వతాన్ని వదులుకుని జితిన్ మెహత, అతని భార్య సెయింట్ కిట్స్ అండ్ నెవిస్‌లో స్థిరపడ్డారు. సెయింట్ కిట్స్‌లో ఇంటర్ పోల్ కార్యాలయం వుందని, అయితే ప్రభుత్వం అతనిపై 'రెడ్ కార్నర్' నోటీసు జారీ చేయడంలో విఫలమైందని సుర్జేవాలా వ్యాఖ్యానించారు. వారిపై ఈడి, సిబిఐ ఇతర సంస్థల కేసులు ఉన్నా, ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'తో వ్యాపారవేత్తలకు భారతీయ జనతా పార్టీ బాగా సన్నిహితమయిందని ఆయన విమర్శించారు. జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వదని సుర్జేవాలా స్పష్టం చేశారు.

నీరవ్ మోడీ అమెరికాలో లేడట!



వాషింగ్టన్ : పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో నిందితుడైన నీరవ్‌మోడీ అమెరికాలోనే ఉన్నాడనే అంశాన్ని నిర్థారించడం సాధ్యం కాదని అమెరికా అధికారులు గురువారం వెల్లడించారు. ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలను గమనిస్తున్నామని, నీవర్‌మోడీ తమ దేశంలో ఉన్నాడని ధృవీకరిం చలేమని భద్రతా విభాగ అధికారి తెలిపారు. మోడీని రక్షించేందుకు అమెరికా సహకరిస్తోం దనే అంశంపై న్యాయశాఖను ప్రశ్నించాలని ఆయన సూచించగా, స్పందించడానికి న్యాయశాఖ నిరాకరించింది. నీరవ్‌మోడీ, ఆయన మేనమామ మోహుల్ చోక్సీలపై పంజాబ్ నేషనల్ బ్యాంకు నుండి రూ. 12000 కోట్లు మోసం చేసిన సంఘటనపై విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే.

బీహార్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

పాట్నా : బీహార్‌లోని దర్భంగా జిల్లాలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సిర్హీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగిందని స్టేషన్ అధికారి రాజన్ కుమార్ తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారని తెలిపారు. మృతులు ముజఫర్ జిల్లా దుంరామ గ్రామానికి చెందిన వారని, పోస్టుమార్టం నిమితం మృతదేహాలను దుర్భంగా మెడికల్ కాలేజీకి పంపామని తెలిపారు.

ట్రంప్ నిర్ణయ ప్రభావం ఉండదు : అరుణా శర్మ

న్యూఢిల్లీ : స్టీల్ దిగుమతులపై భారీగా పన్ను విధించాలనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం భారత్‌పై ఎటువంటి తక్షణ ప్రభావం ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నట్లు శుక్రవారం ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరుణా శర్మ తెలిపారు. అమెరికా ఉత్పత్తి దారులను కాపాడేందుకు దిగుమతి ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీ సుంకాలు విధిస్తున్నట్లు గురువారం ట్రంప్ ప్రకటించారు. ప్రధాన వాణిజ్య భాగస్వాములైన చైనా, ఐరోపా, పొరుగున ఉన్న కెనడా వంటి దేశాలపై ప్రభావం చూపనుంది. తాము కేవలం రెండు శాతం మాత్రమే స్టీల్‌ను అమెరికాకు దిగుమతి చేస్తున్నామని, దాని వల్ల భారత్‌పై ప్రభావం చూపించకపోవచ్చునని అరుణా శర్మ తెలిపారు. కానీ సెక్షన్ 232 ప్రామాణికత సుంకంపై ఆంక్షలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

గౌరీ లంకేష్ హత్యకేసు నిందితుడిని అప్పగించాలని కోరిన 'సిట్'



బెంగళూరు : జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గౌరీ లంకేష్ హత్య కేసు నిందితుడిని విచారించేందుకు తమకు అప్పగించాలని ప్రత్యేక విచారణ బృందం(సిట్) బెంగుళూరు పోలీసులను కోరింది. సెప్టెంబరు 5, 2017న గౌరీ లంకేష్ (55)ను బెంగళూరుకు సమీపంలో ఆమె నివాసంలో హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. కాగా, ఈ హత్యకేసులో ఫిబ్రవరి 18న కె.టి. నవీన్‌కుమార్(37) అరెస్టు చేశారు. విచారణలో మద్దూర్ ప్రాంతంలోని కొందరు మిత్రులతో అతని ఫోన్ సంభాషణలు వెలుగులోకి వచ్చాయని, వారికి గౌరీ లంకేష్ హత్యతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో అతనిని విచారించేందుకు తమకు అప్పగించాలని సిట్ బృందం కోరుతోంది. నిందితుడు కుమార్‌కు హిందుత్వ యువ సేనా, హిందూ జన జాగృతి సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. అతని నుండి మారణాయుధాన్ని స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. గౌరీ లంకేష్ హత్యకు వాడిన తుపాకి కూడా 7.65 రేంజ్ సామర్థ్యమున్న దేశీయ తుపాకీ కావడంతో సిసిటివి ఫుటేజీలను పరిశీలించినట్లు తెలిపారు. గౌరీలంకేష్ హత్యకు వాడిన బుల్లెట్లు, తుపాకి కూడా కన్నడ స్కాలర్, రీసెర్చర్ అయిన ఎంఎం. కల్బుర్గి హత్యకు వాడినతరహావేనని తేల్చారు. గోవింద్‌పన్సారే, ఆయన భార్య ఉమా పన్సారేల హత్యకు కూడా ఇవే ఆయుధాలు ఉపయోగించినట్లు నిర్ధారణైందని పోలీసులు తెలిపారు. నరేంద్ర దబోల్కర్‌ను ఆగష్టు 20, 2013లో పూణెలో హత్య చేసింది కూడా ఇదే తుపాకీతో అని తేల్చారు.

సిబ్బంది మోసాలతో ప్రభుత్వ బ్యాంకులకు రు.2,450 కోట్లు నష్టం

రిజర్వ్ బ్యాంక్ వెల్లడి

బెంగళూరు : గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న మోసాలలో సిబ్బంది ప్రమేయం కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు రు.2,450 కోట్ల మేర నష్టపోయాయని రిజర్వ్ బ్యాంక్ అంచనా వేసింది. సిబ్బంది, అధికారుల ప్రమేయంతో జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం వెలుగు చూసిన తరువాత రిజర్వ్ బ్యాంకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో జరిగిన మోసాలపై సమాచారం సేకరించింది. ఈ మోసాలన్నింటిలోని ఆయా బ్యాంకుల సిబ్బంది ప్రమేయం వుందని రిజర్వ్ బ్యాంకు ఒక ప్రకటనలో వివరించింది. 2013 ఏప్రిల్ నుండి 2016 జూన్ మధ్య కాలంలో జరిగిన దాదాపు 1,232 మోసాలలో ప్రభుత్వ బ్యాంకులు మొత్తం రు.2,450 కోట్లు నష్టపోగా రు.లక్ష అంతకు మించిన మోసాలకు సంబంధించిన కేసుల్లో సిబ్బంది ప్రమేయం వున్నట్లు తెలుస్తోందని రిజర్వ్ బ్యాంక్ వివరించింది. ఈ నేరాలు మహారాష్ట్రతో సహా దక్షిణాది రాష్ట్రాల్లోనే అధికశాతం నమోదయ్యాయని వివరించింది. ఇందులో మొత్తం కేసుల్లో 49 శాతం మేర (609) కేసులు మహారాష్ట్రలో నమోదు కాగా, ఇందులో నష్టపోయిన సొమ్ముమాత్రం మొత్తం నష్టంలో 19 శాతం (రు.462 కోట్లు) మాత్రమేనని వివరించింది. రాజస్థాన్‌లో కేవలం మూడు శాతం (38) కేసులు మాత్రమే నమోదయినప్పటికీ అత్యధికంగా 45 శాతం (రు.1,096 కోట్లు) మేర సొమ్మును ఇక్కడి బ్యాంకులు నష్టపోయాయయని వెల్లడించింది. ఇక తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలలో సిబ్బంది ప్రమేయం వున్న మోసపు కేసులు అధికంగా నమోదు కాగా, ఉత్తరాది రాష్ట్రాలయిన రాజస్థాన్, చండీగఢ్, ఢిల్లీ, బెంగాల్ వంటి రాష్ట్రాలలో నమోదయిన మోసపు కేసుల్లో అత్యధికంగా (70) శాతం మేర సొమ్మును బ్యాంకులు నష్టపోయాయని వివరించింది. రు.లక్ష అంతకు మించిన సొమ్ముతో కూడిన మోసం కేసుల్లో సిబ్బందితో పాటు బయటివారి ప్రమేయం వున్నా వాటిని తప్పనిసరిగా తమకు తెలియచేయాలని రిజర్వ్ బ్యాంక్ బ్యాంకులను ఆదేశించింది.

యుపిలో మరో బ్యాంక్ కుంభకోణం

గ్రామీణ బ్యాంక్‌లో రు.14కోట్లు స్వాహా

హసన్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని హసన్‌పూర్‌లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లో రు.14కోట్ల కుంభకోణాన్ని సిబిఐ వెలికితీసింది. ఈ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, మరో ఎనిమిది మంది ఉద్యోగులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. తమ బ్రాంచ్‌లో అనుమానాస్పదమైన లావాదేవీలు జరుగుతున్నాయని బ్యాంక్ నుండి ఫిర్యాదు అందగానే సిబిఐ రంగంలోకి దిగింది. కోట్లాది రూపాయిల కుంభకోణాన్ని కనుగొన్న వెంటనే బ్యాంక్ తన యూజర్ ఐడిని, పాస్‌వర్డ్‌ను సస్పెండ్ చేసింది. ప్రధాన నిందితుడైన బ్రాంచ్ మేనేజర్ విపిన్ కుమార్, ఇతరులు ప్రధమ్ కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాల్లోకి డబ్బులు వేసి, ఆ తర్వాత ఆ మొత్తాన్ని సెక్యూర్డ్ ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాల్లోకి, ఇతర ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. దేశంలో పలు బ్యాంకింగ్ కుంభకోణాలు బయటపడుతున్న తరుణంలోనే ఇది కూడా చోటు చేసుకుంది.

సంక్షిప్తం

ఉగ్రవాదాన్ని వీడి కుటుంబాలతో కలిసిన యువకులు

శ్రీనగర్ : జమ్ము- కాశ్మీర్‌లో ఉగ్రవాద శక్తుల పట్ల ఆకర్షితులైన నలుగురు యువకులు తిరిగి తమ కుటుంబాలతో కలిసినట్లు శుక్రవారం డిజిపి ఎస్‌పి. వేద్ వెల్లడించారు. ఆ నలుగురు యువకులు వారిలో ఒకరి తల్లి కోరిక మేరకు తిరిగి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని నిర్ధారిస్తూ బిజెపి ఎంఎల్‌సి విక్రమ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా జమ్ము-కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఒక లేఖలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కుమారుడికి బెయిల్ నిరాకరణ

బెంగళూరు : దాడి కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్ ఎ హరిష్ కుమారుడు మహమ్మద్ హరిష్ నలపాడ్‌కు బెయిల్ ఇవ్వడానికి బెంగళూరు కోర్టు శుక్రవారం నిరాకరించింది. ఫిబ్రవరి 17న నగరానికి చెందిన ఒక వ్యాపారస్తుడు కుమారుడు విద్వత్ లోకనాథన్‌పై నలపాడ్, అతని స్నేహితులు దాడి చేసినట్లు కేసు నమోదయింది. రెస్టారెంట్‌లో సక్రమంగా కూర్చోలేదని ఆరోపిస్తూ లోకనాథన్‌పై దాడి చేయడంతో అతనికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ కేసులో తమకు బెయిల్ ఇవ్వాలని నలపాడ్, అతని స్నేహితులు దాఖలు చేసిన పిటిషన్‌ను 63వ సిటీ సివిల్, సెషన్స్ కోర్టు జడ్జి తిరస్కరించారు.

కార్తీ కేసులో కోర్టు తీర్పును ప్రశంసించిన ఎంపి స్వామి

న్యూఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో సీనియర్ కాంగ్రెస్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని 14 రోజుల పాటు సిబిఐ కస్టడీకి తరలించడంపై ఢిల్లీ కోర్టు తీర్పును బిజెపి ఎంపి సుబ్రమణ్యన్ స్వామి సోమవారం ప్రసంశించారు. కోర్టు సరైన నిర్ణయం తీసుకుందని మీడియాతో ఆయన వ్యాఖ్యానించారు. కార్తీ తరుపు న్యాయవాది అభిషేక్ మను చేసిన వాదనలు నిజమైనవి కావని, అందుకే కోర్టు కార్తీని సిబిఐ కస్టడీకి పంపిందని తెలిపారు.

ఒప్పందాలను ఉల్లంఘిస్తున్న పుతిన్ : అమెరికా

న్యూయార్క్: కొత్త తరహా అణ్వాయుధాలనుఅభివృద్ధి చేస్తామంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన వ్యాఖ్యలను అమెరికా తప్పుపట్టింది. ప్రచ్ఛన్నకాలం నాటి ఒప్పందాలను పుతిన్ ఈ వ్యాఖ్యల ద్వారా తుంగలో తొక్కుతున్నారని అమెరికా రక్షణశాఖ పెంటగాన్ విమర్శించింది. అమెరికా సైన్యం తమ దేశాన్ని రక్షించుకునేందుకు ఎల్లపుడూ సర్వసన్నద్ధంగా వుంటుందని స్పష్టం చేసింది. ఇదిలా వుండగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ సారా శాండర్స్ మీడియాతో మాట్లాడుతూ రష్యా అణ్వస్త్రాలను అభివృద్ధి చేస్తున్న విషయం తమకు దీర్ఘకాలంగా తెలుసన్నారు.

ముంచెత్తిన మంచు

యూరప్ దేశాలను మంచు ముంచెత్తింది. దీంతో సాధారణ జన జీవనం స్తంభించడమే కాక ప్రజలు కూడా చనిపోతున్నారు. ఈశాన్య లండన్‌లోని ఒక ప్రాంతంలో రోడ్లను, అక్కడ ఉన్న కార్లను మంచు ముంచెత్తింది.



మంచు దాటికి 55 మంది మృతి

వందలాది విమానాలు, రైళ్ళు రద్దు, మూతపడ్డ స్కూళ్ళు

పారిస్ : యూరప్ అంతటా భారీగా మంచు కురుస్తున్నది. దీంతో యూరప్ ఖండంలోని అన్ని దేశాల్లో విమానాలు రద్దు కావడమో లేదా ఆలస్యం కావడమో జరుగుతోంది. అటు ఉత్తరం నుండి ఇటు దక్షిణం వరకు అన్ని దేశాలు మంచు గుప్పిట ముడుచుకున్నాయి. భయంకరంగా కురుస్తున్న హిమపాతానికి యూరప్ దేశాల్లో 55మంది మరణించారు. వీరిలో 21మంది పోలెండ్‌లోనే మృతి చెందారు. స్లోవేకియాలో ఏడుగురు, చెక్ రిపబ్లిక్‌లో ఆరుగురు, లిథుయేనియాలో ఐదు, ఫ్రాన్స్‌లో నలుగురు, స్పెయిన్‌లో ముగ్గురు మరణించారు. ఈ ఏడాది ఈ సమయంలో యూరప్‌లో ఎక్కువ భాగంలో మంచు తుపానులు అసాధారణమే. తుపానుల కారణంగా రహదారులన్నీ మంచుతో కప్పబడిపోతున్నాయి. వేలాదిమంది డ్రైవర్లు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. స్కూళ్ళు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఒకటి రెండు రోజులు కొనసాగుతుందని వాతావరణ సంస్థలు భావిస్తున్నాయి. మృతుల్లో ఎక్కువమంది వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారు వున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నిరుపేదలు, నిరాశ్రయులు, వలసవచ్చిన వారు ఎక్కువగా ఈ మంచు బారిన పడుతున్నారని ఆ ప్రకటన తెలిపింది. విపరీతంగా మంచు కురుస్తుండడంతో గురువారం జెనీవా విమానాశ్రయం కొద్ది గంటల పాటు మూతపడింది. స్విట్జర్లాండ్‌లో ఉష్ణోగ్రత మైనస్ 40సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తర ఇటలీలో భారీగా కురిసిన మంచుతో 50శాతానికి పైగా రైళ్ళు రద్దయ్యాయి.ఎక్కడ చూసినా రహదారులు ట్రక్కులు, కార్లతో నిండిపోయి కనిపిస్తున్నాయి. పారిస్ మహా నగరం దట్టమైన మంచు దుప్పటి కప్పుకుంది. దాదాపు 3వేల మంది నిరాశ్రయులకు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం ఆశ్రయం కల్పించింది.


ప్రాంతీయ సమగ్రతపై ఆసియాన్ మంత్రుల సమీక్ష

సింగపూర్ : ప్రాంతీయ సమగ్రతను పెంచేందుకు ఉద్దేశించిన చర్యలపై ఆసియాన్ ఆర్థిక మంత్రులు సమీక్ష జరిపారు. 24వ ఆసియాన్ ఆర్థిక మంత్రుల సమావేశంలో సింగపూర్ ఆర్థిక మంత్రి లిమ్ హింగ్ కియాంగ్ మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా కోలుకున్నట్లు కనిపిస్తోందని అన్నారు. ఆసియాన్ సభ్య దేశాల మధ్య ఎగుమతులు, పరస్పరం పెట్టుబడులు, సహకారం వుండాలని తాను భావిస్తున్నట్లు చెప్పారు. సరళీకరణ విధానాల కారణంగానే సభ్య దేశాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఆసియాన్ గ్రూపు బలోపేతం కావడానికి కూడా కారణమవుతున్నాయని కియాంగ్ పేర్కొన్నారు. దాదాపు అర్థ శతాబ్దం కింద ఏర్పడిన ఆసియాన్ గ్రూపు స్థూల దేశీయోత్పత్తి రెండు ట్రిలియన్ల డాలర్లుగా వుంది. ఈ ప్రాంతంలో 62కోట్ల మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. ప్రపంచంలోనే ఏడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వుంది. వాణిజ్యం, పెట్టుబడులు, సేవల రంగాల్లో ఉమ్మడి మార్కెట్‌ను సంఘటిత పరుస్తున్న ఆసియాన్, వాణిజ్యంలో సరళీకరణ విధానాలను అవలంబిస్తోంది. ఆసియా ప్రాంతంలో, వెలుపల అభివృద్ధి చెందిన దేశాలతో ఆసియాన్ దేశాలు సంబంధ బాంధవ్యాలు నెరుపుతున్నాయి. ఆసియాన్, యురోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు కొనసాగుతున్నాయి.

గూగుల్‌లో తీవ్ర వివక్ష

ఆసియన్ల పట్ల కొనసాగుతున్న వ్యతిరేకత

ఉద్వాసనకు గురైన మాజీ అధికారి ఫిర్యాదు



మౌంటెయిన్ వ్యూ (కాలిఫోర్నియా): ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌లో ఉద్యోగ నియామకాల విషయంలో అమెరికన్, ఆసియన్ వాసుల మధ్య వివక్ష కొనసాగుతోందని ఆ సంస్థ నుండి ఉద్వాసనకు గురైన మాజీ అధికారి అర్నె విల్‌బర్గ్ కాలిఫోర్నియా కోర్టుకు ఫిర్యాదు చేశారు. కొన్ని రకాల ఉద్యోగాలకు అమెరికన్, ఆసియన్ పురుష అభ్యర్థులను తిరస్కరించటాన్ని వ్యతిరేకించినందుకు సంస్థ యాజమాన్యం ఆయన్ను ఉద్యోగం నుండి తొలగించింది. మహిళలు, నల్లజాతి లేదా హిస్పానిక్ కాని దరఖాస్తు దారుల ఇంటర్వ్యూలను రద్దు చేయాలని యాజమాన్యం పలుమార్లు తనకు చెప్పిందని ఆయన ఒక పత్రికకు రాసిన లేఖలో వెల్లడించారు. యాజమాన్యం చర్యను సవాలు చేస్తూ ఆయన కాలిఫోర్నియా కోర్టులోరిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక వెల్లడించింది. కాగా తాము ఉద్యోగ నియామకాలలో వివక్ష చూపుతున్నట్లు వచ్చిన ఆరోపణలను గూగుల్ యాజమాన్యం తిరస్కరించింది. గూగుల్, యూట్యూబ్ సంస్థలో దాదాపు తొమ్మిదేళ్ల రిక్రూట్‌మెంట్ అధికారిగా పనిచేసిన విల్బర్గ్ ఉద్యోగ నియామకాలలో అనుసరిస్తున్న విధానాలపై మానవ వనరుల విభాగానికి ఫిర్యాదు చేయటంతో యాజమాన్యం ఆయన్ను ఉద్యోగం నుండి తొలగించింది. గూగుల్ యాజమాన్యం హిస్పానిక్, ఆఫ్రికన్-అమెరికన్ లేదా మహిళలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కాకసియన్, ఆసియన్ పురుషుల పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోందని విల్బర్గ్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను తిరస్కరించిన గూగుల్ ప్రతినిధి జినా సిజిలియానో ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తమ సంస్థలో ఉద్యోగ నియామకాలన్నీ అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే జరుగుతాయి తప్ప వారి గుర్తింపు ఆధారంగా కాదని స్పష్టం చేశారు.

అమెరికా అసత్య ప్రచారం : ఉ.కొరియా

ప్యాంగ్యాంగ్: తాము రసాయనిక ఆయుధాలను తయారు చేస్తున్నామంటూ అమెరికా అసత్య ప్రచారానికి పాల్పడుతోందని ఉ.కొరియా విమర్శించింది. అమెరికా ఉ.కొరియాపై అసత్య ప్రచారానికి పాల్పడుతోందని ఉ.కొరియా విదేశాంగశాఖలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ అమెరికన్ స్టడీస్‌లో ప్రెస్ డైరెక్టర్ ఒక ప్రకటనలో విమర్శించారు. సిరియా తూర్పు ప్రాంతంలోని ఒక పట్టణంలో ప్రజలు రసాయనిక దాడికి గురైన నేపథ్యంలో ఉ.కొరియా ఈ ఆయుధాలను తయారుచేస్తోందంటూ అమెరికా అసత్య ప్రచారం ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. అమెరికా తన అధికార యంత్రాంగం సాయంతో ఈ ఆరోపణలను ఐరాస ఆంక్షల కమిటీ నివేదికగా బయటపెడుతోందని ఆయన విమర్శించారు. ఐరాస తన నివేదికను విడుదల చేసిన వెంటనే ఇటు ఉ.కొరియా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తోందంటూ అమెరికా విదేశాంగశాఖ గగ్గోలు పెడుతోందని, అమెరికా కుట్రను దీనితో సులభంగా అర్థం చేసుకోవచ్చని ఈ ప్రకటనలో వివరించారు.

అమెరికా తన నిర్ణయాలను ఐరాస ద్వారా ప్రపంచ దేశాలపై రుద్దుతూ సార్వభౌమత్వ దేశాలపై ఆక్రమణలకు పాల్పడుతున్న విషయం తెలిసిందేనని ఈ ప్రకటనలో వివరించారు. ఇప్పుడు సిరియా-ఉ.కొరియా మధ్య సహకారం అంటూ రసాయనిక ఆయుధాల వినియోగంపై కొత్త సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తోందన్నారు. ఉ.కొరియా రసాయనిక ఆయుధాలను తయారు చేసి విక్రయిస్తోందంటూ అనుచితమైన ఆంక్షలతో సముద్ర మార్గాలను దిగ్బంధించిన అమెరికా ఇప్పుడు సిరియాలో తన సైనిక జోక్యాన్ని సమర్థించుకునేందుకు తమపై అసత్య ప్రచారానికి పాల్పడుతోందని విమర్శించారు.

ట్రంప్ తుపాకీలను వద్దన లేదు

ఎన్ఆర్ఎ చీఫ్ లాబీయిస్ట్ వెల్లడి

వాషింగ్టన్ : అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తుపాకులను నియంత్రించాలనుకోవడం లేదని నేషనల్ రైఫిల్ అసోసియేషన్(ఎన్ఆర్ఎ) చీఫ్ లాబీయిస్ట్ చిరిస్ కాక్స్ తెలిపారు. తుపాకులు కొనుగోలు చేసేవారికి కొన్ని నిబంధనలు విధించాలని, తుపాకీ సంస్కృతిని నిషేధించడానికి తాను అనుకూలమని రిపబ్లికన్ల సమావేశంలో ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడింది. ట్రంప్, ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్‌లను తాను కలుసుకున్నానని, వారు 'తుపాకీని నియంత్రించాలనుకోవడం లేదు.' అని చిరిస్ గురువారం రాత్రి ట్వీట్ చేశారు. అనంతరం ట్రంప్ కూడా ఆ సమావేశాన్ని ధృవీకరిస్తూ ట్వీట్ చేశారు. ఓవల్ కార్యాలయంలో ఎన్ఆర్ఎతో సమావేశం చాలా బాగా జరిగిందని మాత్రమే తెలిపారు. తన వైఖరి మారిన విషయాన్ని ఆయన ప్రస్తావించలేదు. ఎన్ఆర్ఎ గురించి భయపడొద్దని బుధవారం ట్రంప్ వ్యాఖ్యానించారు. తుపాకీ అమ్మకాలకు గల నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ చట్టాన్ని తీసుకురావాలని కూడా భావిస్తున్నట్లు చెప్పారు. అలా మాట్లాడిన ట్రంప్ వైఖరి ఇప్పుడు మారడం పట్ల ఆయన మిత్రులు, ప్రత్యర్థులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారు.

అసంబద్ధ పెట్టుబడులపై మరింత నియంత్రణ

- **చైనాలో అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనలు**



బీజింగ్ : విదేశాల్లో పెట్టుబడులపై చైనా విధించిన కొత్త నిబంధనలు గురువారం నుండి అమల్లోకి వచ్చాయి. ఈ నిబంధనలతో రియల్ ఎస్టేట్, వినోద రంగాల్లో అసంబద్ధమైన పెట్టుబడులపై నియంత్రణ మరింత కఠినతరమయ్యాయి. అయితే, చట్టబద్ధంగా, సక్రమంగా వుండే పెట్టుబడులను ప్రోత్సహించడం కొనసాగుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. చైనాకు వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఒడిఐ) వృద్ధి రేటు కొత్త నిబంధనల వల్ల తగ్గుతుందని నిపుణులు తెలిపారు. పైగా ఈ నిబంధనలతో పెట్టుబడుల ప్రాజెక్టులకు మరింత ఊతం లభిస్తుందని, దేశీయ పరిశ్రమలపై సానుకూలమైన ప్రభావం వుంటుందని చెప్పారు. ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ బివైడి దీనిపై స్పందిస్తూ, తమ కంపెనీ వ్యాపారంపై ఈ కొత్త నిబంధనలు ఎలాంటి ప్రభావాన్ని చూపవని పేర్కొంది. తమ వ్యూహాన్ని సవరించుకోవాల్సిన పని కూడా లేదని తెలిపింది. అమెరికాతో సహా విదేశాల్లోని ప్లాంట్లలో బివైడి పెట్టుబడులు పెట్టింది. రియల్ ఎస్టేట్, హోటల్స్, సినిమా, వినోద రంగాల్లో విదేశాల నుండి వచ్చే పెట్టుబడులను పరిమితం చేయాలని గత ఏడాది ఆగస్టులో స్టేట్ కౌన్సిల్ నిర్ణయించింది. గ్యాంబ్లింగ్ (జూదం) వంటి రంగాల్లో పెట్టుబడులను నిషేధించాలని భావించింది. అయితే తాజా నిబంధనలు, నిర్ణయాల వల్ల చైనా ఒడిఐ వృద్ధి రేటు తగ్గుతుందని, చైనాలో పెట్టుబడులు పెట్టాలని భావించే సంస్థలు తమ ఆలోచనలను విరమించుకునే అవకాశాలు వున్నాయని షాంఘై యూనివర్శిటీ ప్రొఫెసర్ జీ జునియాంగ్ వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

3.10 కోట్లు

యువత భవిష్యత్ మసకబారుతోంది. గత నెల చివరి నాటికి అధికారికంగా నమోదయిన 3.1 కోట్ల మంది నిరుద్యోగులకు వచ్చే మే నాటికి తాజాగా పట్టభద్రులైన యువత జతకానున్నారు. ఆ మేరకు కొత్త ఉద్యోగాలు లభించే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల కారణంగా లభించే కొద్దిపాటి ఉపాధి అవకాశాలు కూడా తగ్గుతుండటంతో రానున్న రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రం కానుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నోట్ల రద్దు అనంతరం పరిణామాల్లో దేశ వ్యాప్తంగా పలువురు ఉపాధి, ఉద్యోగవకాశాలను కోల్పోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి ప్రత్యామ్నాయ అవకాశాలు లభించకపోవడంతో నిరుద్యోగం క్రమేణా పెరుగుతోంది.

మార్చి మొదటి రోజే 39 డిగ్రీలు

ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల తీవ్రత గురించి ప్రజల మధ్య చర్చ జరుగుతోంది. మధ్యాహ్నం వేళల్లో తీవ్రత ఎక్కువగా ఉంటోంది. రాష్ట్రంలో మరో నాలుగు రోజులు వాతావరణం పొడిగానే ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. దీంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్చి మొదటి వారంలోనే ఇలా ఉంటే ..రాను రాను మరీ ఎక్కువగా ఎండలుంటాయోమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆగ్నేయ అరేబియాలో కేరళ తీరం నుంచి మహారాష్ట్ర తీరానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి, మాల్దీవుల పరిసరాల్లో ఆవర్తనం కొనసాగుతున్నా రాష్ట్రంపై ఎలాంటి ప్రభావమూ చూపదని వాతావరణ శాఖ తెలిపింది.

సినిమా థియేటర్ల బంద్

అందించేందుకు సినిమా బంద్ బోర్డులు ఏర్పాటు చేశాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న 93 సినిమా థియేటర్లు మూతపడ్డాయి. విజయవాడ నగరంలో అన్ని థియేటర్లు మూతపడ్డాయి. హోలీ పండగకు సెలవు రావడంతో ఎక్కువ మంది థియేటర్ల వద్దకు వచ్చి బోర్డులు చూసి వెళ్లిపోయారు. గుంటూరు జిల్లా కేంద్రంతోపాటు పలు పట్టణాల్లో సినిమా థియేటర్లలో చిత్ర ప్రదర్శనలను నిలిపేశారు. వారాంతంలో కొత్త సినిమాలతో కళకళలాడే థియేటర్లు బోసిపోయి కనిపించాయి. కడప జిల్లావ్యాప్తంగా సినిమా థియేటర్లను బంద్ చేశారు. జిల్లాలోని 56 థియేటర్ల యజమానులు ఎక్కడికక్కడ నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లాలో 110 సినిమా థియేటర్లు మూతపడ్డాయని నిర్మాతల మండలి సభ్యులు ఎన్‌వి.ప్రసాద్ తెలిపారు. డిజిటల్ ప్రొవైడర్ల ధరలు తగ్గించే వరకూ బంద్ కొనసాగుతుందని తెలిపారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో సినిమా థియేటర్లు బంద్ పాటించాయి.

ఈశాన్య రాష్ట్రాలలో నేడే ఓట్ల లెక్కింపు

వుండగా ఒక్కో రాష్ట్రంలో భిన్న కారణాల రీత్యా 59 అసెంబ్లీ స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపుకు అవసరమైన కేంద్రాలు కూడా సిద్ధమయ్యాయని, పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు ప్రక్రియను జిల్లా రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ల పర్యవేక్షణలో నిర్వహిస్తామని రాష్ట్ర అదనపు సిఇఒ నమావ్ అయ్యర్ తెలిపారు.

పంపకాలపై పీటముడి

20 వరకు ఈ నీటిని వినియోగించుకోవాలని, ఆ తరువాత తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు చేద్దామని చెప్పారు. అయితే ఏపీ అధికారులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. దీంతో సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. అంతకుముందు జరిగిన చర్చల్లో మార్చి 20 వరకు సాగర్ మట్టం 520 అడుగులు ఉండేలా రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. మార్చి చివరికి 515 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగేలా ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. సాగర్ కనీస నీటి మట్టం తగ్గిపోతే గత ఏడాది హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఇబ్బందులు ఏర్పడిన విషయాన్ని తెలంగాణ గుర్తు చేసింది. అయితే ఈ సారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా శ్రీశైలం నీటిని విడుదల చేయాలని కోరింది. ఇందుకుగాను శ్రీ శైలం నుంచి కృష్ణా జలాల్ని సాగర్‌కు తరలించాలని తెలంగాణ అధికారులు చేసిన ప్రతిపాదనకు ఏపీ అధికారులు అంగీకరించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు సంబంధించి మార్చి 21 తరువాత మళ్లీ ఉత్తర్వులు జారీచేయాలని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో తెలంగాణ,ఏ.పి.ఇరిగేషన్ ఇఎన్ సిలు మురళీధరరావు, వెంకటేశ్వరరావు, నాగార్జున సాగర్ సిఇ ఎస్.సునీల్, కర్నూలు సిఇ నారాయణ రెడ్డి,అంతర్రాష్ట్ర జలవనరుల సిఇ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాలపై వైసిపి గుంభనం..!

(మొదటి పేజీ తరువాయి)

కావాలని నిర్ణయం తీసుకున్నా ఢిల్లీ కార్యక్రమం తరువాతే వైసిపి ఎంఎల్‌ఏలు శాసనసభకు వచ్చే అవకాశం ఉంది.

ఫిరాయింపులపై చర్యలు తీసుకుంటేనే

గత అసెంబ్లీ సమావేశాల నుంచీ ఫిరాయింపుదారుల్ని మంత్రి పదవుల నుంచి తప్పించి వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేస్తోంది. ఆ డిమాండ్‌తోనే గత సమావేశాల్ని బహిష్కరించారు. వైసిపి తరపున మొత్తం 67 మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా, అనంతరం అందులో 23 మంది టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మరో 44 మంది మాత్రం పార్టీలో మిగిలారు. టిడిపిలోకి వెళ్లిన వారిలో అమరనాథ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, భూమా అఖిలప్రియతో పాటు సుజయకృష్ణ రంగారావులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి పదవులిచ్చారు. వీరిపై చర్యలు తీసుకోవాలని వైసిపి ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. ఢిల్లీ ఆందోళనలో ఈ విషయాన్ని కూడా ప్రస్తావించే అవకాశం ఉందని సమాచారం,. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే సమయానికి జగన్ పాదయాత్ర ప్రకాశం నుంచి గుంటూరు జిల్లాకు చేరుకోనుంది. మార్చి మొదటి వారం నుంచి సుమారు 20 రోజులు గుంటూరు జిల్లాలోనే ఆయన పాదయాత్ర నిర్వహిస్తారు. అనంతరం కృష్ణా జిల్లాకు వస్తారు. బడ్జెట్ సమావేశాలప్పుడు ప్రతిపక్ష నేత గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనే ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశాలు జరిగే సమయంలో ఆయన సలహాలు, సూచనలతో ముందుకెళ్తామని కొందరు వైసిపి ఎమ్మెల్యేలు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయాలపైనా చర్చ!

అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే ఏం చేయాలన్న అంశంపై కూడా వైసిపిలో చర్చ జరుగుతోంది. దీంతో అసెంబ్లీకి వెళ్లకుండానే అక్కడే ఉన్న మీడియా పాయింట్ ద్వారా గానీ లేక ప్రత్యేకంగా మీడియా సమావేశాల్ని ఏర్పాటు చేయడం ద్వారాగానీ తమ వాణిని వినిపించే ఆలోచనలో ఉన్నారు. అసెంబ్లీ కంటే ప్రజా సమస్యలే తమకు ముఖ్యమని పేర్కొంటున్నారు

అది చిన్న పొరపాటే

- **అలా అనుకుంటే 600 కోట్ల మంది నాకు ఓటేశారని**
- **దావోస్‌లో మోడీ చెప్పలేదా?**
- **ప్రధానిపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల కవిత వివరణ**

ప్రజాశక్తి, -హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీని వ్యక్తిగతంగా వాడు అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడటంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు సీరియస్ అయ్యారు. దీంతో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు టీఆర్ఎస్ నేతలు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు నానా తంటాలు పడుతున్నారు. ప్రసంగం ఫ్లోలో అలా వచ్చిందని, రైతులకు మద్దతుగా నిర్ణయాలు తీసుకోకపోవడంతో బాధతో అలా అని ఉంటారని, కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీని కించపర్చడం ముఖ్యమంత్రి ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు. ఈ నెల ఐదు నుండి రెండో విడత పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రిని, కేంద్రప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకునేందుకు టీఆర్ఎస్‌పార్టీ నేతలు ఇప్పట్నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం నిజామాబాద్ ఎంపీ కవిత మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీని కించపరిచే సంకుచిత వ్యక్తిత్వం ముఖ్యమంత్రి కేసీఆర్‌ది కాదు అని చెప్పారు. మోడీ గాడు అనే మాట కేవలం దొర్లిన తప్పిందం మాత్రమేనన్నారు. పెద్ద ఉపన్యాసంలో చిన్న పొరపాటు మాట దొర్లిందన్నారు. దేశ ప్రధానిని అవమానించుకుంటే దేశాన్ని అవమానించినట్టేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైతులు, పేద ప్రజల కోసం ఏమీ చర్యలు తీసుకోలేదన్న ఆవేదనతోనే సీఎం కేసీఆర్ మాట్లాడారు తప్ప ఎవరినీ అవమానించడానికి కాదన్నారు. దీన్ని బీజేపీ నేతలు ఇంత రాద్ధాంతం చేయడం అనవసరమని, వారి రాజకీయ దిగజారుడుతనానికి ఇది నిదర్శనం అన్నారు. దావోస్‌లో 600 కోట్ల మంది నాకు ఓటు వేశారని ప్రధాని తప్పు మాట్లాడారు. దేశంలో ఉన్నది 130 కోట్ల మంది మాత్రమే. ఇలా మాట దొర్లడం అందరికీ సహజమేనన్నారు.

హామీలపై గళం విప్పుతాం

ఈ నెల 5వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తమ గళం వినిపిస్తామని కవిత తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రైతులు, పేదల ఆదాయం పెంచుతారని అనుకున్నామని, కానీ అందుకు పూర్తి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ చెప్పారు కానీ.. దానికి సంబంధించిన ఎలాంటి బిల్లూ ఇప్పటి వరకు పార్లమెంటుకు రాలేదన్నారు. వ్యాపారానికి సంబంధించిన 30 బిల్లులు ఇప్పటివరకు పెట్టారు. కానీ వ్యవసాయానికి సంబంధించిన బిల్లును పెట్టలేదన్నారు. గతంతో పోల్చితే కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గాయన్నారు. రైతును యూనిట్ గా తీసుకొని ఇన్సూరెన్స్ చేయాలని తాము ఎప్పటి నుంచో కోరుతున్నామని గుర్తుచేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరామన్నారు. రైతుల కోసం ఇప్పటిదాకా కేంద్రం సరైన ప్రణాళిక వేయలేదన్నారు.

నెత్తురోడిన దండకారణ్యం

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి నుంచి కూంబింగ్ నిర్వహించాయి. ఆ క్రమంలో మావోయిస్టులు ఎదురు పడటంతో ఎదురు కాల్పులు జరిగాయి. సుమారు మూడున్నర గంటల సేపు కాల్పులు జరిగినట్లు తెలిసింది. కాల్పుల అనంతరం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా పది మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి. ఈ కాల్పుల్లో గ్రేహౌండ్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతిచెందారు. చనిపోయిన మావోయిస్టుల్లో ఆ పార్టీ తెలంగాణ కార్యదర్శి యాప నారాయణ అలియాస్ జగన్ అలియాస్ హరిభూషణ్‌తో పాటు అతని భార్య సమ్మక్క అలియాస్ శారద, ఖమ్మం జిల్లా కార్యదర్శి గోపన్న అలియాస్ సాంబయ్య, మరో అగ్రనేత సెంట్రల్ రెవల్యూషనరీ కమిటీ కార్యదర్శి సాగర్ ఉన్నారని, ఈ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆజాద్ గాయపడ్డారని కూడా తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని పోలీసులు నిర్ధారించలేదు.

మృతుల్లో ఆరుగురు మహిళలు

ఎదురుకాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల్లో ఆరుగురు మహిళలున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. శుక్రవారం ఆయన భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో భూపాలపల్లి ఎస్పీ భాస్కరన్, రెండు జిల్లా ఓఎస్డీలు, ఎఎస్పీలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు కానిస్టేబుల్ సుశీల్ మృతదేహం మినహాయించి మృతులెవ్వరినీ గుర్తించలేదన్నారు. కాల్పులు చోటుచేసుకున్న ప్రాంతంలో ఇప్పటి వరకు పది మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, వీరిలో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారని ఆయన చెప్పారు. ఒక ఎకె 47, ఇంకొక ఎస్ఎల్ఆర్, రాకెట్ బాంబులు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి, సాహిత్యం, రూ.43 వేల నగదు కూడా సంఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నట్లు కిశోర్ తెలిపారు. కానిస్టేబుల్ సుశీల్ మృతదేహంతో పాటు మరో రెండు మావోయిస్టుల మృతదేహాలను మాత్రమే ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న గూడేలు, గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ కొనసాగిస్తున్నారని ఆయన చెప్పారు. ఎదురుకాల్పుల్లో చనిపోయిన మావోయిస్టులలో హరిభూషణ్ ఉన్నారా లేదా అనే విషయాన్ని ఆయన నిర్ధారించలేదు. పోస్టుమార్టం అనంతరం గ్రేహౌండ్స్ కమాండో సుశీల్ మృతదేహాన్ని ఆయన స్వస్థలమైన వికారాబాద్‌కు తరలించారు. అంతకు ముందు సుశీల్‌కుమార్ మృతదేహానికి ఎస్పీలు, ఇతర పోలీసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌కౌంటర్‌లో హరిభూషణ్ మృతి చెందారనే విషయం మీడియా ద్వారా తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. హరిభూషణ్ తమ్ముడు అశోక్, చెల్లి భారతి ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. తమ అన్న కానీ, వదిన కానీ లేరని గుర్తించారు. 1991లో తమ అన్న అజ్ఞాతంలోకి వెళ్లారని అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ తిరిగి రాలేదన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్ : వరవరరావు

భద్రాద్రి జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని విరసం నేత వరవరరావు ఆరోపించారు. మావోయిస్టులను పట్టుకొని తెలంగాణా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోకి తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేసి దారుణంగా చంపేశారన్నారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

పోస్టుమార్టంను వీడియో తీయండి

మృతదేహాల్ని కుటుంబ సభ్యులకు అప్పగించండి

హైకోర్టు ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం తొండపాల్ అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మతదేహాలకు పోస్టుమార్టంపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మతదేహాల్ని భద్రాచలం ఆస్పత్రికి తీసుకొని వచ్చి ఉంటే, వాటికి పోస్టుమార్టం నిర్వహించేప్పుడు వీడియో చిత్రీకరణ చేయాలని ఆదేశించింది. ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ సర్కార్‌ను ఆదేశించింది. మతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాక వాటిని కుటుంబసభ్యులకు అందజేయాలని బెంచ్ ఆదేశించింది. మరణించిన వారిలో ఎంతమంది తెలంగాణ వారున్నారని బెంచ్ ఆరా తీసింది. తెలంగాణ వారుంటే వారి మతదేహాల విషయంలో కూడా అదేవిధంగా చేయాలని తెలంగాణ సర్కార్‌ను బెంచ్ ఆదేశించింది. మతదేహాలకు వరంగల్ ఎంజీఎం లేదా ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాలని, ఎన్‌కౌంటర్‌పై సిబిఐతో దర్యాప్తునకు ఆదేశించాలని, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై 302 (హత్యానేరం) కింద కేసు నమోదు చేయాలని కోరుతూ పౌర హక్కుల కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన అత్యవసర ప్రజాహిత వ్యాజ్యాన్ని భోజన విరామ సమయంలో బెంచ్ విచారణ జరిపింది. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది మావోయిస్టులు మరణించారని, అందులో హరిభూషణ్ అనే మావోయిస్టు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. ఫోరెన్సిక్ వైద్యుడు భద్రాచలం ఆస్పత్రిలో లేనందున వరంగల్‌లో పోస్టుమార్టానికి ఆదేశించాలని కోరారు. ఎన్‌కౌంటర్ ఘటన తెలంగాణ రాష్ట్రంలో జరగలేదని, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని హుసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందని తెలంగాణ ప్రభుత్వ అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు చెప్పారు. హైకోర్టు పరిధిలోకి ఘటన రాదన్నారు. మతదేహాల్ని భద్రాచలం ఆస్పత్రికి తీసుకొచ్చినందున తాము జోక్యం చేసుకోవచ్చునని బెంచ్ స్పష్టం చేసింది. భద్రాచలంలో అన్ని వసతులూ ఉన్నాయని చెప్పారు. విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు వేయాలని ఆదేశించింది.

కొత్త ఆకర్షణ

'బాహుబలి' వచ్చాక తెలుగు సినిమా నిర్మాణం రూపరేఖలు మారిపోతున్నాయి. చిత్రాలకు అత్యున్నత సాంకేతికత అందించడం, ప్రముఖ నిపుణులతో నిర్మాణం చేపట్టడం ఈ మధ్య ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు చిరంజీవి, ప్రభాస్, ఎన్టీఆర్... వీరందరి చిత్రాలకూ బాలీవుడ్ నిపుణులు పని చేస్తున్నారు. తాజాగా ఆ కోవలో మహేష్ బాబు కూడా చేరిపోయారు. సి.అశ్వనీదత్, దిల్ రాజు కలసి మహేష్ 25వ సినిమాను నిర్మిస్తున్నారు. వంశీపైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్‌లో వచ్చిన 'డాన్', 'తలాష్', 'రయీస్' వంటి భారీ చిత్రాలకు అద్భుతమైన విజువల్స్‌ని అందించిన సినిమాటోగ్రాఫర్ కె.యు.మోహనన్ మహేష్ సినిమాకు పని చేయనున్నారు. ఈయన కెమెరా పనితనం ఈ చిత్రానికి కొత్త ఆకర్షణ కాగలదు. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించనుంది. దేవిశ్రీప్రసాద్ బాణీలు సమకూరుస్తున్నారు.


కె.యు.మోహనన్


మహేష్ బాబు

అనుష్కకు ఓకేనా!

నాచియార్...ఇటీవల విడుదలై మంచి వసూళ్ల సాధిస్తున్న తమిళ చిత్రమిది. జ్యోతిక, జీవీ ప్రకాష్ ప్రధాన పాత్రల్లో నటించారు.

సంచలన దర్శకుడు బాలా రూపొందించిన చిత్రమిది. ఫిబ్రవరి 16న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 'నాచియార్' తెలుగు హక్కులను కోనేరు కల్పన సొంతం చేసుకున్నారు. ఈ సినిమాను డబ్ చేయకుండా తెలుగులో రీమేక్ చేసే ఆలోచనలో ఉన్నారట. రీమేక్ చేస్తే బాగుంటుందని దర్శకుడు బాలా సూచించారట. 'నాచియార్'లో జ్యోతిక పోషించిన పాత్రను ఇక్కడ అనుష్కతో చేయాలని అనుకుంటున్నారట. ఈ పాత్ర ఆమె చేసేందుకు అంగీకరిస్తుందా? లేదా? అన్న సందేహంలో చిత్రబృందం ఉంది. అనుష్క గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వెంటనే షూటింగ్ మొదలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పింది యూనిట్. అనుష్క కూడా 'భాగమతి' తర్వాత ఇంకా ఎటువంటి చిత్రమూ అంగీకరించలేదు. మరి ఈ చిత్రంలో చేస్తుందో? లేదో? చూడాలి.



రచయిత దేవరాజు రవి కన్నుమూత

ప్రముఖ కథకుడు, నవలాకారుడు, సినిమా సమీక్షకుడు, సాంఘిక సేవా కార్యకర్త దేవరాజు రవి శుక్రవారం హైదరాబాద్ మేడిపల్లిలో కన్నుమూశారు. దేవరాజు రవి 12 నవలలు, 200 పైగా కథలు, 1250 సినిమా సమీక్షలు ఇంకా పలు ఇతర వ్యాసాలు రాశారు. 1959లో రామం అనే నవలతో ప్రారంభమైన ఆయన రచనా వ్యాసంగం చివరిరోజు వరకు కొనసాగింది. మూడు కవితా సంపుటాలు, రెండు కథా సంపుటాలు వెలువరించారు.

సితార, శివరంజని, మేఘసందేశం, నంబర్ వన్ సినిమా పత్రికలలో ఆయన సమీక్షలు చేసేవారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

ఎన్టీఆర్‌కు ఎవరు?


రాశీ ఖన్నా

ఎస్ఎస్ రాజమౌళి త్వరలో మల్టీస్టారర్ తీయనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా కోసం ఎప్పటి నుంచో కరసత్తులు చేస్తున్నారు జక్కన్న. ఈ చిత్రం ఆగస్టు నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇప్పుడు ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో ఇద్దరు ప్రముఖ హీరోయిన్లను ఎంపిక చేసే పనిలో పడ్డారు. అందులో రాశీ ఖన్నాను ఒక కథానాయికగా ఎంపిక చేశారు. రెండో హీరోయిన్ కోసం అన్వేషిస్తున్నారు జక్కన్న. ఇప్పటికే ఎన్టీఆర్ సరసన రాశీ ఖన్నా 'జనతా గ్యారేజ్'లో చేసి మెప్పించింది. అందుకే ఈమెను రామ్ చరణ్‌కు హీరోయిన్‌గా నిర్ణయించింది చిత్రబృందం. ఇప్పుడు తారక్‌కు కథానాయికగా ఎవరిని ఎంపిక చేస్తే బాగుంటుందన్నదానిపై అన్వేషిస్తున్నారు. దక్షిణాదిలో ప్రముఖ గ్లామర్ తారను ఎంపిక చేయాలని భావిస్తున్నారు.


రామ్ చరణ్


ఎన్టీఆర్

ఇక గ్లామర్ రోల్స్

అవకాశాలను దక్కించుకోవాలంటే గ్లామర్ రోల్స్ కూడా చేయాల్సి ఉంటుందని లావణ్య త్రిపాఠి చెబుతుంది. ప్రస్తుతం ఈ హీరోయిన్ చేతిలో ఒక్క సినిమా అయినా లేదు. మొన్న సాయి ధరమ్ తేజ్ హీరోగా చేసిన 'ఇంటిలిజెంట్'లో చేసింది. ఈ సినిమా పెద్దగా ఆమెకు కలసిరాకపోవడంతో ఆ చిత్రం గురించి ఎవరైనా ఆమె వద్ద మాట్లాడితే దాని గురించి చర్చించకుండా ఉండడమే ఉత్తమం అని చెబుతుంది. తనకు కలిసొస్తుందనుకున్న 'ఇంటిలిజెంట్' ఫెయిల్ కావడంతో నిరాశ చెందడం లేదట 'నాను నేను సంతోషంగానే ఉన్నా. ఇప్పుడంతా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నా. కథల ఎంపికలో ఇంకా జాగ్రత్తలు తీసుకుంటా. రెండుమూడు సార్లు ఆలోచించాకే సినిమాలు చేసేందుకే ఓకే చెబుతా. అయితే ఈ సారి నుంచి గ్లామర్ రోల్స్ కూడా చేస్తేందుకు సిద్ధపడతాను. అవి నాకు ఉపయోగపడతాయని భావిస్తున్నా' అని చెప్పింది లావణ్య.


లావణ్య త్రిపాఠి

మరో యాక్షన్ చిత్రం


బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం శనివారం ప్రారంభమైంది. ఫైట్ మాస్టర్ శివ ఆధ్వర్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మొదటి సారి కొత్త దర్శకుడైన శ్రీనివాస్‌తో చిత్రం చేయడం విశేషం. విజయవంత చిత్రాలకు కో-డైరెక్టర్ గా పనిచేసిన అనుభవం శ్రీనివాస్‌కు ఉంది. సీనియర్ రచయిత అబ్బూరి రవి మాటలు అందిస్తున్నారు. నవీన్ సొంటినేని (నాని) నిర్మాతగా వంశధార క్రియేషన్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాత నాని మాట్లాడుతూ " దర్శకుడు శ్రీనివాస్ ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చిత్రంలో ఇద్దరు హీరోయిన్‌లు ఉంటారు. వారెవరన్నది త్వరలో వెల్లడిస్తాం. రచయిత అబ్బూరి రవి, ఛాయాగ్రహకుడు చోటా కె నాయుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్.తమన్ ఈ చిత్రానికి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. స్టంట్ శివ ఆధ్వర్యంలో ఓ భారీ యాక్షన్ సన్నివేశ చిత్రకరణతో ఈరోజు చిత్ర షూటింగ్ ప్రారంభమైనది" అని అన్నారు.

ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం 'సాక్ష్యం' అనే చిత్రం చేస్తున్నారు. దీనికి శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రీకరణ త్వరలో పూర్తి కానుంది. పూజా హెగ్డే కథానాయికగా చేస్తోన్న ఈ సినిమా కొత్త షెడ్యూల్‌లో తర్వలోనే ప్రారంభం కానుంది.

16న 'కిర్రాక్ పార్టీ'


నిఖిల్, సిమ్రాన్ పరీన్జ

నిఖిల్ హీరోగా చేస్తున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'కిర్రాక్ పార్టీ'. ఈ చిత్రాన్ని ఈనెల 16న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. షూటింగ్ పూర్తి చేసుకుని శరవేగంగా పోస్టు ప్రొడక్షన్ కార్యక్రమాలు చేసుకుంటుంది. ఇందులో స్టయిలిష్ మ్యాచో లుక్స్‌లో నిఖిల్ కనిపించడంతో అంచనాలను మరింత పెంచేశాయని నిర్మాతలు చెబుతున్నారు. 'హ్యాపీ డేస్' తరహా మరో కాలేజీ క్యాంపస్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కింది.

ఈ సినిమాతో శరన్ కొప్పిశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. నిఖిల్‌తో 'స్వామి రా రా', 'కార్తికేయ' వంటి హిట్ చిత్రాలు తీసిన దర్శకులు సుధీర్ వర్మ, చందూ మొండేటి ఈ చిత్రానికి స్క్రీన్-ప్లే, మాటలు అందిస్తున్నారు. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర, కిషోర్ గరికిపాటి, అజయ్ సుంకర, అభిషేక్ అగ్రవాల్ నిర్మాతలు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏటీవీ బ్యానర్‌లపై రూపొందుతోంది.

రక్షించడానికి పోరాడేవాడు

రజనీకాంత్ అంటే స్టయిల్ ఉంటుంది... అది అతని మాటల్లోనూ, నటనలోనూ కూడా. మొన్ననే 'కబాలి' చేశారు. అందులో పేదలకు అండగా నిలబడే గ్యాంగ్‌స్టర్‌గా చేశారు. ఇప్పుడూ అదే పాత్రలో 'కాలా' చేశారు. పా రంజిత్ ఈ చిత్రానికీ దర్శకత్వం వహించారు. ఇందులో నల్లదుస్తులతో ఉండే ఫస్ట్, సెకండ్ లుక్స్ కూడా ఆకట్టుకున్నాయి. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో రజనీ స్టైల్, డైలాగులు, యాక్షన్ సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. కరికాలన్ అనే డాన్ పాత్రలో నటించారు. వండర్ బార్ ఫిలింస్ బ్యానర్‌పై ధనుష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టీజర్‌లోలో నానా పాటేకర్..'కాలా..ఇదేం పేరు' అని అంటే 'కాలా అంటే నలుపు. కరికాలన్ అంటే గాడ్ ఆఫ్ డెత్. రక్షించడానికి పోరాడేవాడు.' అంటూ బ్యాక్‌గ్రౌండ్ వాయిస్ వినిపిస్తుంది. 'నేనొక్కడినే వచ్చాను. దమ్మున్నోడు రండిరా.. మీరింకా నా పూర్తి రౌడీయిజాన్ని చూడలేదు. చూస్తారు' అని రజనీ తరహాలో చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. ఇందులో బాలీవుడ్ నటి హుమా ఖురేషీ రజనీకి జోడీగా నటించారు. నానా పటేకర్ ప్రతినాయకుడి పాత్రలో నటించారు. ఏప్రిల్ 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.


రజనీకాంత్

'ప్రేయసి' కోసమేనా..!

నాగ చైతన్య వరుస పెట్టి సినిమాలు చేసేస్తున్నారు. అసలు విరామం లేకుండా చేతి నిండా సినిమాలు ఉన్నా ఇంకా కొత్తవాటిని అంగీకరిస్తునే ఉన్నారు. ప్రస్తుతం చైతూ చేతిలో 'సవ్యసాచి', 'శైలజా రెడ్డి అల్లుడు' చిత్రాలు ఉన్నాయి. ఇప్పుడు మరో కొత్త చిత్రం చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

యువ దర్శకుడు శివ నిర్వాణ ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నారట. 'ప్రేయసి' అనే పేరుతో తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో సమంతే కథానాయికగా ఉంటుందని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా రొమాంటిక్‌గానే తీయబోతున్నారట. సాహు గరపాటి, హరీశ్ పెద్ది నిర్మాతలుగా వ్యవహరిస్తారని తెలిసింది. ప్రస్తుతం చైతూ చందు మొండేటి దర్శకత్వంలో 'సవ్యసాచి' చేస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా చేస్తున్నారు. మారుతి దర్శకత్వంలో 'శైలజా రెడ్డి అల్లుడు' చేస్తున్నారు. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక.


నాగచైతన్య



ఆనంద్యాల విహారం

'రాళ్లలో ఉన్నదేదో కన్నులకే తెలుసు' అన్న కవి మాటలు అక్షరసత్యాలు. అందుకు నిదర్శనమే నంద్యాలలోని పురాతన శిల్పకళా నైపుణ్యం. ఇక్కడ రాళ్లల్లో దాగిన చారిత్రక అందాలను చూసి తరించాల్సిందే. స్వచ్ఛమైన నీటి కొలనుల్లో దాగిన ఎన్నో రహస్యాలు ఇక్కడ తారసపడతాయి. ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన సొరంగ మార్గాలూ సందర్శకులకు మనసారా స్వాగతం పలుకుతాయి. ఆ నంద్యాల పర్యాటక విశేషాల్ని ఈ వారం 'జర్నీ'లో చూసేద్దాం!!

ఎప్పుడూ పనులతో బిజీగా ఉండే మాకు కాస్త విరామం ఇవ్వడానికి, మా పనివిధానం నిర్దేశం కోసం మా డిపార్టుమెంట్ సమావేశంతో పాటు ఒకరోజు విహారయాత్రకు ప్లాన్ చేశారు. అందులో భాగంగా నంద్యాలను ఎంపిక చేసుకున్నారు. అందుకోసం రాష్ట్రంలోని అన్ని ఎడిషన్ల నుంచీ మొత్తం 20 మంది నంద్యాలకు ఉదయాన్నే చేరుకునేలా ప్రణాళిక వేశారు. మేం విజయవాడ నుంచి పదిమంది. రాత్రి పదిగంటలకు విజయవాడ రైలులో బయలుదేరాం. ఉదయం 5 - 5.30 మధ్యలో నంద్యాలకు చేరుకున్నాం. కర్నూలు ఎడిషన్‌లో పనిచేసే రమేష్ అన్న మాకోసం అన్ని ఏర్పాట్లూ ముందుగానే సిద్ధం చేశారు. మాకు కేటాయించిన గదుల్లో బస చేశాం. ఉదయం ఎనిమిది గంటలకు అందరూ రెడీ అయ్యి, టిఫెన్ కోసం వెయిటింగ్. అదే సమయంలో కర్నూల్ స్పెషల్ వంటకం ఉగ్గానీభజ్జీ అని చెప్పారు. అక్కడి స్పెషల్ అనగానే అందరం దానివైపే మొగ్గుచూపాం. అంతలోనే వేడివేడి ఉగ్గానీభజ్జీ వచ్చింది. ప్లేట్‌లో రెండు భజ్జీలు పెట్టి, దానిలో ఉగ్గాని పెట్టి ఇచ్చారు. అది మా ప్రాంతంలో మరమరాలతో చేసే మసాలా స్పెషల్! కొంచెం ఉప్పు ఎక్కువగా అక్కడి ప్రాంతం వారు తింటారు అని చెప్పారు. ఎంతో ఇష్టంగా దానిని లాగించేశాం. త్వరగా విహారయాత్రకు బయలుదేరాం. అక్కడ ఉన్న యువకులంతా ఒక కారులో, పెద్దలంతా మరో కారులో ఎక్కేశాం. మేము స్టే చేసిన ప్రాంతం నుంచి మహానందికి బయలుదేరాం. అలా సరదా సరదాగా జోక్స్ వేసుకుంటూ, పాటలు పాడుతూ పదిహేను నిమిషాల్లో మహానందికి చేరుకున్నాం.

మహానంది విశేషాలు

మహానంది ఆలయానికి వందమీటర్ల ఎదురుగా ఓ పెద్ద నంది రాతి విగ్రహం ఉంది. అచ్చం అది మాకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్న అనుభూతి కలిగింది. ఆ ప్రాంతాన్ని ఓ చిన్నసైజు పచ్చని నందనవనంలా ఎంతో సుందరంగా తయారుచేశారు. అంతేకాదు, అక్కడ పిల్లలు ఆడుకోవడానికి చిన్న చిన్న ఆట వస్తువులూ ఉన్నాయి. వాటిని చూసుకుంటూ ఆలయం లోపలికి అడుగులు వేశాం. మహానంది రాతి నిర్మాణశైలి మన పూర్వీకుల మహాద్భుత మేధోసంపత్తికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. లోపలికి వెళ్ళగానే పెద్ద కోనేరు కనిపించింది. దాని ప్రత్యేకత ఏంటంటే, అక్కడ ఉండే నీరు ఎక్కడి నుంచి వస్తుందో ఎవ్వరికీ తెలియదు. ఆ కోనేరులో నీరు ఎంత పారదర్శకంగా ఉన్నాయంటే.. గుండు పిన్ను వేసినా కనిపించేలా ఉన్నాయి. అది చూడగానే మా వాళ్ళు కోనేరులో దిగి, కేరింతలు కొట్టారు. ఎవరికి వారు ఈత సరదాను మనసారా తీర్చుకున్నారు. పాండవులు అరణ్యవాసం చేసే సమయంలో ఇక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేశారని అక్కడి ప్రజల నమ్మకం. అంతేకాదు, పురాణాల్లో ఈ ఆలయానికి గొప్ప విశిష్టత ఉందని అక్కడి స్థానికులు చెప్పుకొచ్చారు. ఎవరి విశ్వాసం ఎలా ఉన్నా, పురాతన కట్టడాలను కనులారా ఆస్వాదించాలనుకునేవారికి మహానంది ప్రాంతం గొప్ప అనుభూతుల్ని కలిగిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు.



ఆలయాల సమూహం యాగంటి

అక్కడికి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న యాగంటికి బయలుదేరాం. దారిపొడవునా పచ్చని పొలాలు కనిపించాయి. వాటి అందాలు మాకు దూరమే తెలియకుండా చేశాయి. అక్కడి దర్శనీయ ప్రదేశాలలో ఒకటైన యాగంటి ఆలయం చూసేందుకు మెట్లదారినపైకి వెళ్లాం. అక్కడి శివాలయంలోనూ ఓ కోనేరు ఉంది. చుట్టూ ఉన్న కొండల నడుమ కోనేరులో నీటిని చూసి ఒకింత ఆశ్చర్యానికి గురయ్యాం. అంతేకాదు, అందులోకి నిత్యం కొండలలోంచి నీరు ఊరి వచ్చేట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఆలయం విషయానికి వస్తే లోపల రాతి శివలింగం, బయట నంది ఉన్నాయి. ఇక్కడ నంది గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే, ఈ గుడి నిర్మాణ సమయంలోనే ఆ కొండలోని రాయినే చిన్న నందిగా మలిచారట! నాటి నుంచి నేటి వరకూ అది పెరుగుతూ వస్తుందని విశ్వసిస్తారు. దానికి అక్కడి ప్రజలు నిత్యం పూజలు చేస్తారు. కొండగుహలో వెంకటేశ్వరస్వామి ఆలయమూ ఉంది. మరొక గుహలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ఉంది. అక్కడే కాలజ్ఞానం రాశారు అనీ ప్రజలు నమ్ముతారు. అక్కడి కొండలు చాలా అందంగా ఎవరో ఒకదానిపై ఒకటి పేర్చినట్లుగా పలకలుగా ఉన్నాయి. ఈ యాగంటిలో సినిమాలు తీస్తారని స్థానికులు చెప్పారు. ఇటీవల 'నేనే రాజు నేనే మంత్రి' సినిమాలో కాజోల్ దీపం వెలిగించే సీన్ ఇక్కడే తీశారు అని చెప్పుకొచ్చారు. ఆ ప్రదేశం మొత్తం చూసి ఫోటోలు దిగి అక్కడి నుంచి బెలూం గుహలు చూడాలని మళ్ళీ కారులో బయలుదేరాం.



బెలూం గుహల అందాలు

అప్పటికే మధ్యాహ్నం 1.30 అయ్యింది. వెళ్లే దారిలో కొండపైన ఓ అందమైన కోట కనిపించింది. చూద్దామని వెళ్ళాం. ఎక్కడో ఈ కోటను చూశామన్నది మా ఫీలింగ్! ఎక్కడా అని ఆలోచనలో పడ్డాం. అంతలో మా రిపోర్టర్ అది అరుంధతి కోట అని చెప్పాడు. అప్పుడు గుర్తొచ్చింది 'అరుంధతి' సినిమాలో ఉన్న కోట అదే కదా అని. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. మా ఫోన్లో ఉన్న కెమెరాకి పని చెప్పాం. ఆ కోట ఎవరిదా అని స్థానికులను అడిగాం. బనగానిపల్లెని పాలించిన రాజుల విలాసమందిరలో ఇది ఒకటని చెప్పారు. కోటను మొత్తంగా చూశాక అక్కడి నుంచి మళ్ళీ మా ప్రయాణం కొనసాగించాం. బెలూం గుహలకు వెళ్లే దారిలో ఓ రిజర్వాయర్ కనిపించింది. రెండు కొండలను కలిపి ఒక రిజర్వాయర్ ఏర్పాటు చేశారు. అక్కడ నీరు నిల్వ చేసి, ఆ చుట్టుపక్కల గ్రామాలకు తాగునీరుగా, పొలాలకు సాగునీరుగా ఉపయోగిస్తారు అని చెప్పారు. దారి మధ్యలో ఎటు చూసినా కొండలే.. ఆ కొండలను తొలుస్తూ కనిపించే క్వారీలు ఎక్కడికక్కడ దర్శనమిచ్చాయి. అక్కడి గ్రామాల్లో ఇళ్ళనీ ఈ బండలతోనే కడతారు. ఆ ఇళ్లను చూశాక మాకు చాలా ఆశ్చర్యం కలిగింది. చుట్టుపక్కల ప్రదేశాలను చూస్తూ మాటలు చెప్పుకుంటుండగానే బెలూం గుహలకు చేరిపోయాం. అక్కడ చల్లని వాతావరణం, చెట్ల స్వచ్ఛమైన గాలి మమ్మల్ని ఆనందానికి గురి చేసింది. గవర్నమెంట్ ఆధీనంలో ఉన్న ఈ గుహలను సుందరంగా తీర్చిదిద్దారు. ఎలా ఉంటాయో అని లోపలికి వెళ్లిన మాకు ఈ గుహలు నిరాశనే మిగిల్చాయి. ఎందుకంటే లోపల నిర్మాణపనులు జరుగుతున్నాయి. అందుకే ఎక్కువ దూరం వెళ్ళడానికి అనుమతి లేదు అని బోర్డులు ఉన్నాయి. దానితో మా వాళ్ళు అందరూ వెనక్కి వచ్చేశారు. నేను, మరో ముగ్గురితో కలిసి, అక్కడివారితో మాట్లాడి లోపల ఏం ఉందోనని ఆ హెచ్చరిక బోర్డులు దాటుకుని లోపలికి వెళ్ళాం. లోపల అంతా నీరు చేరి, గుహల లోపల మట్టి పేరుకుపోయింది. దారి సరిగా లేదు. అలా లోపలకు వెళ్లే కొద్దీ చాలా సొరంగాల దారులు ఒక్కొక్కటిగా కనిపిస్తూనే ఉన్నాయి. అలా మేం అక్కడ వేసిన ప్రతి అడుగూ మాకు మర్చిపోలేని అనుభూతుల్ని చేరువచేశాయి. బయట ఓ పెద్ద ధ్యానబుద్ధ విగ్రహం ఉంది. అక్కడే కాస్త సమయం సేద తీరాం. స్థానికంగా ఇంకా చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నప్పటికీ సమయం లేకపోవడంతో తిరుగు ప్రయాణమయ్యాం.

పనుల ఒత్తిడిని దూరం చేస్తూ అప్పుడప్పుడూ ఇలా చేసే విహారయాత్రలు మనసును ఉల్లాసపరుస్తాయి అనడానికి మా నంద్యాల ట్రిప్ ఓ ఉదాహరణ! మరెందుకు ఆలస్యం మీ 'జర్నీ' మొదలుపెట్టండి!

- ఎం. ప్రసన్నకుమార్,
మంగళగిరి.





ఈ ఫ్లవర్ ఫెస్ట్ ప్రత్యేకతలెన్నో..!

ప్రతి ఏడాదిలానే ఈ ఏడాదీ చండీగఢ్‌లో 46వ రోజ్ ఫెస్టివల్ ప్రారంభమైంది. చండీగఢ్‌లోని సెక్టార్ -16 ఉన్న రోజ్ గార్డెన్, లెజర్ వ్యాలీలో జరుగుతున్న ఈ ఫెస్టివల్‌ను చూడ్డానికి పర్యాటకులు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. రోజ్ గార్డెన్‌లో ఉన్న ఈ పూల మేళాలో గులాబీలతో పాటు విభిన్నరకాల పూలను చూడవచ్చు. ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే ఈ ఫెస్టివల్ జూన్ వరకూ కొనసాగుతుంది.

చండీగఢ్‌లోని జాకీర్ హుస్సేన్ రోజ్‌గార్డెన్ ఆసియాలోని అతిపెద్ద రోజ్ గార్డెన్స్‌లో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది. 30 ఎకరాలలో ఉన్న ఈ గార్డెన్‌లో రోజ్‌ఫెస్టివల్‌లో భాగంగా 829 గులాబీ రకాలను పొందుపరుస్తారు. ఇందులో మొత్తం 42,000 గులాబీ మొక్కలను ప్రదర్శనలో ఉంచుతారు. తినడానికి, తాగడానికి ప్రత్యేక స్టాల్స్ కూడా ఉంటాయి. ఈ ఫెస్టివల్‌ను చూడ్డానికి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ప్రతి ఏడాది ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తుంటారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకూ ఈ పూల ప్రపంచాన్ని వీక్షించవచ్చు. సుమారు 55.67 లక్షల రూపాయలతో నిర్వహించే ఈ ఫెస్టివల్‌ను చూడ్డానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. కల్చరల్ పోటీలు మాత్రమే కాకుండా ఇక్కడ బ్రాస్ అండ్ పైప్ బాండ్, ఫ్లవర్ హేట్ మేకింగ్, లోక్ నృత్యం, మిస్టర్ అండ్ మిసెస్ రోజ్, అంత్యాక్షరి లాంటి పోటీలను నిర్వహిస్తుంటారు నిర్వాహకులు. దాంతోపాటు ఇక్కడ పూలతో విచిత్ర ఆకృతులనూ తయారుచేసి పెడతారు. ఇంకెందుకు కాలస్యం ఈ సీజన్‌లో ఎవరైనా చండీగఢ్ పర్యటనకు వెళితే ఈ రోజ్ ఫెస్టివల్‌ను వీక్షించడం మర్చిపోవద్దు. ★



'జర్నీ'కి ఆహ్వానం

మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.



మా చిరునామా

జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



చిన్నారి



జోక్ :

రాజు : రవీ! మన ఎదురింటతను ఇంతకుముందు నల్లగా ఉండేవాడు. ఇప్పుడెలా తెల్లబడ్డాడురా?


రవి : అప్పుడు బొగ్గుగనిలో సెక్యూరిటీ గార్డు.. ఇప్పుడు పిండిమిల్లు నడుపుతున్నాడులేరా!

ఏమిటది?

జంతువుల్లోకెల్లా పెద్దది..
దీనికి తొండముంటుంది..
దీని దంతం విలువైంది..
పెద్ద గుడులలో ఉంటుంది..

జవాబు: ఏనుగు

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పైనున్న చిత్రంలోని చుక్కలను కలిపి రంగులు వేయండి!

పుచ్చకాయ మ్యూజియం



పిల్లలూ..! అప్పుడే ఎండలు మండిపోతున్నాయి కదా! ఈ సీజన్లో వడదెబ్బ తగిలే అవకాశాలూ ఎక్కువ. అందుకే మనల్ని మనం రక్షించుకోవాలంటే కీరా, దోసకాయ, పుచ్చకాయ వంటివి ఎక్కువగా తినమని అమ్మావాళ్లు చెబుతుంటారు. మరి మనకు చాక్లెట్స్, ఐస్‌క్రీమ్స్ అంటే ఉన్న ఇష్టం వీటిపై ఉండదు కదా?! అందుకే వారి మాటలను మనం వినిపించుకోం.. ! కానీ చైనాలోని ఒక మ్యూజియం చూస్తే మాత్రం మీకు పుచ్చకాయ అద్భుతాలు కనిపిస్తాయి. ఎండాకాలంలో వచ్చే పండ్లలో.. పుచ్చకాయలకి ప్రత్యేకస్థానం ఉంది. మనకి తెలిసిన పచ్చని, గుండ్రని పుచ్చకాయ రకాలు ఒకటో, రెండో కాదు. ప్రపంచ వ్యాప్తంగా పన్నెండు వేల రకాలున్నాయి. వీటికోసం ప్రత్యేకంగా చైనాలోని బీజింగ్‌లో ఏకంగా 'వాటర్ మెలన్' మ్యూజియాన్నే నిర్మించారు. ఈ మ్యూజియం మొత్తాన్నీ పుచ్చకాయ ఆకారంలోనే తీర్చిదిద్దడం పెద్ద విశేషం. ఇందులోని అద్దాల గదుల్లో, గోడలపైన, పైకప్పును ఎటు చూసినా రకరకాల పుచ్చకాయలే దర్శనమిస్తాయి. అవి నోరూరిస్తున్నా వాటిని తినడం మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే వాటిని మైనంతో అచ్చు పుచ్చకాయల మాదిరిగానే తయారుచేశారు.



చైనీయులకు పుచ్చకాయలంటే చాలా ఇష్టం. వీటిని తరాతరాల నుంచి వాళ్లు పండిస్తున్నారు. బీజింగ్‌లో ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంలో పుచ్చకాయల పుట్టుపూర్వోత్తరాలు మొత్తం తెలుసుకోవచ్చు. అమెరికాలోని ఒక్లాహమా రాష్ట్ర కూరగాయ 'పుచ్చకాయ'నే! పొడిగా ఉండే ఉష్ణ వాతావరణంలో పండే పుచ్చ ఎలాంటి నేలలోనైనా పండుతుంది. అందుకే ఇది ప్రపంచమంతా అల్లుకుపోయింది. ★



నేను గీసిన బొమ్మ





ఎమ్. రాఘవి
ఏడవ తరగతి
అరవింద మోడల్ స్కూల్

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



నేటి నుండి సుల్తాన్ అజ్లాన్ షా టోర్నీ

భారత్ తొలి ప్రత్యర్థి అర్జంటీనా

కౌలాలంపూర్ (మలేషియా) : 27వ సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీ శనివారం నుండి ప్రారంభం కానుంది. మార్చి 3 నుండి 10వ తేదీవరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత జట్టు తొలి మ్యాచ్‌ను ప్రపంచ రెండో ర్యాంక్‌లో నిలిచిన అర్జంటీనాతో నేడు తలపడనుంది. ఆతిథ్య మలేషియా జట్టుతోపాటు అర్జంటీనా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్, ఐర్లాండ్ జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. ప్రతి జట్టు మిగతా ఐదు జట్లతో ఒక్కోసారి తలపడి అగ్రస్థానంలో నిలిచిన రెండుజట్లు ఫైనల్లో టైటిల్ పోరులో తలపడతాయి. విజేతగా నిలిచిన జట్టుకు షీల్డ్‌తో పాటు టీంసభ్యులందరికీ బంగారు పతకాలు అందజేయనున్నారు. ఫైనల్లో పరాజయం పాలైన జట్టుకు రజిత పతకం, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య జరిగే మ్యాచ్ విజేత... మూడోస్థానం నిలిచిన జట్టుకు కాంస్య పతకం దక్కనుంది. గత ఏడాది గ్రేట్ బ్రిటన్ (ఇంగ్లండ్) టోర్నీ విజేతగా నిలవగా... రన్నరప్‌గా ఆస్ట్రేలియా, భారతజట్టు మూడో స్థానాల్లో నిలిచి రజిత, కాంస్య పతకాలను సాధించాయి. గత కొంతకాలంగా హాకీజట్టుకు దూరంగా ఉంటున్న సర్దార్‌సింగ్ మళ్లీ జట్టులోకి చేరాడు. దీంతో భారత హాకీజట్టు పటిష్టంగా ఉంది.

టీమిండియా : సర్దార్‌సింగ్ (కెప్టెన్), సురాజ్ కర్కేరా, కృష్ణ బి. పాఠక్ (గోల్‌కీపర్స్), రమణ్‌దీప్ సింగ్ (వైస్ కెప్టెన్), అమిత్ రోహిదాస్, దిప్సన్ టిర్కే, వరుణ్‌కుమార్, సురేందర్‌కుమార్, నీలం సంజీప్ సక్సేనా, మంజీప్ మార్, ఎస్‌కె. ఊతప్ప, సుమిత్, నీలకంఠ శర్మ, సిమ్రన్‌జీత్ సింగ్, గుర్జాంత్‌సింగ్, తల్వీందర్ సింగ్, సుమిత్‌కుమార్ (జూనియర్), షీలానంద్ లక్రా.

టోర్నీ షెడ్యూల్...


మార్చి 3 :	భారత్ X అర్జంటీనా
	ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
	మలేషియా X ఐర్లాండ్
మార్చి 4 :	భారత్ X ఇంగ్లండ్
	ఐర్లాండ్ X అర్జంటీనా
	మలేషియా X ఆస్ట్రేలియా
మార్చి 6 :	భారత్ X ఆస్ట్రేలియా
	ఇంగ్లండ్ X ఐర్లాండ్
	మలేషియా X అర్జంటీనా
మార్చి 7 :	భారత్ X మలేషియా
	ఆస్ట్రేలియా X ఐర్లాండ్
	అర్జంటీనా X ఇంగ్లండ్
మార్చి 9 :	భారత్ X ఐర్లాండ్
	అర్జంటీనా X ఆస్ట్రేలియా
	ఇంగ్లండ్ X మలేషియా
మార్చి 10 :	ఫైనల్స్‌తో పాటు 3-4, 5-6 స్థానాలకు

సర్దార్‌సింగ్ (కెప్టెన్)



మహిళా కుస్తీలో కొత్త చరిత్ర

నవ్‌జోత్ కౌర్‌కు పసిడి



నవ్‌జోత్ కౌర్

కిర్గిజిస్తాన్ : ఆసియా మహిళా కుస్తీ ఛాంపియన్‌షిప్‌లో నవ్‌జోత్ కౌర్(28) కొత్త చరిత్ర సృష్టించింది. శుక్రవారం జరిగిన సీనియర్స్ (65 కిలోల) ఫైనల్ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళగా రికార్డ్ సృష్టించింది. జపాన్‌కు చెందిన మియా ఇమాయ్‌ని 9-1 పాయింట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. దీంతో ఆసియా మహిళా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించిన తొలి మహిళగా రికార్డ్ సృష్టించింది. రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షిమాలిక్ 62 కిలోల కేటగిరిలో కజకిస్తాన్‌కు చెందిన అయుహుయామ్‌ను 10-7 పాయింట్ల తేడాతో ఓడించి కాంస్య పతకాన్ని సాధించింది. దీంతో కుస్తీ విభాగంలో భారత మహిళాజట్టు మొత్తం ఆరు పతకాలను సాధించినట్లైంది.

రెవెన్యూ మహిళా ఉద్యోగుల క్రీడాపోటీలు

ప్రజాశక్తి-కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన కాకినాడలోని క్రీడా మైదానంలో ఎపి ఎన్‌జిఒ మహిళా విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న క్రీడాపోటీలు రెండోరోజూ ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం జిల్లా ఎన్‌జిఒ అసోసియేషన్ మహిళా విభాగం ఛైర్‌పర్సన్ ఎన్.రాజేశ్వరి, కన్వీనర్ వై.పద్మ మీనాక్షి పర్యవేక్షణలో ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా ఈ ఆటలపోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు అనంతరం బహుమతుల ప్రధానం జరిగింది. డిస్కస్‌త్రో 40 ఏళ్లు పైబడిన విభాగంలో వి.మాధవి, పి.లక్ష్మీరమణ, ఎం.సునీత వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలను సాధించారు. షార్ట్‌పుట్ పోటీల్లో వి.మాధవి, ఎస్.జయమ్మ, షేక్ గౌరీజాన్... జావెలిన్ త్రో పోటీల్లో వి.మాధవి, ఎం.అరుణ, షేక్ గౌరీజాన్ తొలి మూడు స్థానాలు సాధించారు. అండర్-40 విభాగానికి సంబంధించి వంద మీటర్ల పరుగుపందెంలో సిహెచ్.వాసంతి, పి.జ్ఞానా మణి, ఎస్.అరుణ... షార్ట్‌పుట్‌లో జిఎల్ఎస్.భవాని, ఎస్.అరుణ, షేక్ గౌసియాబేగం తొలి మూడు స్థానాలు పొందారు. జావెలిన్‌త్రోలో ఎస్.అరుణ, టి.జ్యోత్స్న, పి.జ్ఞానామణి... డిస్కస్‌త్రో విభాగంలో డాక్టర్ ఎస్.అర్చన ప్రియదర్శిని, షేక్ గౌసియాబేగం, గీతాంజలి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బూరిగ ఆశీర్వాదం, ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి జియావుద్దీన్, బి.కమల, కె.సుబ్బారావు, మోర్తి బాబు తదితరులు పాల్గొన్నారు.



జావెలిన్ త్రో పోటీలో మహిళలు

దక్షిణాఫ్రికా-162 ఆలౌట్

ఆసీస్‌కు 189 పరుగుల ఆధిక్యత

దర్బన్ : దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో సఫారీ జట్టు 162 పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు ఆసీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 351 పరుగుల వద్ద ముగించింది. ఆ జట్టు మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ మిచెల్ మార్ష్ (96) పరుగులు చేసి అవుటయ్యాడు. సఫారీ జట్టు బౌలర్ కేశవ్ మహరాజ్ 5 వికెట్లు సాధించాడు. అనంతరం సఫారీజట్టులో డివిలియర్స్ (71) మినహా మరెవ్వరూ క్రీజ్‌లో నిలదొక్కుకోలేదు. దీంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 162 పరుగులవద్దే ముగించింది. ఆసీస్ బౌలర్ స్టార్క్‌కు 5, లియాన్‌కు 3 వికెట్లు లభించాయి.

వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా



న్యూఢిల్లీ : భారత జూనియర్ నేషనల్ సెలెక్షన్స్ చీఫ్ పదవికి టీమిండియా మాజీ పేస్ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేశారు. శుక్రవారం తన రాజీనామా పత్రాన్ని బీసీసీఐకు పోస్ట్ చేశాడు. ఇటీవల అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారతజట్టు సెలెక్షన్స్‌లో వెంకటేశ్ ప్రసాద్ ప్రసాద్ కీలకపాత్ర పోషించాడు. 30 నెలలపాటు ఈ పదవిలో కొనసాగి బీసీసీఐతో సుదీర్ఘ సంబంధాల్ని కొనసాగించాడు. బీసీసీఐ పురుష, మహిళా జట్లకు ఇచ్చినంత ప్రాధాన్యతను జూనియర్ జట్టుకు ఇవ్వకపోవడం... తన పదవీకాలం ముగియడం... ఇతరత్రా కారణాలతో మరోసారి ఈ పదవిలో కొనసాగే ఉద్దేశ్యంలేకపోవడంతో... తాను ఈ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.



జిమ్నాస్ట్ అరుణకు ఘనస్వాగతం

హైదరాబాద్ : ఇటీవల జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన తెలుగమ్మాయి బుద్దా అరుణ రెడ్డికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. ప్రపంచకప్‌లో పతకాన్ని సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా గుర్తింపు పొందిన అరుణను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) ఛైర్మన్ వెంకటేశ్వర రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం శంషాబాద్ నుంచి హైదర్‌గూడ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రపంచ్‌కప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్య పతకం సాధించడం చాలా సంతోషంగా ఉందని కుటుంబ సభ్యుల సహకారం, ప్రభుత్వ సహకారంతో ఈ పతకం సాధించినట్టు ఆమె పేర్కొన్నారు.



ఇండిగో విమాన సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

'ఇండిగో' ఎయిర్‌వేస్ సంస్థ విజయవాడ విమానాశ్రయం నుండి దేశంలో పలు ప్రాంతాలకు నూతన సర్వీసులను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించింది. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మధుసూదనరావు జ్యోతి ప్రజ్వలన చేసి సర్వీసును ఆరంభించారు. ఇండిగో సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు సానేల్ డిసౌజా మొదటి ప్రయాణికుడికి బోర్డింగ్ పాస్ అందించారు. ఉదయం 8 గంటలకు హైదరాబాదు నుండి వచ్చిన ఇండిగో విమానానికి ఎయిర్‌పోర్టులో నీటితో స్వాగతం పలికారు. 8.30 గంటలకు బయలుదేరి హైదరాబాదు వెళ్లింది. ప్రతిరోజూ ఈ సంస్థ హైదరాబాదుకు నాలుగు సర్వీసులు, చెన్నైకి రెండు, బెంగుళూర్‌కు రెండు సర్వీసులను నడుపుతుందని డిసౌజా తెలిపారు. రోజుకు 1070 మంది ప్రయాణికులకు సేవలందుతాయని వివరించారు.



ప్రకాశం జిల్లా చీమకుర్తి పాదయాత్రలో అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

ఎస్సీ వర్గీకరణ కేంద్రమే పరిష్కరించాలి

పాదయాత్రలో జగన్

ప్రజాశక్తి-చీమకుర్తి (ప్రకాశం)

ఎస్సీ వర్గీకరణ అంశం కేంద్రం పరిధిలో ఉందనీ తనను కలిసిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులకు జగన్ స్పష్టం చేశారు. వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర శనివారం చీమకుర్తి మండలంలో సాగింది. బండ్లమూడి, తొర్రగుడిపాడు ఎస్‌సి కాలనీల వద్ద ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతూ జగన్‌ను కోరారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేశారని గుర్తు చేశారు. దీనికి స్పందించిన జగన్ ఇది తన పరిధిలో లేదని జగన్ చెప్పారు. మండలంలో 30 కిమీ దూరం జగన్ పాదయాత్ర పూర్తి చేసుకున్నారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాల నుంచి జగన్ పాదయాత్ర మొదలైయింది. జగన్‌తోపాటు సంతనూతలపాడు ఎమ్మెల్యే ఆదిమూలపుసురేష్, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి,మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు. చీమలమర్రి, మంచికలపాడు, బండ్లమూడి, బండ్లమూడి ఎస్‌సికాలనీ, తొర్రగుడిపాడు ఎస్‌సికాలనీ, పల్లామల్లి, గాడిపర్తివారిపాలెం మీదుగా పాదయాత్ర సాగింది. సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర గాడిపర్తివారిపాలెం శివారులలో ముగిసింది. శుక్రవారం రాత్రి అక్కడే బస చేస్తారు. చీమలమర్రిలో మహిళలు జగన్‌ను చూడడానికి అధికసంఖ్యలో వచ్చారు. మంచికలపాడులో జెండాను ఆవిష్కరించారు. బండ్లమూడిలో సర్పంచ్ యన్నంశేషిరెడ్డి ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమాలు జరిగాయి.

ఏపీకి హోదా ఇవ్వాల్సిందే

బిజెపి మద్దతు లేకుండా రాష్ట్ర విభజన జరిగిందా?

చట్టంలో పెట్టమని ఎందుకు అడగలేదు

సోషల్ మీడియా ద్వారా హోదా ఉద్యమాన్ని చేపట్టాలి

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనకు ప్రత్యేక హోదా ప్రాతిపదిక అని అన్నారు. విభజన హామీలను, ప్రత్యేక హోదాను విడదీయలేమన్నారు. 'ప్రత్యేక హోదా-ఆంధ్రుల హక్కు-రాష్ట్ర విభజన హామీల అమలు' అనే అంశంపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సెమినార్ జరిగింది. విజయవాడలోని పిబి సిద్దార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఆయన పాల్గొన్నారు. యుపిఎ ప్రభుత్వం విభజించిన తీరువల్లే ఏపీ అస్తవ్యస్తంగా ఉందని ప్రధాని మోడీ మాట్లాడటం సరికాదన్నారు. బిజెపి మద్దతు లేకుండా రాష్ట్ర విభజన జరిగేదా అని ప్రశ్నించారు. బిజెపి అధికారంలోకొచ్చి నాలుగేళ్లయ్యిందని, విభజన చట్టాన్ని మార్పుచేసి ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. రాష్ట్ర విభజనకు సిపిఎం మినహా అన్ని రాజకీయ పార్టీలూ కారణమేనన్నారు. హోదా అమలుకు బిజెపి కుంటి సాకులు చెబుతోందన్నారు. ఆర్థిక వనరులు లేని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వొచ్చన్నారు. విభజన చట్టంలో లేదని, 14వ ఆర్థిక సంఘం ఇవ్వొద్దందని సాకులు వెతుకుతోందన్నారు. హోదాను చట్టంలో పొందుపరిస్తేనే విభజనకు మద్దతిస్తామని బిజెపి విభజన సమయంలో ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. రాజధాని శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని మట్టి-నీళ్లు పవిత్రమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతిలో పెట్టారని, పార్లమెంట్‌లో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ పవిత్రమైనది కాదా అని ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘంలో ఏపీకి హోదా ఇవ్వొద్దని ఎక్కడా లేదన్నారు. ఆర్థిక సంఘం నివేదికపై కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే కృష్ణా-గోదావరి బేసిన్‌లో 50శాతం వాటా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. విభజన చట్టంలో పొందుపరిచిన ఒక్క అంశాన్ని కూడా బిజెపి నేరవేర్చలేదని విమర్శించారు. విభజన వల్ల ఏపీ ఆర్థిక వ్యవస్థ 2024 వరకు అస్తవ్యస్తంగానే ఉంటుందన్నారు. అడిగిన అంశాల్ని కాకుండా అడగని అంశాల్ని బిజెపి ప్రస్తావిస్తోందని, కొత్తగా రాష్ట్రానికి మాత్రం ఏమి చేయలేదని తెలిపారు. ఏపీకి లోటు బడ్జెట్ రూ.16,700కోట్లు ఉంటే కేవలం రూ.3379కోట్లు మాత్రమే విదిలించి ఇక రూ.200 కోట్లు మాత్రమే వస్తాయని చెబుతోందన్నారు. ఒడిశాలో బిజెపికి నష్టం కాబట్టే విశాఖకు రైల్వే జోన్ ఇవ్వడం లేదని వివరించారు. దుగ్గిరాజపట్నం పోర్టుకు పులికాట్ సరస్సు ఉందనే సాకు చూపుతోందన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పాడానికి ఉన్న అడ్డంకి ఏమిటో బిజెపి చెప్పాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో పొందుపరిచిన జాతీయ విద్యాసంస్థల్లో ఒక్క దానికీ పూర్తిగా నిధులు ఇవ్వలేదని వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఒత్తిడి వల్లే ప్రభుత్వాల వైఖరి మారుతుందన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది ఎస్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి యుటిఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్ కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌ఎన్‌ఎల్ రీజనల్ కార్యదర్శి అశోక్ బాబు, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ అధ్యక్షులు యువి కృష్ణయ్య, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబిరెడ్డి, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ అజయ్‌కుమార్, ప్రజారోగ్య వేదిక నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వివాదంపై ప్రపంచబ్యాంక్ ప్రతినిధి పరిశీలన

రైతులతోపాటు సిఆర్‌డిఎ కమిషనర్‌ను కలుస్తామని హామీ

రైతులను చూసి కారు దిగకుండానే వెనుదిరిగిన మంత్రి నారాయణ



రైతు గద్దె మీరా ప్రసాద్ భూమి వద్ద రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ కీర్తి

ప్రజాశక్తి-తుళ్లూరు

సచివాలయం వెనకభాగంలో రోడ్డు నిర్మాణ విషయమై వివాదం నెలకొన్న దృష్ట్యా ఆ ప్రదేశాన్ని కన్సల్‌టెంట్ ఫర్ సోషల్ ఇంఫాక్ట్ టు ది వరల్డ్‌బ్యాంకు అబ్జర్వర్ డాక్టర్ కీర్తి శుక్రవారం పరిశీలించారు. రాజధాని నిర్మాణానికి భూములివ్వని రైతులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆమె ఎదుట రైతులు వాపోయారు. ఈ సందర్భంలో సిపిఎం, వైసిపి నాయకులతో పాటు రాజధాని ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు అక్కడికి చేరుకుని పలు అంశాలను డాక్టర్ కీర్తి దృష్టికి తెచ్చారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతు గద్దె మీరా ప్రసాద్ భూమి ఇవ్వకున్నా ప్రభుత్వం రోడ్డు నిర్మిస్తోందని, కోర్టు స్టేనూ పట్టించుకోవడం లేదని చెప్పారు. తాము రైతు మీరా ప్రసాద్‌కు సంఘీభావంగా వచ్చామని చెప్పిన మరికొందరు రైతులు మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి భూములను బలవంతంగా తీసుకోబోమని చెప్పిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. పొలాల్లో దుమ్ము, ధూళి వల్ల పంటలు పండడం లేదని, పొలాలకు వెళ్లే డొంకరోడ్లను ప్లాట్లుగా యంత్రాలతో దున్నేస్తున్నారని చెప్పారు. భూములు తీసుకునేటప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ, ఉపాధి, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలు అమలవడం లేదన్నారు. సిపిఎం రాజధాని ప్రాంతీయ కార్యదర్శి ఎం.రవి, వైసిపి నాయకులు బత్తుల కిషోర్ మరికొన్ని అంశాలను వివరించారు. అనంతరం డాక్టర్ కీర్తి మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి సంబందించిన అంశాలన్నింటినీ పరిశీలిస్తానని, సిఆర్‌డిఎ కమిషనర్‌ను కలిసి పరిస్థితిని వివరిస్తానని చెప్పారు.

వెనుదిరిగిన మంత్రి కాన్వాయ్

ఇదిలా ఉండగా రైతులతో డాక్టర్ కీర్తి మాట్లాడే సందర్భంలో ఎన్-9 రోడ్డును పరిశీలించేందుకు పురపాలక శాఖ మంత్రి నారాయణ అటుగా వచ్చారు. రోడ్డు వద్ద రైతులు పెద్ద సంఖ్యలో ఉండడం గమనించిన మంత్రి కారు దిగకుండానే వెనుదిరిగారు.



99వ యేట ప్రపంచ రికార్డు

క్వీన్స్‌లాండ్ : వందో వసంతంలోకి అడుగుపెట్టబోతున్న తాత... ఆస్ట్రేలియా స్విమ్మర్ జార్జ్ కారోన్స్(99) ప్రపంచ రికార్డు సృష్టించాడు. శుక్రవారం 50 మీటర్ల ఫ్రీ స్టైయిల్ ఈవెంట్‌ను కారోన్స్ 56.12 సెకండ్లలో పూర్తి చేసి సరికొత్త రికార్డును నెలకొల్పాడు. తన వయసు గ్రూప్‌కు చెందిన వారితో జరిగిన పోరులో కారోన్స్ ఈ రికార్డును సొంతం చేసుకున్నాడు. కామన్వెల్త్ గేమ్స్ స్విమ్మింగ్ ట్రయల్‌లో భాగంగా ఇక్కడ గోల్డ్ కాస్ట్‌లో జరిగిన పోటీల్లో కారోన్స్ అద్భుత ప్రతిభతో ఆకట్టుకున్నాడు. అంతకుముందు ఈ రికార్డు బ్రిటీష్ స్విమ్మర్ జాన్ హారిసన్ పేరిట ఉండేది. 2014లో 50 మీటర్ల ఫ్రీ స్టైయిల్‌ను హారిసన్ 1.31.19 సెకండ్లలో పూర్తి చేయగా... కారోన్స్ దీనిని సవరించాడు. ఏప్రిల్ నెలలో కారోన్స్ వంద ఏట అడుగుపెట్టబోతున్నాడు.

మీడియా స్వేచ్ఛకు భంగం

పోలీసుల వైఖరిపై చర్యలు తీసుకోవాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే పోలీసుల వైఖరిపై పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియాలో పనిచేస్తున్న వారికి కష్ట కాలంలో రక్షణ కల్పించాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరించడం విచారకరమని పేర్కొన్నారు. దీనికి కృష్ణాజిల్లా తిరువూరు పోలీసులు ఉదాహరణగా చెప్పవచ్చని తెలిపారు. స్టేషన్ పరిధిలో కోడిపందేల వార్తల్ని పంపలేదని రాత పూర్వకంగా నివేదిక ఇవ్వాలంటూ విలేకరులపై ఒత్తిడి తేవడం మీడియాను బెదిరించడమేనని ఆయన పేర్కొన్నారు. కోడి పందేల నిర్వహణపై కోర్టు ఇచ్చిన ఉత్తర్వు లుండగా, వాటిని కాదని తిరువూరు పోలీసులు ఇలాంటి వివరణ కోరడం మీడియా స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. జర్నలిస్టుల రక్షణకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటుచేసిన దాడుల నివారణ హైపవర్ కమిటీ జోక్యం చేసుకుని నిజానిజాలు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. హోంశాఖ మంత్రి ఈ విషయాన్ని పరిశీలించి తగిన న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీడియా రక్షణకు, వృత్తిపరమైన విలువలు కాపాడటానికి ప్రజాస్వామిక వాదులంతా అండగా నిలవాలని ఆయన కోరారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68